సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 12 సంచిక: 271

ఆదివారం 22-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

SUNDAY Special



మిస్టర్ అండ్ మిసెస్ కృష్ణంరాజుతో సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ..

ఇప్పటికీ అప్పటిలా..!

- ఫ్యామిలీలో



విజయంతో వీడ్కోలు చెబుతారా!

కటక్‌లో నేడు వెస్టిండీస్‌తో భారత్ చివరి వన్డే

- స్పోర్ట్స్‌లో

## అట్టుడుకుతున్న ఉత్తరప్రదేశ్

- 'పౌర' ఆందోళనల్లో 16కు చేరిన మృతులు
- ఆందోళనకారులే కాల్చుకున్నారన్న యూపీ సర్కార్
- అస్సాం, బెంగాల్‌లలో పరిస్థితులు ప్రశాంతం
- ప్రతిపక్షాల దుష్ప్రచారంపై బీజేపీ కార్యాచరణ

- వివరాలు 5లో



కాన్పూర్‌లో..









రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని కొత్తపల్లి గ్రామంలో ఓ రైతు తన పశువులకు దాణాగా బాలామృతాన్ని వాడిన తర్వాత పొలంలో ఖాళీ ప్యాకెట్లను పారేసిన దృశ్యం

# బ్లాక్ మార్కెట్‌కు బాలామృతం!

### రాష్ట్రవ్యాప్తంగా పంపిణీలో భారీగా గోల్‌మాల్

- అంగన్‌వాడీ కేంద్రాలకు నెలకు సగటున 325 టన్నుల సరఫరా
- కానీ సగం కూడా చేరని వైనం
- వ్యాపారులు, రైతులకు టోకుగా విక్రయిస్తున్న నిర్వాహకులు
- ఫీడ్ దుకాణాలకు మళ్లుతున్న బలవర్ధక ఆహారం
- రికార్డుల్లో మాత్రం సరుకంతా సరఫరా చేసినట్లు నమోదు
- గుడ్లు, నూనె ప్యాకెట్లు, బియ్యం కూడా పక్కదారి!
- నిఘా కొరవడటం వల్లే అక్రమాలు

**సాక్షి, హైదరాబాద్:** బాలల్లో పోషక సమస్యలను అధిగమించే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బాలామృతం దారి తప్పుతోంది. అధికారుల నిఘా కొరవడటం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై పర్యవేక్షణ లోపించడంతో అంగన్‌వాడీలకు చేరుతున్న బాలామృతం లబ్ధిదారుల చెంతకు చేరకుండానే గుట్టు చప్పుడు కాకుండా బ్లాక్‌మార్కెట్‌కు తరలుతోంది. అంగన్‌వాడీ కేంద్రాలను సకాలంలో తెరవకపోవడం, లబ్ధిదారులకు పంపిణీలో జాప్యం చేస్తుండటంతో పేరుకుపోయిన స్టాకును వెనక్కి పంపకుండా నిర్వాహకులు టోకుగా వ్యాపారులు, రైతులకు విక్రయిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బాలామృతం పంపిణీ ప్రక్రియ తంతు ఇదే తరహాలో జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గుడ్లు, నూనె ప్యాకెట్లు, బియ్యం కోటాను కూడా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదులు అందుతున్నాయి.

**మెనూ ప్రకారం ఇవ్వాల్సి ఉన్నా...**

రాష్ట్రంలో 149 సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) ప్రాజెక్టులున్నాయి. ఇందులో 99 ప్రాజెక్టులు గ్రామీణ ప్రాంతాల్లో ఉండగా 25 ప్రాజెక్టులు పట్టణ ప్రాంతాల్లో, మరో 25 ప్రాజెక్టులు గిరిజన ప్రాంతాల్లో ఉన్నాయి. వాటి పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. గత నెల గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 4,31,310 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. అలాగే ఏడు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న చిన్నారులు 10,42,675 మంది, మూడు నుంచి ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులు 6,54,165 మంది ఉన్నట్లు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే

మిగతా 2వ పేజీలో ▶

## 'దిశ' నిందితులకు రీపోస్టుమార్టం

### ఢిల్లీ ఎయిమ్స్ వైద్యులతో చేయించాలి..

### 23 సాయంత్రంలోగా నివేదిక ఇవ్వాలని హైకోర్టు సూచన

### ఆ తర్వాతే కుటుంబసభ్యులకు మృతదేహాల అప్పగింత

### ఎన్‌కౌంటర్‌లో వాడిన ఆయుధాల్ని భద్రపర్చాలని ఆదేశం

**సాక్షి, హైదరాబాద్:** ఎన్‌కౌంటర్‌లో మరణించిన దిశ అత్యాచార నిందితుల మృతదేహాలకు ఢిల్లీ ఎయిమ్స్ వైద్య నిపుణులతో తిరిగి పోస్టుమార్టం నిర్వహించాలని హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 'ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లోని ముగ్గురు ఫోరెన్సిక్ వైద్యులతో కూడిన కమిటీ నలుగురి మృతదేహాలకు ఈనెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా పోస్టుమార్టం నిర్వహించాలి. వైద్యుల కమిటీని తక్షణమే పంపాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎయిమ్స్‌ను కోరాలి. వైద్యుల కమిటీకి ప్రయాణ ఖర్చులు, బస మొదలైన వాటిని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలి. పోస్టుమార్టం నిర్వహించేటప్పుడు వీడియో చిత్రీకరణ చేయాలి. దాన్ని సీడీ లేదా పెన్‌డ్రైవ్‌లో భద్రపరిచి ఈ నెల 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు అందజేయాలి. రెండోసారి పోస్టుమార్టం పూర్తి చేశాక మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు పోలీసుల సమక్షంలో గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ అప్పగించాలి. ఎన్‌కౌంటర్‌లో వినియోగించిన రివాల్వర్ వంటి ఆయుధాలు, లాగ్ రిజిస్టర్, పోలీసు వాహనాల మూమెంట్ రిజిస్టర్ మొదలైన వాటిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) స్వాధీనం చేసుకుని హైదరాబాద్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపాలి. సిట్ ఇచ్చే వాటిపై నివేదికను, పోస్టుమార్టం నివేదికలను సుప్రీంకోర్టు నియమించిన జ్యుడీషియల్ కమిషన్‌కు ప్రభుత్వ అధికారులు అందజేయాలి'అని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, న్యాయమూర్తి జస్టిస్ ఎ.అభిషేక్‌రెడ్డిలతో కూడిన ధర్మాసనం శనివారం ఆదేశాలు జారీ చేసింది.

**వాస్తవాలు వెలుగులోకి రావాలి..**

జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితుడు మరణిస్తే.. సీఆర్పీసీలోని 176 (1)(ఎ) సెక్షన్ కింద జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ లేదా మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మాత్రమే ఆ ఘటనపై విచారణ చేయాలని, అయితే చటాన్‌పల్లి ఎన్‌కౌంటర్ తర్వాత ఆర్డీవో విచారణ చేపట్టినట్లు ప్రభుత్వ తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ సుప్రీంకోర్టులో చెప్పడాన్ని హైకోర్టు ధర్మాసనం తప్పుపట్టింది. 'వాస్తవాలు వెలుగులోకి రావాలి. ప్రజలకు నిజం ఏంటో తెలియాలి. అసలు ఏం జరిగిందో చట్టప్రకారం తేల్చాలి'అని కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్‌కౌంటర్ ఘటనపై కలెక్షన్ ఆఫ్ ఎవిడెన్స్ (ఆధారాల సేకరణ)పై తగిన ఉత్తర్వులు జారీ చేయాలని ఈ నెల 17న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కె.సజన ఇతర మహిళా సంఘాల ప్రతినిధులు,



మిగతా 2వ పేజీలో ▶

## ఉపకార దరఖాస్తులకు ఈ నెల 31 వరకే గడువు

- దరఖాస్తు చేసుకోకుంటే ఉపకారం, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అనర్హులు కానున్న విద్యార్థులు
- మూడుసార్లు అవకాశం ఇవ్వడంతో ఇక పొడిగింపు ఉండదని స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్

పోస్టుమెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం దరఖాస్తుల గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈ ఏడాది జూలైలో ప్రారంభమైన దరఖాస్తుల సమర్పణ గడువు ఆగస్టు నెలాఖరుతో ముగియాల్సి ఉన్నా దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాకపోవడంతో మరికొంత సమయం పెంచాలని ప్రభుత్వాన్ని సంక్షేమ శాఖలు కోరాయి. దీంతో మరో నెల గడువును పెంచుతూ సెప్టెంబర్ నెలాఖరు వరకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయినప్పటికీ సంక్షేమ శాఖల అంచనాల్లో కనీసం 50 శాతం దరఖాస్తులు కూడా రాకపోవడంతో చివరి అవకాశంగా డిసెంబర్ నెలాఖరు వరకు గడువును పొడిగించిన ప్రభుత్వం... ఆ తర్వాత ఎలాంటి మార్పులుండవని, నిర్దేశించిన గడువులోగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించకుంటే అనర్హులవుతారని స్పష్టం చేసింది. 2019–20 విద్యా సంవత్సరంలో 13.45 లక్షల దరఖాస్తులు వస్తాయని అంచనా వేయగా ఇప్పటివరకు 12.05 లక్షల దరఖాస్తులు మాత్రమే వచ్చినట్లు సంక్షేమ శాఖల గణాంకాలు చెబుతున్నాయి. మరో పది రోజుల్లో దరఖాస్తు గడువు ముగియనుండటంతో సంక్షేమ శాఖాధికారులు కాలేజీ యాజమాన్యాలకు ఎస్‌ఎంఎస్‌ల ద్వారా గడువు తేదీని గుర్తు చేస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాలకు సంబంధించిన కాలేజీల విద్యార్థుల నుంచి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు రావాల్సి ఉందని ఆయా జిల్లాల అధికారులు చెబుతున్నారు. ఈ నెల 31 తర్వాత గడువు పెంచే అవకాశం లేకపోవడంతో ఆలోగా దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని కాలేజీల యాజమాన్యాలతోపాటు విద్యార్థులకు సూచనలు చేస్తున్నారు.









## ఏపీలో 3 రాజధానులను స్వాగతించాలి

### సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి చిరంజీవి

**సాక్షి, అమరావతి:** అధికార, పరిపాలన వికేంద్రీకరణతోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి సాధ్యమని.. ఏపీలో మూడు రాజధానుల ఆలోచనను అందరూ స్వాగతించాలని ప్రముఖ సినీనటుడు, కేంద్ర మాజీ మంత్రి కొణిదెల చిరంజీవి ఏపీ ప్రజలను కోరారు. ఇప్పటికే రూ. 3 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న ఏపీలో ఇంకో రూ.లక్ష కోట్ల అప్పుతో అమరావతిని నిర్మిస్తే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన అందరిలో ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. ఏపీ సర్వతోముఖాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తారన్న నమ్మకం ఉందని చిరంజీవి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో రాజధాని రైతుల్లో నెలకొన్న భయాందోళనలు, అభద్రతా భావాన్ని తొలగించాలని సూచించారు. చిరంజీవి ప్రకటన యథాతథంగా..

''శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సులు చూసినా, జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ నివేదిక చదివినా, తాజాగా జీఎన్ రావు కన్వీనర్‌గా ఉన్న నిపుణుల కమిటీ సిఫార్సులు చూసినా అధికార, పరిపాలన వికేంద్రీకరణతోనే రాష్ట్ర (ఏపీ) సమగ్రాభివృద్ధి సాధ్యం అన్నది నిర్వివాదాంశంగా కనిపిస్తోంది. అమరావతి.. శాసన నిర్వాహక, విశాఖపట్నం.. కార్యనిర్వాహక, కర్నూలు.. న్యాయపరిపాలన రాజధానులుగా మార్చే ఆలోచనను అందరం ఆహ్వానించాల్సిన సమయం, స్వాగతించాల్సిన సందర్భం ఇది. ఏపీలో వివిధ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు నిపుణుల కమిటీ చేసిన సిఫార్సులు సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించేవిగా ఉన్నాయి. ఒక్కసారి గతాన్ని పరిశీలిస్తే..

మిగతా 2వ పేజీలో ▶

# 19 ఏళ్లుంటేనే ఓటు హక్కు!

### వచ్చే ఏడాది మున్సిపల్ ఎన్నికల్లో వింత పరిస్థితి.. 2019 జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితా

### 2020 జనవరి లేదా ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు.. ఎన్నికల నాటికి 18 ఏళ్లు వచ్చినా ఓటేయలేరు

సాక్షి, హైదరాబాద్:

త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఓటేసే అదృష్టాన్ని లక్షల మంది నవ ఓటర్లు త్రుటిలో కోల్పోనున్నారు. వచ్చే ఏడాది జనవరి చివరి వారం లేదా ఫిబ్రవరి తొలి వారంలో రాష్ట్రంలోని 121 మున్సిపాలిటీలు, 10 మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలున్నాయి. మున్సిపల్ ఎన్నికల ఓటర్ల జాబితా రూపకల్పనకు 2019 జనవరి 1వ తేదీని రాష్ట్ర ఎన్నికల సంఘం అర్హత తేదీగా ఖరారు చేసింది. 2020 షెడ్యూల్ ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘం వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా తుది ఓటర్ల జాబితా ప్రకటించనుంది. ఈ జాబితాను ప్రాతిపదికగా తీసుకుంటే మున్సిపల్ ఎన్నికలను మార్చిలో నిర్వహించాల్సి ఉంటుంది. మార్చి నుంచి మే వరకు వరుసగా పరీక్షలు ఉండటంతో ఎన్నికలు వాయిదా వేసుకోక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికలను ఎలాగైనా జనవరి/ఫిబ్రవరిలో నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 2019 జనవరి 1 అర్హత తేదీగా ఓటర్ల జాబితాను రూపొందిస్తోంది.

**నోటిఫికేషన్ వరకు ఓటర్ల నమోదు..**

2019 జనవరి 1 నాటికి 18 ఏళ్లు కలిగి ఉండి మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే నాటికి అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో పేరు కలిగి ఉన్న వారందరికీ ఓటేసే అవకాశం కల్పిస్తామని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారవర్గాలు పేర్కొన్నాయి. ఈ నెల 16న కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన అసెంబ్లీ నియోజకవర్గాల ముసాయిదా ఓటర్ల జాబితాలో చోటు సంపాదించని, అర్హులైన పౌరులు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల తేదీ నాటికి ఓటరుగా నమోదు చేసుకుంటే ఓటు హక్కు పొందుతారని ఓ అధికారి 'సాక్షి'కి తెలిపారు. వార్డు/డివిజన్ల వారీగా మున్సిపాలిటీలు/కార్పొరేషన్ల ఓటర్ల జాబితాను మరో వారం రోజుల్లో ప్రకటిస్తామని రాష్ట్ర పురపాలక శాఖ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత నుంచి ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.

**పురపోరుపై కీలక సమావేశం**

పురపోరుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నద్ధమవుతోంది. ఎన్నికలకు త్వరలోనే నగారా మోగించేందుకు సిద్ధమవుతున్న ఈసీ.. మంగళవారం మున్సిపల్ కమిషనర్లతో సన్నాహక సమావేశం నిర్వహిస్తోంది. ఈ మేరకు నగరపాలక సంస్థలు, పురపాలక సంస్థల కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసింది. వార్డుల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణ, ఎన్నికల నిర్వహణపై తదితర అంశాలపై సమీక్షించనుంది. డిసెంబర్ 16న ప్రచురించిన అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్ల ముసాయిదా జాబితాకు అనుగుణంగా పట్టణ ఓటర్లను గుర్తించాలని ఎస్‌ఈసీ తాజాగా ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ నెల 16న ప్రచురించిన అసెంబ్లీ ఓటర్ల ముసాయిదా జాబితాకు అనుగుణంగా మున్సిపల్ ఓటర్ల జాబితాలను తయారు చేయాలని సూచించింది. ఈ జాబితా మేరకు పట్టణ ఓటర్లను గుర్తించి.. వార్డుల వారీగా జాబితాలను సరిచూసుకోవాలని స్పష్టం చేసింది. వార్డుల పునర్విభజనకు అనుగుణంగా ఓటర్లు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పంద్రాగస్టులోపు ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనతో జూలై 16న పురపాలక సంస్థల ఓటర్ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం ప్రచురించింది.



# యువతరం కదిలింది

**పౌర ఆగ్రహం పొగలు సెగలు కక్కింది.**
**రేపిస్టులపైనా, అక్కరకు రాని చట్టాలపైనా..**
**పాలకులపైనా, ప్రమాదకరంగా మారిన పర్యావరణంపైనా..**
**అవినీతిపైనా, అసమానతలపైనా...**
**యువతరం పిడికిలి బిగించి కదం తొక్కింది.**
**భారత్ నుంచి హాంకాంగ్ వరకు..**
**లెబనాన్ నుంచి చిలీ వరకు నిరసనలు మిన్నంటాయి.**

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు హింసాత్మకంగా మారుతున్నాయి. పోలీసుల తూటాలు ఆందోళనకారుల గుండెల్లో దిగుతున్నాయి. అయినా జనం రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపడుతున్నారు. ఇలాంటి ఆందోళనలు భారత్‌కే పరిమితం కాలేదు. పాలకులు తప్పుదారిలో నడిస్తే సరైన దారిలో పెడతామంటూ ప్రపంచ వ్యాప్తంగా నవతరం నినదిస్తోంది. అందుకే 2019ని నిరసనల సంవత్సరంగా అభివర్ణిస్తున్నారు. ఈ ఏడాది వివిధ దేశాల్లో ఉవ్వెత్తున ఎగిసిపడిన ఆందోళనలే ఇవాల్టి సండే స్పెషల్..

# దిశా నిర్దేశం...



పౌరసత్వ చట్ట సవరణలు దేశాన్ని కుదిపేయడానికి కొద్ది రోజుల ముందు రేపిస్టులకు వ్యతిరేకంగా మన తెలుగు గడ్డపై జరిగిన ఉద్యమం యావత్ దేశానికి పాకింది. డాక్టర్ దిశ అత్యాచారం, హత్య ఈ ఏడాది దేశంలో ప్రకంపనలు రేపింది. నవంబర్ 27 రాత్రి షాద్‌నగర్‌లో ఒక అమాయకురాలిపై వలపన్ని టోల్ ప్లాజాకు కూతవేటు దూరంలో నలుగురు మృగాళ్లు అత్యాచారం చేయడమే కాకుండా, బతికుండగానే పెట్రోల్ పోసి తగులబెట్టడం సామాన్యుల్ని దహించి వేసింది. జనం స్వచ్ఛందంగా రోడ్డెక్కారు. ఢిల్లీ నుంచి గల్లీ వరకు రేపిస్టులకి వ్యతిరేకంగా నిరసనలు మిన్నంటాయి. 2012లో నిర్భయ ఉదంతం తర్వాత అత్యాచారాలకు వ్యతిరేకంగా యువతరం స్వచ్ఛందంగా కదిలిరావడం ఇదే. దిశపై అఘాయిత్యం జరిగి వారం తిరక్కుండానే డిసెంబర్ 6న నిందితులు పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఎన్‌కౌంటర్‌కు వ్యతిరేకంగా అక్కడక్కడ నిరసన స్వరాలు వినిపించినప్పటికీ సామాన్యులు శభాష్ అన్నారు. మన న్యాయవ్యవస్థలో జరిగే జాప్యం పట్ల ప్రజలు ఎంత విసిగిపోయారో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. అమ్మాయిల భద్రత గాల్లో దీపంలా మారడంతో ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి.. అత్యాచార కేసుల్లో సత్వర న్యాయం జరిగేలా దిశ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం ప్రకారం అత్యాచారం కేసుల్లో 21 రోజుల్లో విచారణ పూర్తి చేసి దోషులకు శిక్ష విధిస్తారు. ఇప్పుడు ఈ దిశ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. మహారాష్ట్ర కూడా ఈ తరహాలో చట్టం చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించింది.



## బాధ్యతల స్వీకరణ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయవాది టి.సూర్యకరణ్‌రెడ్డి సౌత్ జోన్ నుంచి (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు) కేంద్రం తరపున వాదించేందుకు అదనపు సొలిసిటర్ జనరల్‌గా శనివారం బాధ్యతలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సుల అనంతరం రాష్ట్రపతి ఆయనను నియమించారు. హైకోర్టు ఆవరణలోని ప్రత్యేక చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నాక మర్యాదపూర్వకంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్‌ను సూర్యకరణ్‌రెడ్డి కలిశారు.

## కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు

**2020 ఫిబ్రవరి 15 వరకు దరఖాస్తుకు అవకాశం**

**సాక్షి, హైదరాబాద్:** దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, కర్మాగారాలు, ఇతర సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలకు తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ద్వారా ఉపకారవేతనాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా 2018–19 విద్యా సంవత్సరంలో పదో తరగతి నుంచి పీజీ వరకు ఏదైనా కోర్సు పూర్తి చేసిన కార్మికుల పిల్లలు సంబంధిత కార్మిక కమిషనర్ కార్యాలయం నుంచి దరఖాస్తును పొందాలని, వాటిని పూర్తి వివరాలతో పూరించి 2020 ఫిబ్రవరి 15వ తేదీలోగా కార్మిక శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి ఒక ప్రకటనలో తెలిపింది. 2018–19 విద్యా సంవత్సరంలో పదో తరగతి నుంచి పీజీ పూర్తి చేసిన అభ్యర్థులే అర్హులని, రూ.1,000 నుంచి రూ.2,000 వరకు ఉపకారవేతనాన్ని ఇవ్వనున్నట్లు తెలిపింది. మరిన్ని వివరాలకు సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయంలో సంప్రదించాలని సూచించింది.

## 'ఆ టీచర్లకు ఆర్జిత సెలవులు'

సాక్షి, హైదరాబాద్: ఏప్రిల్–2019లో జరిగిన డీఈడీ (డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి, రెండో సంవత్సరం పరీక్షల్లో విధులు నిర్వహించిన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఇన్విజిలేటర్లకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుడు బి.సుధాకర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలకు అనుగుణంగా వారికి ఈఎల్స్ ఇవ్వాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆయన స్పష్టం చేశారు. గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ వినతి మేరకు స్పందించిన సర్కార్ పరీక్షల విభాగం పైవిధంగా ఆదేశాలు జారీ చేసింది.

## ఏపీ సీఎం జగన్‌కు కేటీఆర్ శుభాకాంక్షలు



**సాక్షి, హైదరాబాద్:** ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారక రామారావు శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎం జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు' అని ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. దీంతోపాటు జగన్‌తో కరచాలనం చేస్తున్న ఫొటోను కేటీఆర్ షేర్‌చేశారు.

## ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలిగా సృజన

**సాక్షి, హైదరాబాద్:** భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ) రాష్ట్ర అధ్యక్షురాలిగా ఉస్తెల సృజన, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం. సదాలక్ష్మి, ఉపాధ్యక్షులుగా పోటు కళావతి, ఎస్.ఛాయాదేవి, జి.వరమ్మ, యాదమ్మ, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జ్యోతి, కోశాధికారిగా ఎం.నళిని ఎన్నికయ్యారు. ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూ రాష్ట్ర నిర్మాణ కౌన్సిల్ సమావేశాల్లో ఈ కొత్త కమిటీని ఎన్నుకున్నారు.

## ఏఎస్ఐ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రఘురాం

**సాక్షి, హైదరాబాద్:** అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) 82వ అధ్యక్షునిగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రొమ్ము కేన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ పి.రఘురాం బాధ్యతలు స్వీకరించారు. శనివారం ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన ఏఎస్ఐ సర్వసభ్య సమావేశంలో ప్రొఫెసర్ అరవింద్ కుమార్ చేతుల మీదుగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఏడాది క్రితమే ఆయన అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ.. తాజాగా ఆయన బాధ్యతలు స్వీకరించారు. 2020 డిసెంబర్ వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

# మార్పు మంచికే..!

**25 రోజుల్లో సరికొత్త ఆర్టీసీ ఆవిష్కరణ.. సమ్మెకు పూర్వం - ఆ తర్వాత .. ఎంత తేడా**

సాక్షి, హైదరాబాద్

ఓ 25 రోజుల క్రితం.. అసలు ఆర్టీసీ మనుగడ ఏంటన్న పరిస్థితి. సంస్థ ఉంటుందా లేదా అన్న అనుమానం. మోయలేని నష్టాలు, భరించలేని అప్పులు.. ఆర్టీసీని దెబ్బతీశాయి. అలాంటి ఆర్థిక సంక్షోభంతోనే రికార్డుస్థాయి సమ్మె జరిగేలా చేసింది. కానీ... సమ్మెకు పూర్వం ఆర్టీసీలో పరిస్థితి, ప్రస్తుత స్థితిలో ఎంతో తేడా. పని ప్రారంభించిన ఈ 25 రోజుల్లో ప్రత్యక్షమైన వాతావరణానికి గత స్థితికి పొంతనే లేదు. ఇటు కార్మికుల్లో, అటు అధికారుల ప్రవర్తనలో కొట్టొచ్చే తేడా.. వెరసి ఆర్టీసీ స్వరూపాన్నే మార్చే సంకేతాలిస్తున్నాయి. ఆర్టీసీ ఉండదేమో అనుకున్న స్థితిలో ఆందోళనకు గురైన సిబ్బంది, అధికారులు... సంస్థ కొనసాగటంతో ఊరట చెంది కొత్త ఉత్సాహంతో సవాల్‌గా స్వీకరించి పని ప్రారంభించమే దీనికి కారణం. సమ్మె ముగిసిన వారంలోపే ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు డిపోకు ఐదుగురు చొప్పున సిబ్బందితో ప్రగతిభవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశం ఆ జోష్‌ను మరింత పెంచింది. వారి సమస్యలు తెలుసుకుని అప్పటికప్పుడు వరాల జల్లు కురిపించటమే కాకుండా, అధికారులు–కార్మికులు అన్న తేడా లేకుండా అంతా కలిసి సుహృద్భావ వాతావరణంలో పనిచేయాలంటూ చేసిన సూచనలు మంచి మార్పును తెచ్చాయి. కిలో మీటరుకు 20 పైసలు చొప్పున పెరిగిన చార్జీలు తెచ్చే అదనపు ఆదాయం కంటే.... ఇరుపక్షాల్లో వచ్చిన మార్పు వల్ల మన స్ఫూర్తిగా పనిచేసే తత్వం పెరిగి సంస్థ పురోగతిలో కనిపిస్తున్న బూస్టప్ పెద్దది. ఈ 25 రోజుల్లో మారిన పరిస్థితిపై అధికారులు ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇలా...

| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| గైర్హాజరీ: | 10 % | 03% |

సమ్మెకు పూర్వం చాలా డిపోల్లో చెప్పా పెట్టకుండా సిబ్బంది గైర్హాజరవటం ఉండేది. డ్యూటీ బుక్కైన తర్వాత కొందరు కండక్టర్లు, డ్రైవర్లు ఉన్నఫళంగా విధులకు గైర్హాజరయ్యేవారు. వేరే సిబ్బందిని కేటాయించే వీలు లేక కొన్ని సర్వీసులు డిపోలకే పరిమతమయ్యేవి. సగటున పది శాతం మంది సిబ్బంది ఈ జాబితాలో ఉండేవారు. ఫలితంగా ప్రయాణికులకు, ఆదాయం పరంగా ఆర్టీసీకి ఇబ్బందులు తలెత్తేవి. ఇప్పుడు తీరు మారింది. ఆరోగ్య సమస్యలతో మినహా ఈ తరహా గైర్హాజరీ 3 శాతానికి తగ్గిపోయింది.

| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| పంక్చువాలిటీ: | 88% | 95% |

ప్రతి బస్సుకు సమయం ఉంటుంది. దాని ఆధారంగా సిబ్బంది డ్యూటీ సమయాలు షెడ్యూల్ అవుతాయి. కానీ మొత్తం సిబ్బందిలో సగటున 12 శాతం మంది దీన్ని పాటించేవారు కాదు. సరిగ్గా బస్సు బయలుదేరేవేళకు వచ్చేవారు. బస్సు సిద్ధం చేసుకుని భద్రత పరమైన వ్యవహారాలు చూసుకుని బస్సు హ్యాండ్ ఓవర్ చేసుకునే డ్యూటీ టేకింగ్ ఓవర్‌కు 20 నిమిషాల సమయం అవసరం. దీంతో బస్సు ఆలస్యంగా బయలుదేరాల్సి వచ్చేది. దీనివల్ల అన్ని పాయింట్లకు బస్సు ఆలస్యంగా వెళ్లేది. ఇప్పుడు సగటున 5 శాతం మంది తప్ప మిగతావారంతా రావాల్సిన సమయానికి కనీసం ఐదు నిమిషాలు ముందే ఉంటున్నారు.

| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| పద్ధతిగా బస్సు: | 60% | 95% |

బస్సు ఏ ప్రాంతానికి వెళ్తుందో తెలియాలంటే ముందు, వెనక బోర్డు ఉండాలి. తర్వాత సీట్లు, ఫ్లోర్ చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉండాలి. ఇదంతా డ్రైవర్, కండక్టర్లపై ఆధారపడి ఉంటుంది. గతంలో దాదాపు 40 శాతం మంది ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించేవారు. అందుకే చాలా బస్సులు దుమ్ముకొట్టుకుపోయి ఉండటం, బస్సుల్లో ఊరిపేరుతో ఉండే బోర్డుల మార్పు పంక్చువల్‌గా లేకపోవటం, వెనకవైపు బోర్డులు ఏర్పాటు చేయకపోవటంలాంటి ఫిర్యాదులు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు వందలో ఐదు తప్ప అన్నీ పద్ధతిగా తిరుగుతున్నాయి.



| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు: | 20% | 5% |

ప్రయాణికులున్నా బస్సు ఆపకపోవటం, టికెట్ల జారీ, చిల్లర ఇచ్చే విషయం, ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తించటం... గతంలో ప్రతి డిపోలో సగటున నిత్యం మూడు నుంచి నాలుగు ఫిర్యాదులు ప్రయాణికుల నుంచి అందేవి. డ్రైవర్లు, కండక్టర్లు ప్రయాణికులతో దురుసుగా వ్యవహరిస్తున్నారంటూ ఉన్నతాధికారులకూ ఫిర్యాదులు వచ్చేవి. 20 శాతం మందిపై ఈ తరహా ఫిర్యాదులుండేవి. ఇప్పుడవి 5 శాతానికి పడిపోయాయి. ఇప్పుడు చెయ్యెత్తినా బస్సు ఆపుతున్నారు.

| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| స్వచ్ఛంద ట్రిప్పుల రద్దు: | 8% | 0.2% |

8 గంటల డ్యూటీ విషయంలో సిబ్బంది పట్టింపుగా ఉంటారు. రకరకాల కారణాలతో చివరి ట్రిప్పు ఆలస్యంగా మారినప్పుడు కొందరు మధ్యలోనే దాన్ని మళ్లించి డిపోకు వచ్చేవారు. ఇలా బస్సులు తిరగాల్సిన మొత్తం కిలోమీటర్లలో నిత్యం సగటున 8 శాతం కోతపడేది. ఇప్పుడు అది కేవలం 2 శాతంగా ఉంటోంది.

| | అప్పుడు | ఇప్పుడు |
|---|---|---|
| సిబ్బంది- అధికారుల మధ్య సత్సంబంధాలు: | 80% | 90% |

కార్మిక సంఘాల ఎన్నికలు విషయంలో తప్ప కొత్త సమస్యలు పెద్దగా లేవు. దీంతో గతంతో పోలిస్తే సంబంధాలు మెరుగుపడ్డాయి. తొలి పక్షం రోజులు మరింత మెరుగ్గా ఉంది. గత వారం రోజులుగా కొన్ని డిపోల్లో స్వల్ప వివాదాలు చోటు చేసుకుంటున్నాయి.

## టికెట్ లేకుంటే రూ.500 జరిమానా

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ బస్సుల్లో టికెట్ లేకుండా ప్రయాణించే వారికి గరిష్ఠంగా రూ.500 జరిమానా విధించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. గతంలో బస్సుల్లో టికెట్‌లేని ప్రయాణికులు దొరికితే కండక్టర్లపై కూడా బాధ్యతారాహిత్యం పేరుతో క్రమశిక్షణ చర్యలు తీసుకునేవారు. ఇది తమ ఉద్యోగ భద్రతకు ముప్పుగా ఉందని, దాన్ని తొలగించాలని చాలా కాలంగా కండక్టర్లు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. దీంతో ఇప్పుడు టికెట్ లేకుంటే పూర్తి బాధ్యత ప్రయాణికులపైనే ఉండనుంది. అయితే డబ్బులు వసూలు చేసి టికెట్ ఇవ్వని పరిస్థితుల్లో మాత్రం కండక్టర్లను బాధ్యులను చేయనున్నారు. ఈ గరిష్ట జరిమానా విషయాలపై ముమ్మరంగా ప్రచారం చేయాలని వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ప్రకటనల రూపంలో ప్రచారం చేయాలని ఆర్టీసీ జారీచేసిన ఉత్తర్వుల్లో సూచించింది.

# బ్లాక్ మార్కెట్‌కు బాలామృతం!

▶ మొదటి పేజీ తరువాయి

చిన్నారులకు మెనూ ప్రకారం పాలు, గుడ్డు, భోజనంతోపాటు బాలామృతంతో చేసిన పదార్థాలను పంపిణీ చేయాలి. దీనికి అదనంగా ఇంటి వద్ద కూడా తినేందుకు వీలుగా నిర్దేశిత మొత్తాన్ని ప్యాకెట్ రూపంలో ఇవ్వాలి. కానీ చాలా చోట్ల బాలామృతం పంపిణీ జరగట్లేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన సాగకపోవడం, తెరిచిన సమయంలో పిల్లల హాజరు లేకపోవడంతో బాలామృతం పంపిణీ ఆశించిన స్థాయిలో లేదు.

### పంపిణీ కాదు... వెనక్కు రాదు...

అంగన్‌వాడీలకు సరఫరా చేసే బాలామృతం స్టాకును చిన్నారులకు ఇవ్వడంలో అవకతవకలు జరుగుతున్న అంశంపై ఫిర్యాదులు అధికంగా ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరేళ్లలోపు చిన్నారులు దాదాపు 17 లక్షల మంది నమోదైనప్పటికీ వారి హాజరు శాతం ఆధారంగా బాలామృతాన్ని సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వం నెలకు సగటున 325 మెట్రిక్ టన్నుల బాలామృతాన్ని పంపుతున్నా ఇందులో సగం కూడా పిల్లలకు చేరడం లేదనే ఆరోపణలున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే చిన్నారుల్లో మూడేళ్లలోపు వారికి రోజుకు వంద గ్రాములు, ఆరేళ్లలోపు వారికి రోజుకు 50 గ్రాముల చొప్పున బాలామృతాన్ని ఇవ్వాలి. వాటికి అధనంగా ప్రతిరోజూ పాలు, ఉడికించిన కోడిగుడ్డు, మినీ మీల్ ఇవ్వాలి. మూడేళ్లలోపు చిన్నారికి అదనంగా తల్లిపాలు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ మెజారిటీ అంగన్‌వాడీ కేంద్రాలు సమయానికి తెరుచుకోవడం లేదు. కొన్నిచోట్ల తెరిచినప్పటికీ చిన్నారుల హాజరు శాతం ఆశాజనకంగా లేదు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలామృతం, ఇతర ఆహారాల పంపిణీ అంతంత మాత్రంగానే ఉంటోంది. అయితే నెలావారీగా ఈ కేంద్రాలకు ప్రభుత్వం స్టాకు పంపిణీ చేస్తున్నప్పటికీ అంతటా పూర్తిస్థాయి కోటాను లబ్ధిదారులకు ఇస్తున్నట్లు రికార్డులున్నాయి. ఎక్కడ కూడా స్టాకు మిగిలిందంటూ తిరిగి వెనక్కు పంపడమో లేదా తదుపరి కోటాను తగ్గించి తీసుకోవడమో చోటుచేసుకోవట్లేదు. మరి పంపిణీ కాని స్టాకు ఎక్కడికి వెళ్తోందనే దానిపై అధికారులకు సందేహాలున్నప్పటికీ ఇప్పటిదాకా చర్యలు మాత్రం లేవు. చాలాచోట్ల బాలామృతం కోటాను రైతులకు, ఇతర ఫీడ్ దుకాణాలకు నిర్వాహకులు విక్రయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. బాలామృతాన్ని పశువుల దాణాగా చాలా మంది రైతులు వినియోగిస్తున్నట్లు సమాచారం.

### బాలామృతం అంటే...

చిన్నారులకు అత్యధిక పోషకాలు అందేందుకు వీలుగా ప్రత్యేకంగా తయారు చేసిన ఆహారమే బాలామృతం. పాలపొడితోపాటు బియ్యం, గోదుమలు, శనగలు, చక్కెర ముడిపదార్థాలతో దీన్ని తయారు చేస్తారు. వంద గ్రాముల బాలామృతం తినిపించే బాలలకు 11 గ్రాముల ప్రొటీన్లు, 367 మిల్లీగ్రాముల కాల్షియం అందడంతోపాటు మొత్తంగా 414 కేలరీల శక్తి లభిస్తుంది. మూడేళ్లలోపు చిన్నారులకు రోజుకు సగటున వంద గ్రాముల బాలామృతాన్ని (బాలామృతంతోపాటు తల్లి పాలు, ఘనాహారం కూడా ఇవ్వాలి) అందిస్తే సమతుల్య పోషకాహారం అందినట్లే.

### ఆకస్మిక తనిఖీలు...

అంగన్‌వాడీల ద్వారా పిల్లలకిచ్చే పోషకాహార పంపిణీపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తుండటంతో అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. క్షేత్రస్థాయిలో వాటి నిర్వహణ ఎలా ఉందనే అంశంపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ప్రాథమికంగా నిర్ణయించారు. తనిఖీలకు సంబంధించి కార్యాచరణ రూపొందించాలని, గోప్యంగా పర్యటనలు సాగాలని నిర్ణయించినట్లు సమాచారం. తనిఖీలు ఎలా చేయాలి? తనిఖీల్లో ఎవరెవరు ఉండాలనే అంశంపై ఆ శాఖలో చర్చ జరుగుతోంది. త్వరలోనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాల స్థితిని తేల్చేందుకు రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కసరత్తు చేస్తోంది.

### సెంటర్ తెరవరు... సరుకు ఇవ్వరు

మా ఊర్లోని అంగన్‌వాడీ కేంద్రం ఎన్నడూ టైమ్‌కు తెరుచుకోదు. ఆలస్యంగా తెరిచినప్పటికీ బాలామృతంతోపాటు గుడ్లు, బియ్యం, నూనె ప్యాకెట్ల కోటాను పంపిణీ చేయరు. ఎందుకు ఇవ్వట్లేదని అడిగితే సరుకులు రాలేదని చెబుతున్నారు. సరుకులు వచ్చేదెన్నడో, ఇచ్చేదెన్నడో అర్థమే కాదు. అందుకే సెంటర్‌కు రావడమే మానేశాం.

*– శ్రీనివాస్, ఓ రెండేళ్ల బాలుడి తండ్రి, రంగారెడ్డి జిల్లా*

### విరేచనాలవుతున్నాయి

మా దగ్గరున్న అంగన్‌వాడీ సెంటర్‌లో బాలామృతం ఇస్తున్నా అది తినిపించిన వెంటనే పాపకు విరేచనాలవుతున్నాయి. నాలుగైదు సార్లు తినిపిస్తే మోషన్స్ కావడంతో తినిపించడం మానేశా. బాలామృతం బదులు ఇంటి దగ్గరే ఇతర ఆహారం తినిపిస్తున్నా.

*– స్వాతి, ఏడాదిన్నర బాలిక తల్లి, రంగారెడ్డి జిల్లా*

# ఏపీలో 3 రాజధానులను స్వాగతించాలి

▶ మొదటి పేజీ తరువాయి



1956 తర్వాత అభివృద్ధి, పరిపాలన అంతా హైదరాబాద్‌లోనే కేంద్రీకృతమైంది. 2014లో రాష్ట్ర విభజన తర్వాత రిక్తహస్తాలతో అమరావతికి చేరుకున్న ఆంధ్రులు తిరిగి పాత తప్పులను పునరావృతం చేస్తే భావితరాలు క్షమించవు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మిగతా ప్రాంతాలను నిర్లక్ష్యం చేయడంవల్ల ఆర్థిక, సామాజిక సమతుల్యత దెబ్బతినడంతో అనేక సమస్యలు పేరుకుపోయాయి. ఇప్పటికే రూ. 3 లక్షల కోట్ల అప్పుల్లో ఉన్న రాష్ట్రంలో ఇంకో రూ. లక్ష కోట్లు అప్పుతో అమరావతిని నిర్మిస్తే వెనుకబడ్డ ఉత్తరాంధ్ర, రాయలసీమ పరిస్థితి ఏమిటన్న ఆందోళన అందరిలో ఉంది. సాగు, తాగు నీరు, ఉపాధి అవకాశాల్లేక వలసపోతున్న కూలీల భవిష్యత్, నిరుద్యోగులకి ఈ మూడు రాజధానుల ఆలోచన భద్రతనిస్తుందన్న భరోసా కలుగుతోంది. ఆ అమరావతిని నిర్మించడానికి ప్రతిపాదించిన రూ. లక్ష కోట్లతో 3 ప్రాంతాల్లో రాజధానులు నిర్మిస్తే ఎవరినీ విస్మరించలేదన్న భావన కలుగుతుందని అనడంలో ఎలాంటి సందేహంలేదు. అయితే, ఇదే సమయంలో రాజధాని రైతులలో నెలకొన్న భయాందోళనలు, అభద్రతా భావాన్ని తొలగించాలి. వారు నష్టపోకుండా, న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఆలాగే, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అపోహలు, అపార్థాలు నివారించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నంచేస్తుందన్న నమ్మకం ఉంది. ప్రజల ఆకాంక్షలు, సవాళ్లపై నిపుణుల కమిటీ విస్తృతంగా పరిశీలన చేసినట్లు భావిస్తున్నాను. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రాజధాని సహా అన్ని రంగాల్లో అభివృద్ధి కోసం నిపుణుల కమిటీ చేసిన సూచించిన వ్యూహాన్ని సీఎం జగన్ ప్రణాళికాబద్ధంగా అమలుచేస్తారని విశ్వసిస్తున్నాను''అని చిరంజీవి అందులో వివరించారు.

# 'దిశ' నిందితులకు రీపోస్టుమార్టం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రజాసంఘాలు సంయుక్తంగా దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యంపై శనివారం హైకోర్టు విచారణ జరిపింది. దిశ హత్యాచార ఘటనపై ప్రజాగ్రహం వ్యక్తం కావడంతో 'తక్షణ న్యాయం'పేరుతో నిందితులు మహమ్మద్ ఆరిఫ్, జొల్లు శివ, జొల్లు నవీన్, చింతకుంట చెన్నకేశవులను ఎన్‌కౌంటర్‌లో హతమార్చారని, సీబీఐ దర్యాప్తు చేసేలా ఉత్తర్వులు జారీ చేయాలని సజన, ఇదే మాదిరిగా మరో ఐదు పిల్స్ కూడా దాఖలయ్యాయి.

### మృతదేహాలు సగం పాడయ్యాయి..

ధర్మాసనం ఆదేశాలకు అనుగుణంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి.శ్రవణ్ కుమార్ స్వయంగా హాజరై ధర్మాసనం అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పారు. మృతదేహాలను గాంధీ ఆస్పత్రిలో భద్రంగా ఉంచామని, ఇప్పటికే మృతదేహాల అంతర్గత భాగాలు 50 శాతం వరకు చెడిపోయాయని, మరో ఐదారు రోజులు ఉంచితే మృతదేహాలు బయట కూడా చెడి పూర్తిగా పాడైపోతాయని చెప్పారు. మైనస్ 5 నుంచి 10 డిగ్రీల ఉష్ణోగ్రతలో భద్రపర్చేందుకు దేశంలో ఎక్కడా వసతుల్లేవని తెలిపారు. 2 నుంచి 4 డిగ్రీల మధ్య మృతదేహాల్ని భద్రపరిచామన్నారు.

### ఎన్‌కౌంటర్ బోగస్..

పిటిషనర్ సజన తరఫు సుప్రీంకోర్టు న్యాయవాది వింద్రా గ్రోవర్ వాదిస్తూ.. ఇవి ప్రభుత్వ అధీనంలో జరిగిన హత్యలని అభివర్ణించారు. పిటిషనర్లు మహిళలు, బాలికల హక్కుల గురించి పోరాడుతున్నారని, హత్యాచార ఘటనలపై ఆందోళనలు చేస్తారని, అయితే దిశ హత్యాచార కేసులో నిందితులకు చట్ట ప్రకారం శిక్షలు పడాలని కోరుకుంటున్నారని వివరించారు. తక్షణ న్యాయం పేరుతో చట్టాలను చేతుల్లోకి తీసుకున్నప్పుడు మౌనంగా ఉంటే అరాచకాలకు తెర తీసినట్లవుతుందని పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ ఘటనపై ఆధారాల సేకరణ, మృతదేహాల అప్పగింత అంశంపై హైకోర్టు ఉత్తర్వులివ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించిందని, మృతదేహాలకు రెండోసారి పోస్టుమార్టం చేస్తేనే ఆధారాలు సేకరించినట్లు కాదని చెప్పారు. నిందితులు జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా ఉన్నత స్థాయి శిక్షణ పొందిన పోలీసులు తమ కస్టడీకి తీసుకున్నారని, ఆ పోలీసులు అందరి దగ్గర ఆయుధాలు ఉంటే నిరాయుధులైన నిందితులు వాటిని లాక్కొని కాల్పులు జరపబోతే పోలీసులు ఎన్‌కౌంటర్ చేశామని చెప్పడం కట్టుకథేనని వివరించారు. ఎన్‌కౌంటర్ జరిగాక సీనియర్ పోలీసులు, మంత్రులు సైతం ఘనకార్యం జరిగినట్లుగా స్పందించి వేడుకలు చేసుకున్నారని, తక్షణ న్యాయం పేరుతో పౌర హక్కుల్ని కాలరాశారని చెప్పారు.

### ఏం జరిగిందంటే..

దిశ హత్యాచార ఘటన తొండుపల్లి టోల్‌గేట్ సమీపంలో నవంబర్ 27న జరిగింది. ఘటనా స్థలానికి ఈ నెల 6న నిందితుల్ని పోలీసులు తీసుకువెళ్తుండగా చటాన్‌పల్లిలో ఎన్‌కౌంటర్ జరిగింది. దీనిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అదే రోజే సాయంత్రం పలు మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు హైకోర్టుకు ఫిర్యాదు చేశాయి. దీనిని పిల్‌గా పరిగణించిన హైకోర్టు అదే రోజు రాత్రి న్యాయమూర్తి తన నివాసంలో ధర్మాసనం ప్రత్యేకంగా సమావేశమై విచారణ జరిపింది. అప్పటికే మృతదేహాలకు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రిలో గాంధీ ఆస్పత్రికి చెందిన వైద్య నిపుణులు పోస్టుమార్టం నిర్వహించారు. ఇదే సమయంలో మృతదేహాల్ని భద్రంగా ఉంచాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత సుప్రీంకోర్టులో నేరుగా పిల్స్ దాఖలు కావడంతో ఎన్‌కౌంటర్ ఘటనపై జ్యుడీషియల్ కమిషన్ విచారణకు ఆదేశాలు వెలువడ్డాయి. హైకోర్టు సహా అన్ని రకాల విచారణలపై స్టే విధించింది. ఈ నేపథ్యంలో మృతదేహాలు పాడవ్వకుండా మహబూబ్‌నగర్ నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది.

### వద్దంటూనే ఒప్పకున్న ప్రభుత్వం

ప్రభుత్వం తరపున ఏజీ బీఎస్ ప్రసాద్ వాదిస్తూ.. హైకోర్టు ఆదేశాల మేరకే నలుగురి మృతదేహాలకు గాంధీ ఆస్పత్రి వైద్య నిపుణులతో పోస్టుమార్టం నిర్వహించామని, కోర్టు ఆదేశాల మేరకే మృతదేహాల్ని భద్రపర్చామని, మళ్లీ పోస్టుమార్టం చేయాల్సిన అవసరం లేదన్నారు. రెండోసారి పోస్టుమార్టం నిర్వహించాలని నిర్ణయిస్తే రాష్ట్రంలో ఉన్న నిష్ణాతులైన ఫోరెన్సిక్ వైద్య నిపుణులతో నిర్వహిస్తే ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతినకుండా ఉంటుందన్నారు. ఒకవేళ రెండోసారి పోస్టుమార్టం నిర్వహించాలని ధర్మాసనం నిర్ణయిస్తే అందుకు ప్రభుత్వానికి అభ్యంతరం లేదని ఏజీ చెప్పారు. కోర్టుకు సహాయకారిగా నియమితులైన సీనియర్ న్యాయవాది దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి వాదిస్తూ.. ఎన్‌కౌంటర్‌పై సందేహాలు, అనుమానాలు ఉన్నందున రాష్ట్రానికి సంబంధం లేని వైద్యులతో స్వతంత్రంగా రీపోస్టుమార్టం చేయిస్తే ప్రభుత్వ ప్రతిష్ట మరింత పెరుగుతుందని చెప్పారు.





## హాంగ్‌కాగుతోంది..



ఒక దేశం రెండు వ్యవస్థలు ఉంటే ఎన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయో చెప్పడానికి ప్రత్యక్ష ఉదాహరణ ఈ ఏడాది హాంకాంగ్‌లో ఎగిసిన నిరసనలు. తమ దేశంపై సుదీర్ఘ కాలంగా సాగుతున్న చైనా పెత్తనాన్ని హాంకాంగ్ వాసులు సహించలేకపోతున్నారు. చైనాలో హాంకాంగ్ భాగమైనప్పటికీ అక్కడ ప్రజలు తమను చైనీయులు అనడానికి ఎంత మాత్రమూ ఇష్టపడరు. అలాంటిది నేరస్తుల అప్పగింతకు సంబంధించిన ఒక బిల్లుపై వచ్చిన ప్రతిపాదనలతో హాంకాంగ్‌లో నిరసనల అగ్గి రాజుకుంది. ఈ బిల్లుతో హాంకాంగ్‌లో నిందితుల్ని చైనాలో విచారించే అవకాశం కలుగుతుంది. దీంతో రైట్ వింగ్ యాక్టివిస్టులు భగ్గుమన్నారు. హాంకాంగ్ ప్రత్యేక ప్రతిపత్తిని నిర్వీర్యం చేసేలా చైనా ప్రభుత్వం వ్యవహరిస్తోందంటూ రోడ్డెక్కారు. జూన్ నుంచి ఆందోళనలతో హోరెత్తిస్తున్నారు. అటు ప్రభుత్వం కూడా పోలీసు బలగాలతో నిరసనలు అణచివేయాలని అనుకుంది కానీ అంతకంతకూ అవి తీవ్రరూపం దాల్చాయి. మొత్తానికి బిల్లుపై చైనా ప్రభుత్వం వెనక్కి తగ్గినా ఆ ఆందోళనలిప్పుడు హాంకాంగ్ స్వాతంత్ర్య పోరాటానికి దారి తీశాయి. హాంకాంగ్ ఉద్యమం ఈ ఏడాది చైనా అహంకారపూరిత ధోరణికి ఒక హెచ్చరికలాంటిది.

## డచ్‌లో ట్రాక్టర్లతో రైతన్నలు...



డచ్ పార్లమెంట్‌లో సభ్యులు చేసిన ఆరోపణలు రైతన్నల గుండెల్లో తూటాల్లా పేలాయి. వారంతా ఆందోళన బాట పట్టి ప్రభుత్వాన్ని హడలెత్తించారు. దేశంలో పర్యావరణ కాలుష్యానికి, గాలిలో నైట్రోజన్ ఆక్సైడ్ శాతం పెరిగిపోవడానికి వ్యవసాయమే కారణమని కొందరు సభ్యులు పార్లమెంట్‌లో వ్యాఖ్యానించారు. వారికి మద్దతుగా మరికొందరు గోశాలల్ని మూసివేయాలంటూ నినదించారు. దీంతో అన్నదాతల్లో ఆగ్రహం పెల్లుబుకింది. డచ్‌లో విమానాల పరిశ్రమ సర్వ అనర్థాలకు కారణమంటూ వారు మండిపడ్డారు. కానీ వారిని ఎవరూ నిందించడం లేదని తప్పుబట్టారు. రైతులు నిరసన వ్యక్తం చేయడానికి హేగ్‌కు వెళ్లే రహదారిని వేలాది ట్రాక్టర్లతో మోహరించారు. దాదాపుగా 1,136 కి.మీ. మేర ట్రాఫిక్‌జామ్ అయింది. ఇంచుమించుగా 3 వేల మంది వరకు రైతన్నలు ట్రాక్టర్లతో ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు.



తేనెటీగల దాడితో దుప్పట్లు కప్పుకుని పరుగులు తీస్తున్న విద్యార్థినులు

## ఎస్సీ బాలికల హాస్టల్‌లో తేనెటీగల దాడి

### 15 మందికి గాయాలు.. నలుగురి పరిస్థితి విషమం

**మహేశ్వరం:** తేనెటీగల దాడిలో 15 మంది విద్యార్థినులకు గాయాలైన ఘటన రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో శనివారం జరిగింది. వసతి గృహంలోని చెట్లకు ఉన్న తేనెతుట్టెలను గుర్తు తెలియని వ్యక్తి రాయితో కొట్టడంతో ఒక్కసారిగా తేనెటీగలు హాస్టల్‌లోని విద్యార్థినులపై దాడి చేశాయి. వాటి నుంచి తప్పించుకునేందుకు విద్యార్థినులు పరుగులు పెట్టారు. ఈ విషయం గమనించిన స్థానికులు వారికి దుప్పట్లను చుట్టి రక్షించడంతోపాటు గాయపడిన వారిని వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ దాడిలో మొత్తం 15 మంది విద్యార్థినులకు గాయాలయ్యాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురు విద్యార్థినుల పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించామని మహేశ్వరం ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఇంద్రాసేనారెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మహేశ్వరం ఎంపీపీ రఘుమారెడ్డి, తహసీల్దార్ సుజాత గాయపడిన విద్యార్థినులను పరామర్శించి వారి ఆరోగ్య వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

## సెలవు మంజూరు అధికారం హెచ్‌ఎంలకే

### సవరణ ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ

**సాక్షి, హైదరాబాద్:** ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు సెలవుల మంజూరు అధికారాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయునికే ఇస్తూ పాఠశాల విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. ఇటీవల వెలువర్చిన ఉత్తర్వుల ప్రకారం.. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు సెలవుల కోసం సంబంధిత కాంప్లెక్స్ స్కూల్ ప్రధానోపాధ్యాయుని అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అంశంపై క్షేత్రస్థాయి నుంచి అసంతృప్తి వెలువడటంతో నివారణ చర్యలకు దిగిన విద్యాశాఖ ఇది వరకు జారీ చేసిన ఉత్తర్వుల్లో స్వల్ప మార్పులు చేసింది. ఇకపై ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు సెలవులు జారీ చేసే అధికారాన్ని ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయునికే అప్పగిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి.విజయ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయంపై పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు పర్వతరెడ్డి, జి.సదానందగౌడ్, ఎస్జీటీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మధుసూదన్‌రావు, కే మహిపాల్‌రెడ్డితోపాటు టీపీయూఎస్ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతరావు, ఎన్.సురేష్ వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తం చేశారు.

## తుమ్మల పాపిరెడ్డితో ఆటా బృందం భేటీ

**సాక్షి, హైదరాబాద్:** అమెరికాలో విద్యావకాశాలపై తెలుగు ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) తెలిపింది. శనివారం ఆటా ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డితో సమావేశమయ్యారు. ఆటా ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని మఫఖంజా కాలేజీలో విద్యా సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆటా ప్రతినిధులు రాజశేఖర్, జయదేవ్ చల్లా తెలిపారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, పలువురు విద్యావేత్తలు ఇందులో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

## ఆ పిల్లలకు కేజీబీవీ, యూఆర్‌ఎస్‌ల్లో అడ్మిషన్లు

### డీఈవోలకు పాఠశాల విద్యా కమిషనర్ ఆదేశాలు

**సాక్షి, హైదరాబాద్:** వివిధ కారణాలతో తప్పిపోయిన పిల్లలను కస్తూర్బాగాంధీ (కేజీబీవీ), అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్ (యూఆర్‌ఎస్)లో చేర్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ప్రతి ఏడాది పోలీస్ శాఖ ఆపరేషన్ స్మైల్–6 పేరుతో తప్పిపోయిన పిల్లలను వెతికే ఆపరేషన్‌ను చేపడుతోంది. ఈ నేపథ్యంలో వచ్చే జనవరి 1 నుంచి 31 వరకు చేపట్టే ఆపరేషన్‌లో దొరికిన పిల్లలను బాలికలు అయితే కేజీబీవీల్లో, అబ్బాయిలు అయితే యూఆర్‌ఎస్‌లో తాత్కాలికంగా చేర్చుకోవాలని పాఠశాల విద్యా కమిషనర్ విజయ్ కుమార్ శనివారం జిల్లా విద్యాశాఖాధికారులకు ఆదేశాలు జారీచేశారు. కేజీబీవీలు, యూఆర్‌ఎస్‌ల్లో తాత్కాలికంగా వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. అయితే వారు అక్కడే ఉండి చదువును కొనసాగిస్తామని చెబితే వారు గతంలో ఉత్తీర్ణత సాధించిన తరగతి కంటే పై తరగతిలో అడ్మిషన్లు ఇవ్వాలని ఆదేశించారు. అడ్మిషన్లు ఇచ్చిన తర్వాత వారికి అవసరమైన బట్టలు, రగ్గులు, ప్లేట్, గ్లాస్, మెడిసిన్లను కూడా ఇవ్వాలని, ఇందుకు అదనంగా నిధులను తీసుకోవాలని సూచించారు. గతేడాది ఇలాంటి వారు సుమారు 4వేల మంది చేరినట్లు అధికారులు చెబుతున్నారు.

## సులభ్ కాంప్లెక్స్‌లో తపంచాల కలకలం

### విక్రయించేందుకు తెచ్చిఉంటారని పోలీసుల అనుమానాలు



**నాంపల్లి:** హైదరాబాద్ రైల్వే స్టేషన్ (నాంపల్లి) సమీపంలోని ఓ సులభ్ కాంప్లెక్స్‌లో రెండు రివాల్వర్లు దొరికాయి. శుక్రవారం రాత్రి మరుగుదొడ్లను శుభ్రం చేసే సిబ్బంది వీటిని గుర్తించారు. దీంతో సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకులు నాంపల్లి పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్నవి రివాల్వర్లు కాదని, తపంచాలని పోలీసులు నిర్ధారించారు. తపంచాలు వదిలిపెట్టిన వ్యక్తుల కోసం పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అందుబాటులో ఉన్న ఆధారాలతో అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సీసీ కెమెరాలను సైతం పరిశీలిస్తున్నారు. శనివారం మధ్య మండలం డీసీపీ విశ్వప్రసాద్, సైఫాబాదు డివిజన్ ఏసీపీ సి.వేణుగోపాల్‌రెడ్డి, నాంపల్లి ఇన్‌స్పెక్టర్లు ఖలీల్ పాష, అదనపు ఇన్‌స్పెక్టర్ కిషోర్, ఎస్సై రెడ్డిగారి శ్రీకాంత్‌రెడ్డిలు సంఘటన స్థలాన్ని సందర్శించారు. నాంపల్లి రైల్వే స్టేషన్‌కు వచ్చిన ప్రయాణికులే సులభ్ కాంప్లెక్స్‌లో స్నానం చేసి ఇక్కడ వదిలిపెట్టి వెళ్లినట్టుగా తెలుస్తోంది. దోపిడీదారులు, రౌడీషీటర్లు, నక్సలైట్లు వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారు నగరానికి వచ్చి, సులభ్ కాంప్లెక్స్‌లో వీటిని మరిచిపోయారనే కోణంలోనూ పోలీసులు విచారిస్తున్నారు. అలాగే విక్రయించడం కోసం ఎవరైనా తీసుకువచ్చారా అనే అనుమానాలూ వ్యక్తం అవుతున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పరిశోధనలకు పెద్ద పీట

- ఉన్నత విద్యా సంస్థల్లో ఇన్నోవేషన్ కేంద్రాలు
- ముందుగా అన్ని యూనివర్సిటీల్లో ఏర్పాటు
- ఆ తర్వాత ఉన్నత విద్యా సంస్థల్లో..
- అవసరమైతే ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆర్థిక సహకారం
- నేషనల్ ఇన్నోవేషన్ పాలసీ–2019లో భాగంగా చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీలు, ఉన్నత విద్యా సంస్థల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు పెద్ద పీట వేసేందుకు ఇన్నోవేషన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ఉన్నత విద్యా మండలి నిర్ణయించింది. ముందుగా యూనివర్సిటీల్లో, ఆ తర్వాత ఉన్నత విద్యా సంస్థల్లో ఇన్నోవేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. నేషనల్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీ–2019 అమలులో భాగంగా రాష్ట్ర స్థాయిలో, యూనివర్సిటీ స్థాయిలో ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీని రూపొందించి అమలు చేయాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలు, అన్ని ఉన్నత విద్యా సంస్థల్లో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ కేంద్రాలను ఏర్పాటు చేసి పరిశోధనలు, నూతన ఆవిష్కరణలకు పెద్ద పీట వేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. దీని కోసం నేషనల్ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీని అమల్లోకి తెచ్చింది. కేంద్రం తీసుకొచ్చిన ఈ పాలసీ అమలు తీరుపై ఈ నెల 2న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ విద్యా శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. అంతకుముందు ఎంహెచ్‌ఆర్‌డీ చీఫ్ ఇన్నోవేషన్ ఆఫీసర్ డాక్టర్ అభయ్ జేరే కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. జాతీయ ఇన్నోవేషన్ అండ్ స్టార్టప్ పాలసీకి అనుగుణంగా ఎలాంటి చర్యలు చేపట్టారని అడిగారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల రిజిస్ట్రార్‌లతో సమీక్ష నిర్వహించారు. ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అవసరమైతే ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆయా సెంటర్ల ఏర్పాటు కోసం యూనివర్సిటీలకు రూ.1 లక్ష నుంచి రూ.20 లక్షల వరకు ఆర్థిక సహకారం అందిస్తామని పాపిరెడ్డి ప్రకటించారు. మరోవైపు ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కూడా రిజిస్ట్రార్‌లతో స్కైప్‌లో మాట్లాడారు. వచ్చే మార్చి కల్లా ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కావడమే కాకుండా వాటికి ఓ రూపు తీసుకురావాలని సూచించారు. మరోవైపు ఎంహెచ్‌ఆర్‌డీ తీసుకొచ్చిన ఈ పాలసీ అమలు కోసం ఆర్థిక సహాయం అందించేందుకు జపాన్ ముందుకు వచ్చిందని, ఈ మేరకు కేంద్రంతో ఒప్పందం కుదిరిందన్న అంశంపైనా సమావేశంలో చర్చించారు. దీంతో భవిష్యత్తులో రాష్ట్రంలో ఏర్పాటు చేసే ఇన్నోవేషన్ కేంద్రాలకు భారీగా ఆర్థిక సహాయం కూడా అందనుందని అధికారులు భావిస్తున్నారు.

### నోడల్ ఏజెన్సీగా జేఎన్టీయూ..

రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, శాతవాహన, మహాత్మాగాంధీ, తెలంగాణ, పాలమూరు, జేఎన్టీయూహెచ్, తెలుగు యూనివర్సిటీ, ఆర్జీయూకేటీ, జేఎన్ఏఎఫ్ఏయూ, ఓపెన్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీ, వెటర్నరీ యూనివర్సిటీ, అగ్రికల్చర్ యూనివర్సిటీల రిజిస్ట్రార్లు పాల్గొన్న ఈ సమావేశంలో ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి, రాష్ట్ర స్థాయి పాలసీని (ఫ్రేమ్ వర్క్) రూపొందించి అమల్లోకి తేవాలని నిర్ణయించారు. పరిశోధనలు, ఆవిష్కరణలకోసం పని చేసే విద్యార్థులు, సిబ్బందికి ఇవ్వాల్సిన ఇన్సెంటివ్‌లు, స్టార్టప్‌ల ప్రభావం వంటి అంశాలను ఫ్రేమ్ వర్క్‌లో పొందుపరచాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ ఇన్నోవేషన్ సెంటర్ల ఏర్పాటును ముందుకు తీసుకెళ్లేందుకు, ఎంహెచ్‌ఆర్‌డీ ఇన్నోవేషన్ సెల్, అఖిల భారత సాంకేతిక విద్యా మండలితో సంప్రదింపులు జరిపేందుకు, యూనివర్సిటీలకు గైడ్ చేసేందుకు జేఎన్టీయూను నోడల్ ఏజెన్సీగా ఏర్పాటు చేశారు. యూనివర్సిటీల స్థాయిలోనూ ఇన్నోవేషన్ పాలసీ అమలుకు కమిటీని ఏర్పాటు చేసి మూడు నెలల్లో ఆచరణలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఆ తర్వాత యూనివర్సిటీల పరిధిలోని ఉన్నత విద్యా సంస్థల్లోనూ ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.



**వినువీధిన విన్యాసం.. మువ్వన్నెలతో సాహసం..**

శనివారం హైదరాబాద్ దుండిగల్‌లో భారత వాయుసేన పరేడ్‌లో హెలిక్యాప్టర్ల విన్యాసం

జెండా రంగుల ప్యారాచూట్లతో నేలపైకి దిగుతున్న వాయుసేన సిబ్బంది.

# రైతుబీమాలోకి మరో లక్ష మంది

- ప్రీమియం కోసం నిధుల విడుదలకు వ్యవసాయ శాఖ ప్రతిపాదన
- ప్రీమియం చెల్లించకపోవడం, కొందరు రైతులు చనిపోవడంతో సమస్య
- తమకూ బీమా పరిహారం ఇవ్వాలని విన్నపం.. అంగీకరించని ఎల్‌ఐసీ

**సాక్షి, హైదరాబాద్:** రైతుబీమా పథకం కింద అర్హులైన అన్నదాతల బీమా ప్రీమియం చెల్లించేందుకు నిధులు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. ఈ ఏడాది రైతుబీమా పథకం మొదలైన ఆగస్టు 14 నుంచి ఇప్పటి వరకు అదనంగా దాదాపు లక్ష మంది రైతులు అర్హులుగా ఉన్నట్లు ప్రభుత్వానికి తెలిపింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఈ ఏడాది ఒక్కో రైతుకు రూ.3,457.4 ప్రీమియం (జీఎస్టీతో కలిపి) ఉంది. ఆగస్టు 14 నాటికి డిజిటల్ సైన్ పూర్తయిన మొత్తం 30,94,656 మంది రైతులకు రూ.1,071.79 కోట్లు ప్రభుత్వం ఎల్‌ఐసీకి చెల్లించింది. అయితే రైతుబీమా పథకం ప్రకారం 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపున్న పట్టాదారులందరూ అర్హులే. ప్రతినెలా అర్హులైన వారి వివరాలను రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ శాఖ సేకరిస్తోంది. ఇలా ఈ 4 నెలల కాలంలో చాలామంది రైతులు పట్టామార్పిడి చేసుకున్నారు. ఇందులో కొత్తగా నమోదైన వారే లక్ష వరకు ఉన్నారు. ఇప్పుడు వారందరూ రైతుబీమా పథకానికి అర్హత పొందడంతో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) వారి నుంచి వివరాలు సేకరించి బీమాలో నమోదు చేశారు. అయితే వారికి ప్రభుత్వం ఎల్‌ఐసీ ప్రీమియం మాత్రం చెల్లించలేదు. దాదాపు లక్ష మందికి రూ.3,457.40 చొప్పున రూ.34.57 కోట్లు అవసరమవుతాయని వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి నివేదించింది. అయితే 2020 ఆగస్టు 14 వరకు పట్టాదారుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున మొత్తం 2 లక్షల మంది అర్హులకు సరిపోను ఒకేసారి రూ.70 కోట్లు విడుదల చేయాలని ప్రతిపాదించినట్లు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం ఇప్పుడు రైతుబీమాలో 31.71 లక్షల మంది రైతులు నమోదయ్యారు.

**రూ.215.80 కోట్ల పరిహారం**

గతేడాది ఆగస్టులో ఈ పథకాన్ని సీఎం కేసీఆర్ తీసుకొచ్చారు. 2018 ఆగస్టు 14 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చింది. దురదృష్టవశాత్తు బీమా పరిధిలో ఉన్న రైతు మరణిస్తే వారి కుటుంబాలకు (నామినీ) ఎల్‌ఐసీ పరిహారం కింద రూ.5 లక్షల చొప్పున అందిస్తారు. గతేడాది పథకంలో 17,353 మంది రైతులకు రూ.867.65 కోట్ల పరిహారం అందించారు. ఈ ఏడాది ఆగస్టు 14 నుంచి ఇప్పటి వరకు 4,316 మంది రైతుల నామినీలకు రూ. 215.80 కోట్లు చెల్లించారు. ఇందులో చిన్న, సన్నకారు రైతులే 90% మంది ఉన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు 83 శాతం మంది ఉన్నారు. కాగా, రైతుబీమాలోకి అదనంగా వచ్చిన వారికి సర్కారు ప్రీమియం చెల్లించకపోవడం వల్ల అనేక చోట్ల సమస్యలు వస్తున్నాయి. కొన్నిచోట్ల రైతులు చనిపోయినా వారి కుటుంబ సభ్యులకు బీమా పరిహారం రావట్లేదు. దీంతో రైతు కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాము రైతుబీమాలో చేరామని, పరిహారం ఇవ్వాలని కోరుతుండగా ఎల్‌ఐసీ వర్గాలు అంగీకరించట్లేదు.

## ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

### ట్విటర్‌లో అభినందనలు తెలిపిన ప్రధాని, గవర్నర్ హరిచందన్, కేంద్ర మంత్రులు

**సాక్షి, అమరావతి/న్యూఢిల్లీ/నెట్‌వర్క్:** ఏపీ సీఎం వైఎస్ జగన్ జన్మదిన వేడుకల్ని శనివారం రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి.. పలు చోట్ల రక్తదాన శిబిరాలు, సేవాకార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, రాష్ట్ర మంత్రులు, పలువురు ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 'జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు. దీర్ఘాయుష్షు, ఆరోగ్యవంతమైన జీవితం కలిగి ఉండాలని ఆశిస్తున్నాను' అని ప్రధాని ట్వీట్ చేశారు. జగన్ రీట్వీట్ చేస్తూ... 'నరేంద్రమోదీ గారూ! హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపినందుకు నా కృతజ్ఞతలు'అని పేర్కొన్నారు. రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ ట్విటర్‌లో శుభాకాంక్షలు అందచేశారు. గవర్నర్‌కు కూడా జగన్ ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, కేంద్ర గణాంక, ప్లానింగ్ శాఖ మంత్రి రావ్ ఇందర్‌జిత్‌సింగ్, పశు సంవర్ధక శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌సారంగి, రాజస్థాన్ గవర్నర్ కల్రాజ్ మిశ్రా, మేఘాలయ ముఖ్యమంత్రి సి.సంగ్మా, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ శుక్లా, ఇండియా టీవీ ఎడిటర్ ఇన్ చీఫ్ రజత్ శర్మ, తదితరులు ట్విటర్‌లో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉదయం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేక్‌ను అధికారుల సమక్షంలో సీఎం జగన్ కట్ చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సహానీ, డీజీపీ గౌతమ్ సవాంగ్, సీఎం ముఖ్య సలహాదారు అజేయ కల్లంతో పాటు పలువురు అధికారులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.



వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా శనివారం రహ్మత్‌నగర్‌లో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి

## వైఎస్ జగన్‌కు ప్రజా దీవెనలు

- ఏపీ ముఖ్యమంత్రి జన్మదిన వేడుకల్లో గట్టు శ్రీకాంత్ రెడ్డి
- దివ్యాంగులుకు ట్రైసైకిళ్లు, పేదలకు దుప్పట్లు పంపిణీ

**రహమత్‌నగర్:** ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆరునెలల్లోనే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజా మన్ననలు పొందారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు గట్టు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నగరంలోని రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్, జూబ్లీహిల్స్‌లోని కార్మికనగర్, శ్రీనగర్‌కాలనీలోని గణపతి కాంప్లెక్స్ వద్ద వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో గట్టు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహణతో పాటు దివ్యాంగులకు ట్రైసైకిళ్లు, పేద మహిళలకు దుప్పట్లను పార్టీ నేతలు అందజేశారు. అనంతరం గట్టు మాట్లాడుతూ..ఎన్ని అవరోధాలు ఎదురైనా దివంగత మహానేత డా.వైఎస్సార్ చూపిన బాటలో అడుగుముందుకు వేసిన భగీరథుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. ఏపీలో దిశ చట్టాన్ని అమలు చేయడంతో ఇతర రాష్ట్రాలు కూడా ఆ చట్టం వివరాలు కోరుతున్నాయంటే జగన్ దార్శనికత అర్థం అవుతుందన్నారు. ఈ వేడుకల్లో దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ వేడుకల్లో ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శులు డా ప్రపుల్లా రెడ్డి, బి సంజీవరావు, బెజ్జంకి అనిల్ కుమార్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బొడ్డు సాయినాథ్‌రెడ్డి, వనపర్తి జిల్లా అధ్యక్షుడు జశ్వంత్‌రెడ్డి, రాష్ట్ర సేవాదళ్ అధ్యక్షుడు బండారు వెంకటరమణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## రేపట్నుంచే పుస్తక పండుగ

- పది రోజులు... వందలాది బుక్ స్టాళ్లు
- అంతర్జాతీయ పుస్తక ప్రదర్శనగా పేరొచ్చేలా అడుగులు
- హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్



**సాక్షి, హైదరాబాద్:** పుస్తకాల పండుగ వచ్చేసింది... రేపట్నుంచి (ఈనెల 23వ తేదీ) నుంచి జనవరి ఒకటో తేదీ వరకు హైదరాబాద్‌లో జాతీయ పుస్తక ప్రదర్శన నిర్వహించేందుకు హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఏర్పాట్లు చేసింది. గతంలో కంటే ఎక్కువ సంఖ్యలో బుక్ స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ అన్నారు. గతంలో కంటే భిన్నంగా ఈ సారి పుస్తక ప్రదర్శనతో పాటు ప్రముఖులతో చర్చలు, సెమినార్లు నిర్వహించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జాతీయ స్థాయి కథకులు, రచయితలు కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఆయన శనివారం తెలిపారు.

**అన్ని రకాల పుస్తకాలు...**

"ఈసారి పుస్తక ప్రదర్శనలో అన్ని రకాల పుస్తకాలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నాం. బుక్ ఫెయిర్ అంతర్జాతీయ స్థాయి గడించాలన్న ఉద్దేశంతో అన్ని పుస్తకాలకు సంబంధించిన పబ్లిషర్లను ఆహ్వానించాం. విద్యార్థులు ఎక్కువగా కెరీర్, అకడమిక్ పుస్తకాలు కొనుగోలు చేసేందుకు ఇష్టపడుతున్నారు. మధ్యవయస్కులు సాహిత్యం, చరిత్ర పుస్తకాలను ఎక్కువగా చదువుతున్నారు. అన్ని రకాల వ్యక్తులను ఆకట్టుకునేలా పుస్తకాలు ప్రదర్శించనున్నాం. ఇది కేవలం పుస్తకాల విక్రయం కోసమే కాదు. పుస్తకాన్ని అందరి చేతికి అందించాలనే సంకల్పంతో పనిచేస్తున్నాం. లాభాల కంటే లక్ష్యాలను సాధించేలా ముందుకెళ్తున్నాం. ప్రభుత్వం కూడా అన్ని విధాలా సహకరిస్తోంది. పుస్తక ప్రియుడైన వ్యక్తి మన రాష్ట్రానికి సీఎం కావడం గర్వకారణం.

**ప్రతీ జిల్లాలో ప్రదర్శనలు...**

ప్రస్తుతం హైదరాబాద్‌లో బుక్ ఫెయిర్ నిర్వహిస్తున్నప్పటికీ... ప్రతీ జిల్లాలో ఈ ప్రదర్శన నిర్వహించాలనే ఆలోచన మాకుంది. ఆదిశగా అడుగులు మొదలుపెట్టాం. ఇప్పటికే ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన బుక్ ఫెయిర్‌కు అనూహ్య స్పందన వచ్చింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలో కూడా క్రమంగా నిర్వహిస్తాం. అందుకు ఆయా జిల్లాల యంత్రాంగాల సహకారం తీసుకుంటాం. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు ప్రతి ఒక్కరూ రావాలని కోరుకుంటున్నాం''అని గౌరీశంకర్ వెల్లడించారు.



# ఇండోనేసియాలో ఉరకలెత్తిన యువతరం

**'పెళ్లి చేసుకోకుండా సెక్స్‌లో పాల్గొనకూడదు**
**యువ జంటలు సహజీవనం చేయకూడదు**
**సెక్స్ ఎడ్యుకేషన్‌పై పరిమితులు**
**చట్ట విరుద్ధంగా అబార్షన్ చేసుకుంటే శిక్షలు'**



ఇదీ ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇండోనేసియా ప్రభుత్వం ప్రతిపాదించిన సరికొత్త క్రిమినల్ కోడ్. దీని ప్రకారం సహజీవనం చేస్తే ఆరు నెలలు, చట్టవిరుద్ధంగా అబార్షన్ చేయించుకుంటే నాలుగేళ్లు కఠిన కారాగార శిక్ష విధిస్తారు. దీనిపై యువతరం భగ్గుమంది. ముఖ్యంగా విద్యార్థులు రోడ్లపైకి వచ్చి ఉద్యమాలు చేశారు. జకార్తాలో పార్లమెంట్‌ని చుట్టుముట్టారు. మా వ్యక్తిగత హక్కుల్ని కాలరాస్తే చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చొనేది లేదని నినదించారు. పోలీసులు ఉద్యమాన్ని అణచివేయాలని చూసినా అది అంతకంతకూ తీవ్రమైంది. దీంతో ఇండోనేసియా పార్లమెంట్ ఆ బిల్లును ఆమోదించడంలో జాప్యం చేసింది. 1998లో అప్పటి ఇండోనేసియా అధ్యక్షుడు సుహార్తో నియంతృత్వ విధానాలతో విసిగిపోయి ఆయనను గద్దె దింపడానికి ప్రజలు చేసిన ఆందోళనల తర్వాత క్రిమినల్ కోడ్‌పై జరిగిన ఆందోళనలే అక్కడ అతి పెద్దవి.

# చిలీలో ఆర్థిక అసమానతలపై...



ధనవంతుడు రోజురోజుకీ మరిన్ని కోట్లకు పడగలెత్తుతున్నాడు. నిరుపేద పూట గడవడానికి దిక్కు లేక మరింత దారిద్ర్యంతో అల్లాడిపోతున్నాడు. ఆదాయంలో అసమానతలతో సామాన్యుడి కడుపు రగిలిపోతోంది. లాటిన్ అమెరికా దేశాల్లో ధనిక దేశంగా చిలీకి గుర్తింపు ఉంది. అదే సమయంలో ఆదాయ అసమానతల్లోనూ అత్యంత దారుణమైన స్థితిలో ఉంది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకానమిక్ కో ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఓఈసీడీ) 36 సభ్య దేశాల్లో ఆదాయ అసమానతల్లో చిలీదే అగ్రస్థానం. చాలా కాలంగా నిరుపేదలపై అణచివేత కొనసాగుతూ వస్తోంది. ఇది దేశ భవిష్యత్‌కే ప్రమాదకరం అంటూ నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ దేశంలో మెట్రో బస్సు చార్జీల ధరలు పెంచడంతో జనం విసిగిపోయి వీధుల్లోకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం ధరల్ని తగ్గించినా రాజుకున్న నిరసనల అగ్గి దేశవ్యాప్తంగా దావానలంలా వ్యాపించింది. ఈ నిరసనల్లో 22 మంది వరకు మరణించారు.

## చట్ట ప్రకారమే అరెస్టు చేయాలి

**టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం**



**సాక్షి, హైదరాబాద్:** చట్టంలో ఉండే సెక్షన్ల ప్రకారమే అరెస్ట్ చేయాలి తప్ప ఇష్టారీతిగా పోలీసులు వ్యవహరించొద్దని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం హితవు పలికారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పౌరహక్కుల సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. చట్ట నిబంధనలకు విరుద్ధంగా ప్రజా సంఘాల నాయకుల ఇళ్లపై పోలీసులు సోదాలు చేయడం సరైందికాదని, అరెస్ట్ చేసిన ఆ నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ..ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు ప్రభుత్వం కుట్రలు చేస్తుందని ఆరోపించారు. పౌరహక్కు ప్రజాస్వామ్య హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం నేతలు జి.లక్ష్మణ్, నారాయణ, బల్లా రవీంద్రనాథ్, టీపీఎఫ్ అధ్యక్షుడు రవిచంద్ర, ప్రొఫెసర్ విశ్వేశ్వర్‌రావు, జి. ఝాన్సీ, కోటి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌సీపై మీనమేషాలు లెక్కిస్తున్న కేసీఆర్



**సాక్షి, హైదరాబాద్:** బీజేపీ మిత్రపక్షాలే పౌరుల జాతీయ పట్టిక (ఎన్‌ఆర్‌సీ)ను వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో దానిని అమలు చేయబోమని ప్రకటించడానికి సీఎం కేసీఆర్ ఎందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారో అర్థం కావడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ వెంటనే ఎన్‌ఆర్‌సీని అమలు చేయబోమని ప్రకటించి.. భయాందోళనలకు గురైన ప్రజల్లో భరోసా నింపాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఎన్‌ఆర్‌సీపై దేశవ్యాప్తంగా ఆందోళన నెలకొందని, హైదరాబాద్‌తోపాటు వివిధ జిల్లాల్లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయని చెప్పారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా పార్లమెంట్‌లో టీఆర్‌ఎస్ ఎంపీలు ఓటేశారని, అయితే అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ రాష్ట్రంలో ఎన్‌ఆర్‌సీని అమలు చేయబోమని చెప్పడానికి కేసీఆర్ సర్కార్ జాప్యం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికే 9 మంది సీఎంలు తమ రాష్ట్రాల్లో ఎన్‌ఆర్‌సీ అమలు చేయబోమని ప్రకటించారని చాడ గుర్తు చేశారు.

## శరణార్థుల పౌరసత్వానికి వ్యతిరేకం కాదు

**టీపీసీసీ నేత నిరంజన్**



**సాక్షి, హైదరాబాద్:** తొందరపాటుగా పౌరసత్వ సవరణ బిల్లు తీసుకువచ్చి ఇప్పుడు చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, వారి మాటల్లో తడబాటు కనిపిస్తోందని టీపీసీసీ అధికార ప్రతినిధి జి.నిరంజన్ అన్నారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దేశ సమగ్రత దెబ్బతినేలా చేసింది బీజేపీనేనని, శరణార్థులుగా వచ్చిన వారికి పౌరసత్వం ఇచ్చే విషయంలో కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకం కాదని స్పష్టంచేశారు. కేవలం మతం ఆధారంగా పౌరసత్వం ఇవ్వడాన్నే తాము వ్యతిరేకిస్తామని, మతాల పేర్లు చెప్పకుండా బిల్లు పెడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. హిందూ శరణార్థులను ఈ దేశానికి తీసుకువచ్చేందుకు కాంగ్రెస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదని, కానీ అన్ని వర్గాలకు భరోసా కల్పించాల్సిన భాధ్యత ప్రభుత్వాలదేనని ఆయన చెప్పారు. భారతీయుడైన ఏ హిందువు కూడా ఇతర మతాలను ద్వేషించడనే విషయాన్ని బీజేపీ గుర్తించాలని నిరంజన్ అన్నారు.

## 'తెలంగాణ నంబర్ వన్ లౌకిక రాష్ట్రం'



**సాక్షి, హైదరాబాద్:** ప్రభుత్వం సర్వ మతాల ఆచారాలను గౌరవిస్తూ అధికారికంగా వేడుకలు, పండుగలు నిర్వహించడం ద్వారా దేశంలోనే తెలంగాణను నంబర్ వన్ సెక్యులర్ రాష్ట్రంగా నిలిపిందని టీఎస్‌ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లు అన్నారు. పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ టీఎస్‌ఐఐసీలో శనివారం జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంస్థ ఎండీ ఈవీ నర్సింహారెడ్డితో కలసి ఆయన క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. బాలమల్లు మాట్లాడుతూ.. కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలుకు సర్కార్ వినూత్నమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని ప్రశంసించారు. పండుగ పూట అన్ని వర్గాల పేదలకు కొత్త వస్త్రాలు ఇస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వేడుకల్లో టీఎస్‌ఐఐసీ సీఈఓ మధుసూదన్, చీఫ్ ఇంజనీర్ శ్యామ్‌సుందర్, సీజీఎం గీతాంజలి, జీఎం రేవతీబాయి తదితరులు పాల్గొన్నారు.

## విత్తన భాండాగారంగా తెలంగాణ



**వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి**

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ విత్తనానికి ప్రత్యేకత ఉందని.. అది ఈ ప్రాంతం, ఈ నేలలకే సొంతమని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. ఇక్కడ సిద్ధమైన విత్తనం ప్రపంచంలో ఎక్కడైనా మొలకెత్తుతుందని చెప్పారు. అందుకే తెలంగాణ విత్తన భాండాగారం అయిందని పేర్కొన్నారు. శనివారం ఫ్యాప్సీ హాల్‌లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహిళా సాహితీవేత్తలకు నిర్వహించిన విత్తన అవగాహన సదస్సులో మంత్రి మాట్లాడుతూ.. పది వేల ఏళ్ల క్రితమే వ్యవసాయం మొదలైందని, నాగలి (హలం) నుంచి వ్యవసాయ నాగరికత పుట్టుకొచ్చిందని పేర్కొన్నారు. అటువంటి నాగలికి పుట్టినిల్లు అలంపురమని, ఆ హలంపురం నేడు అలంపురంగా భాసిల్లుతోందన్నారు. ఈ సందర్భంగా జ్వలిత రచించిన సంగిడిముంత.. సుజనా రాజు ప్యూపా, ఆకెళ్ల వెంకట సుబ్బలక్ష్మి రచించిన బృందావనంల బాలల కథాసంపుటి పుస్తకాలను మంత్రి ఆవిష్కరించారు. తన పారితోషికం రూ.వెయ్యికి మరో వెయ్యి కలిపి రైతు సంక్షేమం నిధి కోసం ప్రభుత్వానికి అందజేయాలని రచయిత జ్యోతిర్మయి కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ పోస్టులకు 22,662 మంది

**మూడు నగరాల్లో 23, 24 తేదీల్లో ఆన్‌లైన్ టెస్ట్**

**సాక్షి, హైదరాబాద్:** సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ)లోని కాంట్రాక్టు పద్ధతిలో వివిధ పోస్టులకు ఈ నెల 23, 24 తేదీల్లో జరిగే ఆన్‌లైన్ పరీక్షకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పరీక్షకు మొత్తం 32 సెంటర్లను ఏర్పాటు చేయగా 22,662 మంది హాజరుకానున్నారు. ఈ నెల 23 ఉదయం 9 గంటల నుంచి 11.30 గంటల వరకు ఐఈఆర్పీ, ఎంఐఎస్ కో–ఆర్డినేటర్ల పోస్టులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మండల, జిల్లా డేటా ఎంట్రీ ఆపరేటర్ల పోస్టులకు పరీక్ష జరగనుంది. 24న ఉదయం 9 గంటల నుంచి 11.30గంటల వరకు అసిస్టెంట్ ప్రోగ్రామర్, సిస్టమ్ అనాలసిస్ట్ పోస్టులకు పరీక్ష జరగనుంది. హైదరాబాద్‌లోని 27 సెంటర్లలో 20,962 మంది, కరీంనగర్‌లోని రెండు సెంటర్లలో 950 మంది, వరంగల్‌లోని మూడు కేంద్రాల్లో 750 మంది పరీక్షకు హాజరుకున్నారు.

# ఐదేళ్లు.. రూ.2 లక్షల కోట్లు

- సాగునీటి రంగంపై వెచ్చించనున్న నిధులు
- అవసరాలు, అంచనాలతో రాష్ట్రం సమగ్ర నివేదిక
- కేంద్ర ఆర్థికశాఖ, నీతి ఆయోగ్ టాస్క్‌ఫోర్స్‌కు వెల్లడి

**సాక్షి, హైదరాబాద్:** సాగునీటి రంగాన్ని ఉరకలెత్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మున్ముందు భారీగా నిధులు వెచ్చించనుంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను పూర్తిచేస్తూనే కేంద్రం ప్రతిపాదిస్తున్న నదుల అనుసంధాన ప్రక్రియను పరుగులు పెట్టించనుంది. ఇందుకోసం వచ్చే ఐదేళ్లలో ఏటా రూ.40 వేల కోట్ల చొప్పున మొత్తం రూ.2 లక్షల కోట్ల మేర ఖర్చు చేయనుంది. దేశంలో మౌలిక వసతుల కల్పనపై దృష్టిపెట్టిన కేంద్ర ప్రభుత్వం, తన బడ్జెట్‌లో ప్రకటించినట్లుగా రూ.100 లక్షల కోట్లతో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను గుర్తించడం కోసం ఆర్థిక శాఖ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయగా దానికి తెలంగాణ ప్రభుత్వం సమగ్ర నివేదికను సమర్పించింది. ఐదేళ్ల వ్యవధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై ఖర్చు చేయనున్న నిధుల వివరాల్ని అందులో పేర్కొంది.

**మొదట ప్రాజెక్టులు.. ఆపై అనుసంధానం**

కృష్ణా, గోదావరి నదీజలాల పూర్తి వినియోగానికి వీలుగా ప్రభుత్వం కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ, డిండి ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. వీటితో పాటే నిర్మాణంలో ఉన్న భారీ, మధ్యతరహా ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా పూర్తి చేస్తోంది. వీటి నిర్మాణాలకు భారీగా నిధులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మినహాయిస్తే 2020–21 ఆర్థిక సంవత్సరం నుంచి ఏటా సాగునీటి రంగంపై రూ.30 వేల కోట్ల నుంచి రూ.40 వేల కోట్ల మేర నిధులను ఖర్చు చేయనున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు పంపిన నివేదికలో తెలిపింది. ఇందులో కాళేశ్వరం ప్రాజెక్టుపై వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి మూడేళ్ల పాటు రూ.10 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తామని, పాలమూరు–రంగారెడ్డికీ ఇలాగే నిధులు వెచ్చిస్తామని, నదుల అనుసంధానంతో సహా మొత్తంగా వచ్చే ఐదేళ్లలో సాగునీటి రంగంపై రూ.2 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేయనున్నట్లు తెలిపింది. 2023–24 నాటికి కొత్తగా చేపట్టిన భారీ ఎత్తిపోతల పథకాలన్నీ పూర్తవుతాయని, ఆపై నిధుల ఖర్చంతా గోదావరి–కృష్ణా నదుల అనుసంధానంపైనేనని వెల్లడించింది.

**టాస్క్‌ఫోర్స్‌కు ఎందుకీ ఐదేళ్ల ప్రణాళిక?**

కేంద్ర ప్రభుత్వం 2025 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తయారు కావాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు రూ.100 లక్షల కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలను కల్పించాల్సి ఉంది. ఈ క్రమంలో చేపట్టాల్సిన ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక రూపకల్పనకు టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శి చైర్మన్ కాగా, వివిధ మంత్రిత్వ శాఖల కార్యదర్శులు, నీతి ఆయోగ్ అధికారులు సభ్యులుగా ఉన్నారు. 2019–20 నుంచి 2024–25 ఆర్థిక సంవత్సరం దాకా చేపట్టాల్సిన కార్యాచరణను టాస్క్‌ఫోర్స్ తన నివేదికలో పొందుపరుస్తుంది. దీనికోసం మౌలిక వసతుల రంగంలో ఖర్చు చేసే నిధుల వివరాలివ్వాలని టాస్క్‌ఫోర్స్ ఆయా రాష్ట్రాలను కోరింది. దీంతో రాష్ట్ర ఆర్థిక శాఖ వివిధ శాఖల ఐదేళ్ల ప్రణాళికల వివరాలను సేకరించి కేంద్రానికి సమర్పించింది. దీని ఆధారంగా ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితుల సడలింపు, కేంద్రసంస్థల నుంచి ఆర్థిక సాయం, రుణ సేకరణ అవకాశాలు వంటివి కేంద్రం పరిశీలిస్తుంది.



కాళేశ్వరం ప్రాజెక్టు

**ప్రధాన ప్రాజెక్టులపై ఖర్చు, అవసరమైన నిధులు (రూ. కోట్లలో)**

| ప్రాజెక్టు | కొత్త అంచనా వ్యయం | చేసిన ఖర్చు | నిధుల అవసరం |
|---|---|---|---|
| కాళేశ్వరం | 88,190.46 | 57,503.82 | 30,686.84 |
| పాలమూరు–రంగారెడ్డి | 49,595 | 6,862.85 | 42,732.15 |
| సీతారామ | 13,057.98 | 3,761.23 | 9,296.75 |
| దేవాదుల | 16,645.44 | 11,470.37 | 5,175.07 |
| డిండి | 6,191.72 | 1,395.87 | 4,795.85 |
| వరద కాల్వ | 10,953.19 | 8,308.81 | 2,644.38 |
| లోయర్ పెన్‌గంగ | 1,595 | 520.81 | 1,074.19 |
| చిన్ననీటి వనరులు | 8,735.32 | 4,282.78 | 4,452.78 |

**రాష్ట్రం సాగునీటి ముఖచిత్రం**

- **రూ.2.33 లక్షల కోట్లు** రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం
- **రూ.1.22 లక్షల కోట్లు** సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటి వరకు చేసిన ఖర్చు
- **రూ.1.11 లక్షల కోట్లు** చేపట్టిన ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు
- **రూ.90 వేల కోట్లు** గోదావరి–కృష్ణా అనుసంధానానికి అవసరమైన నిధులు (అంచనా)
- **1.24 కోట్ల ఎకరాలు** నీరందించాల్సిన ఆయకట్టు లక్ష్యం
- **70.10 లక్షల ఎకరాలు** ప్రస్తుతం నీరందుతున్న ఆయకట్టు
- **54 లక్షల ఎకరాలు** ఇంకా చేరుకోవాల్సిన ఆయకట్టు లక్ష్యం

# అమెరికాకు మన కళాఖండాలు

**న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియంలో ప్రదర్శన**

- వచ్చే నవంబర్ నుంచి ఫిబ్రవరి వరకు 100 రోజులపాటు అక్కడే
- ప్రపంచవ్యాప్తంగా 150 శిల్పాలు... అందులో తెలంగాణవే 13
- స్వయంగా వచ్చి ఎంపిక చేసిన అమెరికా ప్రతినిధులు
- వాటి తరలింపునకు భారీ బీమా
- రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే తరలింపు కసరత్తు షురూ

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో వెలుగు చూసిన అతి పురాతన శిల్పాలు అమెరికాలో తళుక్కుమననున్నాయి. న్యూయార్క్‌లోని ప్రపంచ ప్రసిద్ధ మెట్రోపాలిటన్ మ్యూజియంలో జరగబోయే ప్రదర్శనలో మన కళాఖండాలు కొలువుదీరనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 150 కళాఖండాలకు మాత్రమే ఈ ప్రదర్శనలో చోటు దక్కనుండగా, అందులో తెలంగాణకు చెందినవి దాదాపు 13 వరకు ఉండబోతున్నాయి. దాదాపు 100 రోజుల పాటు అవి అక్కడ ప్రదర్శనలోనే ఉంటాయి. మన దేశం నుంచి కళాఖండాల తరలింపు ప్రక్రియకు ఢిల్లీలోని నేషనల్ మ్యూజియం నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. బుద్ధుడి బోధనలు మన దేశం నుంచే విశ్వవ్యాప్తమయ్యాయి. చాలా దేశాల్లో బౌద్ధానికి సంబంధించి సజీవ సాక్ష్యాలుగా ఉన్న అలనాటి గుర్తులతో తరచూ ప్రదర్శనలు ఏర్పాటు చేస్తుంటారు. ఇప్పుడు న్యూయార్క్‌లోని మెట్రోపాలిటన్ మ్యూజియం వచ్చే సంవత్సరం నవంబర్ 20 నుంచి ఫిబ్రవరి 14 వరకు బుద్ధుడి జీవితంపై ఓ ప్రదర్శన ఏర్పాటు చేస్తోంది. దీని ఇతివృత్తం భారత్‌తో ముడిపడి ఉండటం విశేషం. 'ది ట్రీ అండ్ సర్పెంట్: ఎర్లీ బుద్ధిస్ట్ ఆర్ట్ ఇన్ ఇండియా' పేరుతో ఇది ఏర్పాటవుతోంది. అమెరికా, యూరప్, భారత్ నుంచి ఎంపిక చేసిన 150 ప్రదర్శనాంశాలను మాత్రమే ఏర్పాటు చేయనున్నారు. ఇందులో తెలంగాణకు సంబంధించినవి 13 ఉన్నాయి.



తల లేని ఈ బుద్ధుడి శిల్పమూ ప్రదర్శనకు

**ప్రభుత్వానికి పంపాం**

'అమెరికాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రదర్శనకు తెలంగాణ నుంచి కూడా కొన్ని కళాఖండాలు పంపబోతున్నాం. న్యూయార్క్ మ్యూజియం ప్రతినిధులు ఎంపిక చేసిన వాటికి సంబంధించి అమెరికాకు పంపేందుకు అనుమతి కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదన పంపాం. ప్రభుత్వం నుంచి ఎన్నింటికి అనుమతి వస్తే అన్నింటిని పంపుతాం.'

*– దినకర్ బాబు, ఇన్‌చార్జి డైరెక్టర్, హెరిటేజ్ తెలంగాణ*

**ఎంపిక చేసిన అమెరికా మ్యూజియం..**

ఈ ప్రదర్శనను న్యూయార్కు మ్యూజియం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఏడాది నుంచే కసరత్తు మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా పర్యటించిన ఆ మ్యూజియం ప్రతినిధులు తెలంగాణలో కూడా తిరిగి 13 ప్రదర్శనాంశాలను ఎంపిక చేశారు. ఇందులో ఫణిగిరి బౌద్ధ స్థూపం వద్ద లభించిన అత్యంత అరుదైన తోరణాలు, తల విరిగి రెండు మీటర్ల ఎత్తున్న బుద్ధుడి సున్నపు రాయి విగ్రహం, అష్ట మంగళ చిహ్నాలు చెక్కి ఉన్న సున్నపురాయి బుద్ధ పాదాలు, బుద్ధుడి జీవితాన్ని మూడు భాగాల్లో చెక్కిన మూడున్నర అడుగుల ప్యానెల్ ఉన్నాయి. ధూళికట్టలో లభించిన గొడుగుతో కూడిన బుద్ధుడి పూజా మందిరం, బుద్ధుడికి రక్షణగా పడగవిప్పిన పాము ఉండే నాగముచిలింద తదితరాలున్నాయి. ఇవి ఫణిగిరిలోని స్టోర్ రూమ్, నగరంలోని స్టేట్ మ్యూజియం, హెరిటేజ్ తెలంగాణ ప్రధాన కార్యాలయం, కరీంనగర్ మ్యూజియాల్లో ఉన్నాయి. వీటిని పరిశీలించిన న్యూయార్క్ ప్రతినిధులు వాటిని ఇష్టపడి ఎంపిక చేశారు. ఇవన్నీ క్రీ.శ. 2వ శతాబ్దానికి పూర్వమైనవి.



బుద్ధుడి జీవిత చక్రాన్ని మూడు భాగాలుగా వివరించే ప్యానల్

**భారీ బీమా..**

ఈ కళాఖండాలు అతి పురాతనమైనవి, అరుదైనవి కావటంతో వీటిని అమెరికాకు తరలించటం, తిరిగి తీసుకువచ్చే క్రమంలో దెబ్బతినటం, దోపిడీకి గురయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది. ఈ నేపథ్యంలో వాటికి భారీ మొత్తంలో బీమా చేయబోతున్నారు. గతంలో ముంబై, ఢిల్లీ మ్యూజియాల్లో జరిగిన ప్రదర్శనకు స్టేట్ మ్యూజియం నుంచి తరలించిన బుద్ధ ప్యానెల్‌కు రూ.2 కోట్ల బీమా చేశారు. ఇప్పుడు ఈ అన్ని విగ్రహాలకు దాదాపు రూ.25 కోట్ల మేర బీమా చేసే అవకాశం ఉంది.



ఫణిగిరిలో ఇలా పడి ఉన్న సాంచీ స్థూపం వద్ద ఉండే తోరణం శిథిలాలు అమెరికాకు వెళ్లనున్నాయి..

# మహిళను కాపాడిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్

**అభినందించిన ఉన్నతాధికారులు**

**సికింద్రాబాద్:** కదులుతున్న రైలు నుంచి కిందపడబోయిన మహిళను ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ సైపుద్దీన్ అప్రమత్తతకు మెచ్చిన ఉన్నతాధికారులు శనివారం అభినందించారు. ఈ నెల 18న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కదులుతుండగా అందులోంచి ఒక మహిళ దిగేందుకు ప్రయత్నించింది. రైలులో తమ బంధువులను ఎక్కించి తిరిగి సదరు మహిళ దిగే క్రమంలో రైలు వేగం పుంజుకుంది. పుట్‌పాత్ మీద కాలువేయబోయిన మహిళ బోగీ నుంచి జారి బోగీ, ప్లాట్‌ఫామ్ మధ్యన పడబోయింది. అదే ప్లాట్‌ఫామ్‌పై విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ మహిళ జారిపడుతున్న బోగీ వద్దకు పరుగున వెళ్లి ఆమెను పట్టుకుని ప్లాట్‌ఫామ్ మీదకు లాక్కొచ్చాడు. దీంతో రైలుబోగీ, ప్లాట్‌ఫామ్ అంచున నలిగిపోవాల్సిన మహిళ సురక్షితంగా బయటపడింది. సీసీ పుటేజీల ద్వారా సైపుద్దీన్ అప్రమత్తతను గుర్తించిన అధికారులు అతన్ని అభినందించారు.





సైఫుద్దీన్

## భారీగా రెవెన్యూ అధికారుల బదిలీ

**33 మందికి స్థానచలనం..**
**9 మందికి దక్కని పోస్టింగ్**

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపాలిటీ ఎన్నికలకు నగారా మోగనుందనే సంకేతాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు (ఎస్‌జీడీసీ), డిప్యూటీ కలెక్టర్లకు స్థానచలనం కలిగించింది. మొత్తం 33 మందిని బదిలీ చేయగా.. ఇందులో తొమ్మిది మందికి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, ఖమ్మం ఆర్డీవోగా పనిచేస్తున్న ఐఏఎస్ అధికారి అనురాగ్ జయంతిని తదుపరి పోస్టింగ్ కోసం సాధారణ పరిపాలన విభాగానికి(జీఏడీ) రిపోర్టు చేయాలని ఆదేశించారు. డిప్యుటేషన్ (ఫారిన్ సర్వీస్)లో వివిధశాఖల్లో పనిచేస్తున్న పలువురు అధికారులు అక్కడ సేవలు ఉపసంహరించుకొని రెవెన్యూ శాఖకు రిపోర్టు చేయడంతో వారికి పోస్టింగులు ఇచ్చారు.

## 'సాగుబడి' రాంబాబుకు జీవన సాఫల్య పురస్కారం

**సాక్షి, హైదరాబాద్:** 'సాక్షి సాగుబడి'డెస్క్ ఇన్‌చార్జ్, సీనియర్ న్యూస్ ఎడిటర్ పంతంగి రాంబాబుకు 2019 సంవత్సరానికి గాను ప్రతి ఏటా రైతు దినోత్సవం సందర్భంగా కర్షక సాధికార సంఘటన (కేఎస్ఎస్) అందించే మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో విశిష్ట సేవలందించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు రైతులు, పాత్రికేయులు, శాస్త్రవేత్తలకు కె.ఎస్.ఎస్ ఈ పురస్కారాలను అందిస్తోంది. పంతంగితో పాటుగా పసుపు విత్తన రైతు పిడికిటి చంద్రశేఖర ఆజాద్ (తెలంగాణ), ప్రకృతి వ్యవసాయ మహిళా రైతు అన్నే పద్మావతి (నూజివీడు), టీ న్యూస్ చేను–చెలక ఎడిటర్ విద్యాసాగర్, తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వరి నిపుణుడు ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.సురేంద్రరాజులకు కూడా ఈ అవార్డు లభించింది.

# అట్టుడుకుతున్న యూపీ



కాన్పూర్‌లో ఆందోళనకారులు పోలీస్ పోస్ట్ వద్ద వాహనాలను తగలబెట్టిన దృశ్యం

## 'పౌర' ఆందోళనల్లో 16కు చేరిన మృతులు

- ఆందోళనకారులే కాల్చుకున్నారన్న యూపీ సర్కార్
- అస్సాం, బెంగాల్‌లో పరిస్థితులు ప్రశాంతం
- ప్రతిపక్షాల దుష్ప్రచారంపై బీజేపీ కార్యాచరణ

**న్యూఢిల్లీ/లక్నో/పుణే:** పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో శనివారం ఆందోళనలు తీవ్ర రూపం దాల్చాయి. రాష్ట్రంలో జరుగుతున్న ఆందోళనల్లో మృతుల సంఖ్య 16కు చేరుకుంది. నిరసనకారుల దాడిలో 263 మంది పోలీసులు గాయాలపాలు కాగా, వీరిలో 57 మంది బుల్లెట్ గాయాలయ్యాయని రాష్ట్ర ఉన్నతాధికారులు తెలిపారు. పౌరసత్వ సవరణ చట్టం, దేశవ్యాప్తంగా ఎన్నార్సీ అమలుకు వ్యతిరేకంగా బిహార్‌లో ఆర్జేడీ పిలుపు మేరకు శనివారం బంద్ జరిగింది. ఆందోళనలకు కేంద్ర బిందువుగా ఉన్న అస్సాం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో శనివారం పరిస్థితులు సద్దుమణిగాయి. పౌరసత్వ సవరణ చట్టంపై సాగుతున్న దుష్ప్రచారానికి అడ్డుకట్ట వేసేందుకు మూడు కోట్ల కుటుంబాలకు అవగాహన కల్పిస్తామని బీజేపీ తెలిపింది.

**పోలీస్ ఠాణాకు నిప్పు**

శుక్రవారం జరిగిన ఆందోళనల్లో ఆరుగురు మృతి చెందడంపై నిరసనకారులు శనివారం రాంపూర్ బంద్‌కు పిలుపునిచ్చారు. దీంతో పోలీసులు నిషేధాజ్ఞలు విధించారు. అయినప్పటికీ, 12– 18 ఏళ్ల వయస్సున్న బాలురు సహా 500 మంది ఆందోళనకారులు రాంపూర్ ఈద్గా సమీపంలో గుమికూడి పోలీసులపై రాళ్లు రువ్వారు. ఈ సందర్భంగా పోలీసులతో జరిగిన ఘర్షణల్లో ఐదుగురు ఆందోళనకారులు గాయపడగా ఒకరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ఆందోళనకారుల రాళ్ల దాడిలో డజను మంది పోలీసులు కూడా గాయపడ్డారని చెప్పారు. ఈ ఘర్షణలకు స్థానికేతరులే కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఏఎంయూ)లో నిరసనలు కొనసాగాయి. కాన్పూర్‌లో ఆందోళనకారులు యతీమ్‌ఖానా పోలీస్ స్టేషన్‌కు నిప్పుపెట్టారు.

**వాళ్లే కాల్చుకున్నారు: డీజీపీ ఓపీ సింగ్**

రాష్ట్రంలో ఎక్కడా పోలీసులు కాల్పులు జరపలేదని, ఆందోళనకారులే అక్రమంగా తెచ్చుకున్న ఆయుధాలతో కాల్చుకున్నారని యూపీ డీజీపీ ఓపీ సింగ్ వ్యాఖ్యానించారు. 'నిరసనకారులు మహిళలు, చిన్నారులను అడ్డుపెట్టుకున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్నారు. కొన్ని చోట్ల అక్రమంగా ఆయుధాలతో కాల్పులకు దిగుతున్నారు. దీంతో పోలీసులు అంతిమ ప్రయత్నంగా టియర్‌గ్యాస్, లాఠీచార్జీలను వాడాల్సి వస్తోంది. కొన్ని రాజకీయ పార్టీలు, ఎన్జీవోల వారూ నిరసనలకు దిగుతున్నారు. అల్లర్ల వెనుక బంగ్లాదేశీయుల హస్తం ఉందంటూ వస్తున్న వార్తలపైనా దర్యాప్తు జరుపుతాం' అని ఆయన తెలిపారు. లక్నోలో ఇప్పటి వరకు 218 మందిని అరెస్టు చేసినట్లు డీజీపీ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు లక్నోలో ఆందోళనల్లో సంభవించిన నష్టం వివరాలు సేకరిస్తున్నామని, బాధ్యులకు నోటీసులు జారీ చేసి నష్టాన్ని రాబడతామన్నారు. లక్నోలో ఈ నెల 23 వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వివిధ నేరాలకు పాల్పడిన 705 మందిని అరెస్టు చేశామని, 4,500 మందిని నిర్బంధంలోకి తీసుకున్నామని ఐజీ ప్రవీణ్ కుమార్ తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు 102 మందిని అరెస్టు చేశామన్నారు. రాష్ట్రంలో నిరసనకారుల దాడిలో క్షతగాత్రులైన 263 మంది పోలీసు సిబ్బందిలో 57 మందికి బుల్లెట్ గాయాలయ్యాయని ఐజీ ప్రవీణ్ వెల్లడించారు. ఆందోళనలు జరిగిన ప్రాంతాల నుంచి 405 ఖాళీ బుల్లెట్ కేసులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఫిరోజాబాద్ జిల్లాలో శనివారం జరిగిన వివిధ ఆందోళనల్లో ముగ్గురు మృతి చెందారని ఎస్పీ సచీంద్ర తెలిపారు.

### అవగాహన కల్పిస్తాం: బీజేపీ

చట్ట సవరణపై వ్యక్తమవుతోన్న తీవ్రమైన వ్యతిరేకతకు చెక్‌పెట్టాలని బీజేపీ కృతనిశ్చయంతో ఉంది. దీనిలో భాగంగా వచ్చే పది రోజుల్లో దాదాపు మూడు కోట్ల కుటుంబాలను కలిసి పౌరసత్వ సవరణ చట్టంపై అవగాహన కల్పిస్తామని బీజేపీ ప్రధాన కార్యదర్శి భూపేందర్ యాదవ్ తెలిపారు. ప్రతి జిల్లాలో ర్యాలీలు చేపడతామని, దేశవ్యాప్తంగా 250 మీడియా సమావేశాలు పెడతామని అన్నారు. ఈ చట్టం వల్ల లబ్ధిపొందిన కుటుంబాల వారిని కూడా ఈ ప్రచారంలో భాగస్వాములుగా చేస్తామన్నారు.

**మహారాష్ట్ర కూడా వ్యతిరేకించాలి: పవార్**

పౌరసత్వ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఎన్సీపీ చీఫ్ శరద్‌పవార్ కేంద్రాన్ని కోరారు. ఈ చట్టంపై ఇప్పటికే వ్యతిరేకత ప్రకటించిన 8 రాష్ట్రాల జాబితాలో మహారాష్ట్ర కూడా చేరాలని ఆయన సూచించారు. ఈ చట్టాన్ని అమలు చేయలేని రాష్ట్ర ప్రభుత్వాలను కేంద్రం రద్దు చేసే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ శనివారం పట్నాలో ఆందోళన చేస్తున్న నిరసనకారులు

### భీం ఆర్మీ చీఫ్ అరెస్ట్

ఢిల్లీలోని దార్యాగంజ్‌లో జరిగిన హింసాత్మక ఘటనలతో సంబంధం ఉందనే ఆరోపణలతో భీం ఆర్మీ చీఫ్ చంద్రశేఖర్ ఆజాద్‌ను పోలీసులు శనివారం అరెస్టు చేసి ఢిల్లీ కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో ఆజాద్‌ను 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ కోర్టు ఆదేశాలిచ్చింది. అయితే, ఆజాద్ పెట్టుకున్న బెయిల్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. దార్యాగంజ్ ఘటనకు సంబంధించి మరో 15 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శుభాష్ మార్గ్‌లో పార్కు చేసి ఉన్న ఓ ప్రైవేటు కారుకి ఆందోళనకారులు నిప్పు పెట్టారనీ, అల్లర్లకు పాల్పడ్డారనీ పోలీసులు ఆరోపించారు. ఈ ఘటనలతో సంబంధమున్న 40 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### చట్టానికి 1,100 మంది విద్యావేత్తల మద్దతు

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా భారత్‌లో ఆందోళనలు కొనసాగుతున్నవేళ దేశ విదేశీ విశ్వవిద్యాలయాలకు చెందిన పలువురు విద్యావేత్తలు, పరిశోధకులు సవరణ చట్టానికి అనుకూలంగా స్పందించారు. పౌరసత్వ చట్టాన్ని స్వాగతిస్తూ 1,100 మంది తమ సంతకాలతో శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సంతకాలు చేసిన వారిలో షిల్లాంగ్ ఐఐఎం చైర్మన్ శిశిర్ బజోరియా, నలందా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ సునైనా సింగ్, జేఎన్‌యూ ప్రొఫెసర్ ఐనుల్ హసన్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీస్, కన్‌ఫ్లిక్ట్ స్టడీస్ పరిశోధనా సంస్థలో సీనియర్ అధ్యాపకుడు అభిజిత్ అయ్యర్ మిత్ర, పాత్రికేయుడు కంచన్ గుప్తా, రాజ్యసభ సభ్యుడు స్వపన్ దాస్‌గుప్తా తదితరులు ఉన్నారు. అనవసరంగా భయాందోళనలు చెందాల్సిన పనిలేదని, పుకార్ల భ్రమల్లో పడకూడదని ఈ లేఖ ద్వారా మేధావులు సమాజంలోని అన్నివర్గాల ప్రజలను కోరారు. శాంతియుతంగా ఆలోచించాలని సూచించారు. భారతదేశ నాగరికతను కాపాడేందుకు, మైనారిటీల హక్కుల రక్షణకోసం పార్లమెంటు ప్రయత్నిస్తోందంటూ ఈ లేఖలో కొనియాడారు.



ప్రఖ్యాత సంగీతదర్శకులు ఇళయరాజా రూపంలో తయారుచేసిన కేక్ ఇది. 50 కేజీల చక్కెర, 250 కోడిగుడ్లు, ఇతర ముడి సరుకులతో దీన్ని చేశారు. తమిళనాడులోని రామనాథపురానికి చెందిన ఓ బేకరీ యజమాని ఇలా నిలువెత్తు ప్రతిమను తయారుచేసి షాప్ ముందు ప్రదర్శించాడు.

# అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- మంత్రులతో ప్రధాని మోదీ సుదీర్ఘ సమావేశం
- ఆరు నెలల పురోగతిపై సమీక్ష



**న్యూఢిల్లీ:** రెండోసారి అధికారపగ్గాలు చేపట్టి ఆరు నెలలు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ అభివృద్ధిపై సమీక్ష జరిపారు. ఇందులో భాగంగా శనివారం మొత్తం 56 మంత్రిత్వ శాఖలతో సమావేశమై, మంత్రుల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టాలని కోరారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, వారి ఆకాంక్షలను గౌరవించాలని కోరారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలిక సదుపాయాలు, సాగు సహా వివిధ రంగాల విధానాలను రూపొందించాలని కోరారు. చాణక్యపురిలోని ప్రవాసి భారతీయ కేంద్రంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన ఈ భేటీ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. బీజేపీ రెండోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటిసారిగా అన్ని మంత్రిత్వ శాఖలతో సమావేశం నిర్వహించిన ప్రధాని మోదీ.. అదే స్థాయిలో మరోసారి భేటీ చేపట్టారు. కాగా, వచ్చే ఫిబ్రవరిలో బడ్జెట్ తర్వాత చేపట్టబోయే కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు ఈ సమావేశమే ప్రాతిపదిక కానుందని భావిస్తున్నారు.

**ఏం చర్చించారు?**

ముఖ్య పథకాల అమలు తీరు, మిషన్ 2022లో చేపట్టిన సంక్షేమ పథకాల అమలుపైనా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం, ప్రతి ఇంటికీ తాగునీరు, అందరికీ ఇళ్లు, ఆయుష్మాన్ భారత్, టీకా కార్యక్రమం తదితరాలను సమీక్షించారు. మంత్రుల నుంచి సలహాలు స్వీకరించడంతోపాటు ఆర్థిక మందగమనం, బడ్జెట్‌పైనా సమాలోచనలు సాగాయి. పలువురు మంత్రులపై అదనపు శాఖల బాధ్యతలతో పనిభారం ఉండటం, కొందరి పనితీరు సంతృప్తికరంగా లేకపోవడానికి సంబంధించి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ దిశగా చర్చ జరిగినట్లు సమాచారం.

# మహారాష్ట్రలో రైతు రుణమాఫీ

- రూ. 2 లక్షల వరకూ రుణమాఫీ: సీఎం
- ప్రభుత్వంపై 40 వేల కోట్ల భారం



**నాగ్‌పూర్:** మహారాష్ట్ర ప్రభుత్వం ఆ రాష్ట్ర రైతులకు తీపి కబురు అందించింది. రూ. 2 లక్షల వరకూ ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తున్నట్లు సీఎం ఉద్ధవ్ ఠాక్రే ప్రకటించారు. 2019 సెప్టెంబర్ 30 వరకూ ఉన్న రుణాలు మాఫీ చేయనున్నట్లు చెప్పారు. శీతాకాల అసెంబ్లీ సమావేశాల చివరి రోజైన శనివారం ఆయన ఈ ప్రకటన చేశారు. ఈ రుణమాఫీకి 'మహాత్మా జ్యోతిరావ్ పూలే' పథకంగా పేరుపెట్టారు. మాఫీకి అర్హత పొందేందుకు కొన్ని పత్రాలు అవసరమవుతాయని చెప్పారు. దీని వల్ల రూ. 40 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. లోన్ల మాఫీ కోసం గత ప్రభుత్వంలో మాదిరి గంటల తరబడి వరుసల్లో నిలబడాల్సిన అవసరం లేదని ఆర్థిక మంత్రి జయంత్ పాటిల్ చెప్పారు. కేవలం ఆధార్ కార్డుతో బ్యాంకుకు వెళితే సరిపోతుందని చెప్పారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ పథకానికి అనర్హులని చెప్పారు. రుణమాఫీకి రూ. 2 లక్షల పరిమితి పెట్టడంపై బీజేపీ మండిపడింది. రైతుల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పి ఉద్ధవ్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని ప్రతిపక్ష నాయకుడు దేవేంద్ర ఫడ్నవీస్ ఆరోపించారు. దీనిపై తాము రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని చెప్పారు. అకాల వర్షం కారణంగా అక్టోబర్ నెలలో పంట నష్టంతో దెబ్బ తిన్న రైతులను ఆదుకోవడంలో కూడా ప్రభుత్వం విఫలమైందన్నారు. 2017లో అప్పటి బీజేపీ–శివసేన ప్రభుత్వం 50 లక్షల మంది రైతులకు చెందిన రూ. 19 వేల కోట్ల రుణాలను చెల్లించింది.

### ఎంపీ గౌతమ్ గంభీర్‌కు బెదిరింపు ఫోన్ కాల్స్

**న్యూఢిల్లీ:** గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఢిల్లీ తూర్పు ఎంపీ, మాజీ క్రికెటర్ గౌతమ్ గంభీర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ఓ అంతర్జాతీయ నంబర్ నుంచి ఫోన్ వచ్చినట్లు తెలిపారు. చంపుతామని బెదిరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు షహదారా, సెంట్రల్ జిల్లాల కమిషనర్లకు లేఖ రాశారు. తనకు, తన కుటుంబానికి రక్షణ కల్పించాలని అందులో పేర్కొన్నారు.

### రేపు రాజ్‌ఘాట్ వద్ద కాంగ్రెస్ 'సత్యాగ్రహం'

**న్యూఢిల్లీ:** పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీ నేతృత్వంలో ఈ నెల 23న (సోమవారం) ఢిల్లీలోని గాంధీ సమాధి రాజ్‌ఘాట్ వద్ద సత్యాగ్రహం కార్యక్రమం చేపట్టనున్నారు. పౌరులకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను కాపాడుకునేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 8 వరకూ ఈ ధర్నా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ ధర్నాలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీలు పాల్గొంటారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. ఆదివారమే ఈ ధర్నా చేపట్టాలని ముందుగా భావించినప్పటికీ అనుమతులు పొందే క్రమంలో ఆలస్యం వల్ల సోమవారం నిర్వహించనున్నట్లు వేణుగోపాల్ చెప్పారు.

## సరిహద్దు వివాదం పరిష్కరించుకుందాం

**భారత్, చైనా నిర్ణయం**

**న్యూఢిల్లీ:** దశాబ్దాలుగా నలుగుతున్న సరిహద్దు సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నాలను వేగవంతం చేయాలని భారత్, చైనాలు ఏకాభిప్రాయానికి వచ్చాయి. త్వరగా ఈ సమస్యను పరిష్కరించుకుని పురోగతే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించాయి. సరిహద్దు వివాదంపై చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మధ్య 22వ దఫా చర్చలు శనివారం జరిగాయి. వివాద పరిష్కారం దిశగా వీరిద్దరూ నిర్మాణాత్మకంగా చర్చలు జరిపారని అధికార వర్గాలు తెలిపాయి. పరస్పర అభిప్రాయాలను గౌరవించుకోవాలని, పరస్పరం విశ్వాసం పెంపొందించుకోవాలని అంగీకారానికి వచ్చారని విదేశాంగ శాఖ తెలిపింది. 'భారత్–చైనా వ్యూహాత్మక సంబంధాల కోణంలో సరిహద్దు సమస్యను చూడాలని, సరిహద్దుల్లో శాంతి నెలకొల్పాలని ఇరు వర్గాలు అంగీకారానికి వచ్చాయి. భారత్–చైనాల సంబంధాల్లో సుస్థిర, సమతులాభివృద్ధి ఈ ప్రాంతంతోపాటు ప్రపంచ శాంతి, అభివృద్ధికి సానుకూలంగా మారుతుందనే అభిప్రాయాన్ని ఈ ప్రత్యేక ప్రతినిధుల భేటీ వ్యక్తం చేసింది' అని విదేశాంగ శాఖ తెలిపింది. సరిహద్దు వివాదంపై చర్చించేందుకు వాంగ్, దోవల్‌ను రెండు దేశాలు ప్రత్యేక ప్రతినిధులుగా నియమించాయి. వచ్చే ఏడాది చైనాలో 23వ దఫా భేటీ కావాలని కూడా ఇద్దరు ప్రతినిధులు నిర్ణయించారు. భారత్–చైనాల మధ్య 3,488 కిలోమీటర్ల వాస్తవ నియంత్రణ రేఖపై వివాదం నలుగుతోంది. అరుణాచల్ ప్రదేశ్‌తోపాటు టిబెట్ దక్షిణ ప్రాంతం కూడా తనదేనని చైనా వాదిస్తోంది.



శనివారం హరియాణాలోని గురుగ్రామ్‌లో ఫొటోలకు పోజిస్తున్న 'మిస్ టీన్ ఇంటర్నేషనల్' కిరీటం విజేత ఆయుషి ధోలకియా

## కంపెనీ డైరెక్టర్‌ను చంపేస్తానని బెదిరించిన నీరవ్

- చార్జ్‌షీట్‌లో పేర్కొన్న సీబీఐ
- మహారాష్ట్రలోని ప్రత్యేక కోర్టుకు తెలిపిన దర్యాప్తు సంస్థ



**న్యూఢిల్లీ:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు దాదాపు రూ.13వేలకోట్లు ఎగ్గొట్టి పరారైన వజ్రాలవ్యాపారి నీరవ్ మోదీపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శనివారం చార్జిషీట్ దాఖలు చేసింది. తన సంస్థలోని ఒక డమ్మీ డైరెక్టర్‌ను నీరవ్ బెదిరించారని మహారాష్ట్రలోని ప్రత్యేక కోర్టుకు దర్యాప్తు సంస్థ పేర్కొంది. ఈజిప్టులోని కైరో నుంచి ఇండియాకు తిరిగొస్తే చంపేస్తానని డైరెక్టర్లలో ఒకరైన ఆశిష్ మోహన్ భాయ్ లాడ్‌ను నీరవ్ బెదిరించాడని తెలిపింది. బ్యాంకు స్కామ్ కేసులో అరెస్టు నుంచి తప్పించుకోవడానికి లాడ్ దుబాయ్ నుంచి కైరోకు పారిపోయాడు. తర్వాత 2018లో భారత్‌కి తిరిగి రావాలని అనుకున్నప్పుడు నీరవ్ తరఫున నేహాల్ మోదీ బెదిరించాడని వెల్లడించింది. యూరప్ కోర్టులో జడ్జి ముందు నీరవ్‌కి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇవ్వాలని, దీనికి లాడ్‌కు నేహాల్ రూ.20 లక్షలు ఇవ్వజూపారని, అయితే దీనిని లాడ్ తిరస్కరించాడని సీబీఐ చార్జిషీట్‌లో తెలిపింది.

### సౌదీలో 88వేల ట్విట్టర్ ఖాతాలు బ్లాక్

**వాషింగ్టన్:** సౌదీ అరేబియాలో ఆ దేశ అధికారులకు అనుకూలంగా సందేశాలు పోస్ట్ చేస్తున్నందుకు గానూ దాదాపు 88 వేల అకౌంట్లను శుక్రవారం బ్లాక్ చేసినట్లు ట్విట్టర్ వెల్లడించింది. ఇక ట్రంప్‌నకు అనుకూలంగా, ప్రత్యర్థులను కించపరిచే రీతిలో పోస్టులు చేసినందుకు గానూ వియత్నాం, అమెరికా, జార్జియాలలో 600 అకౌంట్లను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలు బ్లాక్ చేశాయి. అలాగే వియత్నాంలోని ఓ నెట్‌వర్క్‌ను బ్లాక్ చేసినట్లు ఫేస్‌బుక్ తెలిపింది. సౌదీలో బ్లాక్ చేసిన 88 వేల అకౌంట్లలో 5,927 అకౌంట్ల సమాచారాన్ని ట్విట్టర్ విడుదల చేసింది. సౌదీకి చెందిన సోషల్ మీడియామార్కెటింగ్ సంస్థ స్మాట్ సమాచార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ట్విట్టర్ ప్రాథమిక దర్యాప్తులో గుర్తించింది.

## నోట్ల రద్దు వేళ శశికళ ఆస్తులు పైపైకి



**సాక్షి, చెన్నై:** తమిళనాడు దివంగత సీఎం జయలలిత నెచ్చెలి చిన్నమ్మ శశికళ పెద్ద నోట్ల రద్దు సమయంలో భారీగా ఆస్తులు కొనుగోలు చేసినట్లు ఆదాయపన్ను శాఖ (ఐటీ) విచారణలో తేలింది. ఆ సమయంలో ఆమె మాల్స్, భవనాలను కొనుగోలు చేసినట్టు గుర్తించారు. పెరోల్‌పై బయటకు వచ్చిన సమయంలో కొన్ని ఆస్తులు చేతులు మారినట్లు కనుగొన్నారు. మద్రాసు హైకోర్టులో శశికళ ఆదాయ వ్యవహారాలకు సంబంధించిన ఓ పిటిషన్‌పై స్టే విధించాలని శశికళ రిట్ దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిందిగా ఐటీ శాఖను కోర్టు ఆదేశించింది. శనివారం న్యాయమూర్తి అనితా సుధాకర్ ముందు ఈ పిటిషన్ విచారణకు వచ్చింది. శశికళ ఆదాయ, ఆస్తుల వ్యవహారం ముగిసిన అధ్యాయమని, ఇప్పుడు దానిపై విచారణ అవసరం లేదని శశికళ తరఫు లాయర్ పేర్కొన్నారు. పెద్ద నోట్ల రద్దు సమయంలో శశికళ చెన్నై పెరంబూరు, మదురై, కేకే నగర్‌లలో షాపింగ్ మాల్స్ పుదుచ్చేరిలో ఒక రిసార్ట్, కోయంబత్తూరులో పేపర్ మిల్, చెన్నై ఒరగడంలో చక్కెర మిల్లు, పాత మహాబలిపురం రోడ్డులో సాఫ్ట్‌వేర్ కంపెనీ, కోయంబత్తూరులో 50 పవన విద్యుత్ ప్లాంట్‌లు కొనుగోలు చేసినట్టు ఐటీ తరఫు న్యాయవాది ఆధారాలను కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ ఆస్తులన్నీ నగదు ద్వారానే జరిగినట్టు చెప్పారు. దీనిని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి త్వరితగతిన అన్ని ప్రక్రియలు ముగించాలని ఆదేశిస్తూ, తదుపరి విచారణను వాయిదా వేశారు.

### హోండురస్ జైల్లో 18 మంది ఖైదీల మృతి

**టెగుసిగల్పా:** సెంట్రల్ అమెరికాలోని హోండురస్ దేశ జైల్లో ఖైదీల మధ్య జరిగిన గొడవల్లో 18 మంది మరణించగా, 16 మంది గాయపడ్డారు. ఆ దేశంలోని ఉత్తరభాగంలో నగరమైన టెలాలోని జైల్లో శనివారం ఈ ఘటన చోటుచేసుకుంది. వీరిలో 17 మంది జైల్లోనే మృతిచెందగా, మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించినట్లు అధికారులు తెలిపారు. ఖైదీల మధ్య గొడవ ఎందుకు జరిగిందో తమకు తెలియరాలేదని చెప్పారు. ఇటీవల ఇదే జైల్లో అయిదు మందిని మరో ఖైదీ కాల్చి చంపడంతో దేశంలోని జైళ్లను అన్నింటినీ ఆర్మీ అదుపులోకి తీసుకోవాలంటూ ఆ దేశాధ్యక్షుడు జువాన్ ఓర్లాండో హెర్నాండెజ్ ఆదేశాలు జారీ చేశారు. జైలు ఆర్మీ అదుపులోకి రాలేదని జైలు అధికారి డిగ్నా చెప్పారు.

### జీఎస్టీలో మార్పులు ఉండకపోవచ్చు: సుశీల్

**న్యూఢిల్లీ:** ఆర్థిక మందగమనం కారణంగా ఇప్పట్లో జీఎస్టీ శ్లాబుల్లో మార్పులు ఉండకపోవచ్చని ఇంటిగ్రేటెడ్ గూడ్స్, సర్వీస్ ట్యాక్స్(ఐజీఎస్టీ) కన్వీనర్ సుశీల్ కుమార్ మోదీ శనివారం అన్నారు. కొనుగోళ్లు తగ్గుముఖం పట్టడంతో ఇప్పుడు జీఎస్టీ పెంచడం సరైన నిర్ణయం కాదన్నారు. ఆర్థిక మందగమనం కొనసాగుతున్నప్పుడు, జీఎస్టీ తగ్గించకపోతే.. పెంచడానికి కూడా అవకాశం ఉండదన్నారు. శనివారం ఆయన 'భారత్: 5 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు పయనం' అన్న అంశంపై ఎఫ్ఐసీసీఐ 92వ వార్షిక సమావేశంలో మాట్లాడారు. పన్ను రేట్లు పెంచడానికి ఏ రాష్ట్రమూ సిద్ధంగా లేదని చెప్పారు.



## ఈ గద్దకు చూపెక్కువ!

**సెకన్‌కు 130 ఫ్రేమ్‌లను కళ్లతో బంధించగల పెరెగ్రిన్ ఫాల్కన్**

**లండన్:** 'పెరెగ్రిన్ ఫాల్కన్'అనే గద్ద పక్షి జాతిలోనే అత్యంత వేగవంతమైన దూరదృష్టి కలిగి ఉంటుందని తాజా అధ్యయనంలో తేలింది. ఒక సెకనుకు దాదాపు 130 ఫ్రేమ్‌లను తన కళ్లతో బంధిస్తుందని తెలిసింది. దీంతో ఈ పక్షులు ఎక్కువ వేగంతో ఎగిరేటప్పుడు నేలపై ఉండే తన ఆహారాన్ని వేగంగా గుర్తించి, స్పందించే వీలు కలుగుతుందన్న మాట. స్వీడన్‌లోని లుండ్ యూనివర్సిటీ జరిపిన పరిశోధన ప్రకారం మానవుడి కళ్లు ఒక సెకనులో 50 నుంచి 60 ఫ్రేమ్‌లను మాత్రమే బంధించగలుగుతాయి. ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీ జర్నల్‌లో ఈ అధ్యయనం వివరాలు ప్రచురితమయ్యాయి. ఈ అధ్యయనం ప్రకారం సరైన వెలుతురు ఉన్న వాతావరణంలో పెరెగ్రిన్ ఫాల్కన్ సెకనుకు 129 ఫ్రేమ్‌లను గుర్తుపెట్టుకోగలదని తెలిసింది. సేకర్ ఫాల్కన్ అనే గద్ద సెకనుకు 102, హారిస్ హాక్ డేగ 77 ఫ్రేమ్‌లను గుర్తుపెట్టుకోగలవని తెలిపింది. వేటాడే పక్షుల దృష్టిపై తొలిసారిగా అధ్యయనం చేసి, ఎదురుగా కనిపించే దానికి ఎలా స్పందిస్తుందనే విషయం తెలుసుకున్నట్లు లుండ్ వర్సిటీకి చెందిన అల్మూట్ కెల్బర్ తెలిపారు. సేకర్ ఫాల్కన్, హారిస్ హాక్ డేగలు నేలపై మెల్లగా కదిలే క్షీరదాలను మాత్రమే వేటాడుతుంటాయని, అందుకే వాటికి తక్కువ దూరదృష్టి ఉంటుందని వివరించారు. అదే పెరెగ్రిన్ ఫాల్కన్ మాత్రం తన ఆహారాన్ని చూసిన వెంటనే ఆకాశం నుంచి దాదాపు గంటకు 350 కిలోమీటర్ల వేగంతో కిందకు దిగి చటుక్కున నోట్లో వేసుకుంటుందని చెప్పారు.



శనివారం హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహౌల్-స్పితి జిల్లాలో నివాసప్రాంతమంతా మంచుతో నిండిపోయిన దృశ్యం. రాష్ట్రంలోని కీలాంగ్‌లో మైనస్ 6.3 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది

## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, తిథి బ.ఏకాదశి ప.3.36 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం స్వాతి రా.7.24 వరకు, తదుపరి విశాఖ వర్జ్యం రా.12.43 నుంచి 2.14 వరకు దుర్ముహూర్తం సా.3.58 నుంచి 4.44 వరకు, అమృతఘడియలు... ప.11.03 నుంచి 12.34 వరకు.

సూర్యోదయం : 6.30
సూర్యాస్తమయం : 5.27
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

జి. కిషన్ రెడ్డి (కేంద్ర మంత్రి)

## రాయని డైరీ

మాధవ్ శింగరాజు

మనం మన జీవితకాలంలో ఎవరి గురించి అయితే ఆలోచించకూడదని అనుకుంటామో వారి గురించిన ఆలోచనల్లోకి మనకు తెలియకుండానే వెళ్లిపోయామని గ్రహించినప్పుడు ఒక్కసారిగా ఎక్కడో దారి తప్పినట్లుగా అయిపోతాం. మనం తిన్నగానే ఉంటాం. దారీ తిన్నగానే ఉంటుంది. ఆగి చూస్తే.. మన ఆలోచనల్లో లేని ఆ వ్యక్తి దారి మధ్యలోకి వచ్చి తలకిందులుగా నిలబడి ఉంటాడు!

రేవంత్‌రెడ్డి గురించి ఆలోచించకూడదనే అనుకున్నాను. కానీ ఎంతటివాళ్లయినా ఆలోచన కోల్పోయి తన గురించి ఆలోచించేలా చేసుకుంటాడు అతడు! కాంగ్రెస్ డీఎన్ఏ అది. దారి వెంట మనిషిని ఊరికే పోనివ్వదు కాంగ్రెస్. ఆపుతుంది. ఆగకుండా పోతుంటే పిలుస్తుంది. పిలుస్తున్నా వినిపించుకోకుంటే.. 'ఒక చట్టం తెచ్చారు తెలుసా? అంటుంది. అయినా పట్టించుకోకుండా వెళుతుంటే.. 'ఆ చట్టాన్ని నీ కోసమే తెచ్చారు' అంటుంది.

'నీ కోసం' అనే మాట వినగానే ఆ మనిషి ఆగిపోతాడు. 'నీ కోసం' అన్న దగ్గరే ఆగిపోతాడు. అప్పుడు రేవంత్‌రెడ్డిని అక్కడికి పంపుతుంది కాంగ్రెస్. 'నీ కోసం' అంటే ఏంటో ఆ మనిషికి వివరంగా చెప్పి రమ్మని పంపుతుంది.

చట్టంలో ఏముందో ఆ మనిషికి చెప్పడు రేవంత్‌రెడ్డి. చట్టంలో ఏముందని చెప్పడానికి కాంగ్రెస్ తనను పంపిందో అది చెప్తాడు.

"రేవంత్‌రెడ్డి ఇక్కడ దారి కాచి అందర్నీ అటకాయిస్తున్నాడు సార్.." అని హైద్రాబాద్ నుంచి మళ్లీ ఫోన్!!

"అటకాయించి ఏం చేస్తున్నాడు?" అని అడిగాను.



"పాకిస్తాన్‌లో పుట్టిన ఒక వ్యక్తి ఐఎస్‌ఐలో ట్రైనింగ్ తీసుకుని హిందువుగానో లేక సిక్కుగానో మారువేషంలో ఇండియా వచ్చి, ఇండియా పౌరసత్వం తీసుకుని, రాజకీయాల్లో చేరి, ఎంపీ అయి, ఐఎస్‌ఐ ఇచ్చిన లక్ష కోట్లతోనో, రెండు లక్షల కోట్లతోనో ఎంపీలందర్నీ కొనేసి, ప్రధాన మంత్రి అయిపోయి, ప్రధాని అయ్యాక జమ్మూకశ్మీర్‌ను పాకిస్తాన్‌కు, పశ్చిమ బెంగాల్‌ను బంగ్లాదేశ్‌కు ఇచ్చేస్తే నీ పరిస్థితి ఏంటని అందర్నీ ఆపి ఆపి అడుగుతున్నాడు సార్" అన్నాడు ఆ ఫోన్ చేసిన మనిషి.

"నువ్వెవరు?" అన్నాను.

"నేను ఈ దేశ పౌరుడిని సార్. భారతీయుడిని. నా దగ్గర అన్ని డాక్యుమెంట్లూ ఉన్నాయి. డాక్యుమెంట్లు ఉన్నా కూడా వాటిని పరపర చింపి నోట్లో వేసుకుని.. 'వేర్ ఆర్ యువర్ డాక్యుమెంట్స్' అని ఢిల్లీ వాళ్లొచ్చి ఇంగ్లిష్‌లో అడుగుతారని రేవంత్‌రెడ్డి చెబుతున్నాడు సార్" అన్నాడు!

"ఆర్ అండ్ బీ వాళ్లకు చెప్పకపోయావా?" అన్నాను.

"ఎందుకు సార్?" అన్నాడు.

"ఇలాంటి వాళ్లందరూ రోడ్లు, భవనాల శాఖ పరిధిలోకి వస్తారు. వాళ్లకోమాట చెబితే దారి మధ్యలో అడ్డంగా ఉన్నవాటిని క్రేన్‌లతోనో, బుల్‌డోజర్‌లతోనో తొలగించి దారిని క్లియర్ చేస్తారు" అని చెప్పాను.

"థ్యాంక్యూ సార్" అన్నాడు.

'సరే' అని ఫోన్ పెట్టేయబోతుంటే మళ్లీ "సార్.." అన్నాడు.

"చెప్పు" అన్నాను.

"సార్.. నేను నా దేశంలోనే ఉంటాను కదా సార్" అన్నాడు!

"మనం మన దేశంలోనే ఉంటాం. మన దేశంలోకి వచ్చినవాళ్లు మన దేశంలోనే ఉంటారు. మన దేశంలోకి రాబోతున్నవాళ్లూ మన దేశంలోనే ఉంటారు. సరేనా" అన్నాను.

"మరి చట్టం ఎందుకు సార్?" అన్నాడు!

రేవంత్‌రెడ్డి ఏ లెవల్లో అటకాయిస్తున్నాడో అర్థమైంది.

"లేనివాళ్లకు ఇవ్వడానికి చట్టం గానీ, ఉన్నవాళ్ల నుంచి తీసుకోడానికి కాదయ్యా. నిశ్చింతగా ఉండు" అని చెప్పాను.

# తీరం చేర్చే 'చుక్కాని'

జనతంత్రం



వర్ధెల్లి మురళి



'రోమ్ నగర నిర్మాణం ఒక్క రోజులో పూర్తికాలేదు' అని లోకోత్తరమైన ఒక నానుడి వుంది. రోమ్ నగరం లాంటి ఒక అద్భుతం ఆవిష్కృతం కావాలంటే దాని వెనుక ఎంతో కథ, ఎంతో పట్టుదల, ఎన్నో కష్టాలు, మరెన్నో త్యాగాలు నిబిడీకృతమై వుంటాయని దాని గూఢార్థం. క్రీస్తుపూర్వం ఒకటో శతాబ్దం నాటికి మూడు ఖండాలకు విస్తరించిన జగదేక మహాసామ్రాజ్యానికి రాజధానిగా రోమ్ నగరం ఆవిర్భవించింది. కానీ, ఆ నగరం పుట్టింది క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో. ఆ వైభవోజ్వల దశను అందుకోవడానికి ముందు ఐదువందల యేళ్ల నెమ్మదైన నడక రోమ్ ఖాతాలో వుంది.

గోల్కొండ కోటలో జనాభా పెరిగి మంచినీటికి కటకట ఏర్పడిన సమయంలో ఖుతుబ్‌షాహీ పాలకుడైన మహమ్మద్ ఖులీ హైదరాబాద్ నిర్మాణ ఆలోచన చేశాడు. తొలుత చార్మినార్‌ను, మక్కా మసీదును నిర్మించి రాచవీధులను సిద్ధంచేసి కొన్ని భవనాలను నిర్మించాడు. ఆ తర్వాత అల్లాను ప్రార్థించాడు. సరస్సులో చేపలను నింపినట్టు ఈ నగరం జనసమ్మర్ధంతో కళకళలాడేలా చేయాలని వేడుకున్నాడు. ఎందుకంటే, నగరాన్ని నిర్మించాలంటే కేవలం భవనాలను నిర్మించడం కాదనీ, జనం నివసించడానికి, వారికి ఉపాధి కల్పించడానికి ఇతరేతర కారణాలు చాలా దోహదం చేయాలనే వివేకం కలిగినవాడు కనుక ఖులీ చక్రవర్తి అల్లా శరణుజొచ్చాడు. ఆయన ప్రార్థన ఫలించింది. కృష్ణాతీరంలో విస్తారంగా వజ్రాలు లభ్యమయ్యాయి. వజ్రాలకు, మేలి ముత్యాలకూ ప్రపంచస్థాయిలో పెద్ద మార్కెట్‌గా అచిరకాలంలోనే హైదరాబాద్‌కు పేరొచ్చింది. అనుబంధంగా ఇతర వృత్తి వ్యాపారాలు అల్లుకున్నాయి. సరస్సులో చేపలు చేరినట్టు, నగరం నిండా జనాలు చేరారు. అప్పుడు మాత్రమే పాలనా పీఠాన్ని ఖుతుబ్‌షాహీలు గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయి, తొలి ఎన్నికల్లో చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచంలోని అనేక ముఖ్యనగరాల పేర్లు చెప్పి అటువంటి కొత్త నగరాన్ని నిర్మించాలని వుందని చెప్పేవారు. అలా చెప్పిన పేర్లలో అందమైన నగరాల్లో ఒకటిగా పేరుగాంచిన టర్కీలోని ఇస్తాంబుల్ కూడా వుంది. ప్రధానమంత్రి చెప్పారని కజకిస్థాన్ రాజధాని ఆస్థా పేరును కూడా చెప్పేవారు. కానీ, ఈ రెండు నగరాలుకూడా కొత్తగా నిర్మించినవి కావు. ఇస్తాంబుల్‌కు పదిహేను వందల ఏళ్ల చరిత్ర వుంది. వందల సంవత్సరాల పాటు సాగిన క్రూసేడ్లకు కేంద్ర బిందువైన కాన్‌స్టాంట్‌నోపుల్ కొత్తపేరే ఇస్తాంబుల్. ఒటోమన్ సామ్రాజ్యం పతనమైన తర్వాత టర్కీ పాలకులు నగరం పాత పేరును మార్చివేశారు. ఇప్పటికి మూడుసార్లు పేరు మారిన 'ఆస్థా'కు కూడా శతాబ్దాల కథ వుంది.

### గ్రీన్‌ఫీల్డ్ ఆలోచన

విభజన అనంతరం అవశేష ఆంధ్రప్రదేశ్‌కు రాజధానిగా ఒక గ్రీన్‌ఫీల్డ్ (సరికొత్త నిర్మాణం) మహానగరం ఆలోచన సరికాదని శివరామకృష్ణన్ కమిటీ అభిప్రాయపడింది. రాజధాని ఎంపికపై సూచనలు చేయడానికి కేంద్ర హోం శాఖ కార్యదర్శిగా పనిచేసి రిటైరైన శివరామకృష్ణన్ నాయకత్వంలో కేంద్రం ఓ కమిటీని నియమించింది. విజయవాడ–గుంటూరుల సమీపంలో రాజధాని నిర్మాణం ఏమాత్రం తగదని కమిటీ స్పష్టంగా చెప్పింది. ఒకేచోట రాజధానిని కేంద్రీకరించడం కంటే మూడు జోన్లలో వికేంద్రీకరిస్తే బాగుంటుందని సూచించింది. నాలుగు ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించి అభివృద్ధి చర్యలు చేపట్టాలని కమిటీ నివేదికలో పేర్కొన్నది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జీఎన్ రావు కమిటీ కూడా స్థూలంగా ఇవే సూచనలు చేయడం గమనార్హం. శివరామకృష్ణన్ కమిటీ సూచనలను పెడచెవిన పెట్టి చంద్రబాబు ప్రభుత్వం విజయవాడ–గుంటూరుల సమీపంలో ముక్కారు పంటలు పండే 35 వేల ఎకరాల మాగాణి భూములను సేకరించి గ్రీన్‌ఫీల్డ్ రాజధాని నిర్మాణానికి సన్నాహాలు చేసింది. ఈ మొత్తం వ్యవహారంలో ఇన్‌సైడర్ ట్రేడింగ్ ద్వారా ముఖ్యమంత్రి, ఆయన సన్నిహితులు, బంధువులు, అధికార పార్టీ ప్రముఖులు వేలకోట్ల రూపాయల దోపిడీకి పథకం వేశారని అప్పుడే నాడు ప్రతిపక్షంగా వున్న ప్రస్తుత అధికార పార్టీ ఆరోపించింది. ఆరోపణే కాకుండా అందుకు తగిన ఆధారాలను కూడా ఆ పార్టీ చూపెట్టింది. మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కూడా తెలుగుదేశం పార్టీ అవినీతి లీలల్ని ఆధార సహితంగా ఎండగట్టింది. ఈ బాగోతం ఇంతటితో ఆగలేదు. సమీకరించిన భారీ ల్యాండ్ బ్యాంక్‌తో ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని అతిపెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారానికి స్వయాన ప్రభుత్వ పెద్దలు తెరతీశారు. ఇందుకోసం సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంటున్నామని ప్రజలను తప్పుదోవ పట్టించి ప్రైవేట్ సంస్థలను రంగంలోకి దించారు. మరోసారి తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, రాజధాని వ్యవహారం వారు అనుకున్నట్టుగా జరిగి వుంటే, ఆ లూటీ ధనం అంచనా వేయడానికి కొందరు గణిత నిపుణులూ, ఆర్థిక నిపుణులూ క్యాలిక్యులేటర్ల సహాయంతో కసరత్తు చేయ వలసి వచ్చేది. డామిట్! మెకన్నాస్ గోల్డ్ సినిమాలాగా కథ అడ్డం తిరిగింది. అసలే, ఎన్నికల్లో ఘోరమైన ఓటమితో మూలుగుతున్న నక్కపై ఇప్పుడు తాటిపండు పడింది. మొన్న అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి సాలోచనగా చెప్పిన అభిప్రాయాలు, జీఎన్ రావు నివేదిక సూచనలతో బిక్కచచ్చిన ప్రతిపక్ష శిబిరం దింపుడు కళ్లం ఆశతో అమాయకులైన అమరావతి ప్రాంత రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలను ఆరంభించింది.

### ఎందుకు సరికాదంటే?

**ఒకటి :** జాతికి హృదయం లాంటి రాజధానిని అవినీతి పునాదులపై నిర్మించబూనడం సమ్మతం కాదు. **రెండు:** గడించిన అనుభవాల రీత్యా పరిపాలననూ, అభివృద్ధినీ ఒకేచోట కేంద్రీకరించడం అభిలషణీయం కాదు. **మూడు:** 35 వేల ఎకరాల ప్రాంతంలో గ్రీన్ కవర్‌ను తొలగించి కాంక్రీట్ జంగిల్‌ను విస్తరించడం పర్యావరణ హితం కాదు. దీనికితోడు రాజధాని చుట్టూ నిర్మించ తలపెట్టిన రింగ్‌రోడ్ల కోసం మరింత సాగుభూమిని సేకరించవలసి వుంటుంది. దేశంలోనే అతిశ్రేష్టమైన పంట భూములున్న కృష్ణా–గుంటూరు ప్రాంతాల్లో ఇన్నివేల ఎకరాలను వ్యవసాయేతర పనులకు బదలాయించబూనడం అవివేకమూ, అనాగరికమైన చర్య. దేశ ఆహార భద్రతపై జరిగిన అతిక్రూరమైన అత్యాచారం. నిర్భయ, దిశ ఘటనలకు ఏమాత్రం తక్కువకాని నేరం. **నాలుగు:** దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలు వచ్చి స్థిరనివాసం ఏర్పరచుకోవడానికి వీలుగా ప్రతిపాదిత ప్రాంతంలో కాస్మోపాలిటన్ సంస్కృతి అవసరం. విజయవాడ పరిసర ప్రాంతాల సంస్కృతి ఇందుకు పూర్తిగా భిన్నం. విజయవాడలో ఇంటి అద్దెలపై స్వయంగా చంద్రబాబు నాయుడే పలుమార్లు అసంతృప్తి ప్రకటించారు. ఇలా అయితే మన దగ్గరకెవరు వస్తారని అసహనం ప్రకటించిన సందర్భాలున్నాయి. ఇల్లు అద్దెకివ్వడానికి ముందు కులాన్ని ఆరాతీసే దురాచారం అక్కడ కొనసాగుతున్నదని చంద్రబాబు అనుకూల పత్రిక రచయితలే పలుమార్లు వారి వ్యాసాల్లో వాపోయారు. ఒకనాడు యావదాంధ్ర దేశానికి చైతన్య కేంద్రంగా, అభ్యుదయ భావాలకు ఆలవాలంగా విలసిల్లిన విజయవాడకు ఇటువంటి దురాచారాలు ఎందుకు సంక్రమించాయో పరిశోధనలు జరగవలసి ఉన్నది. **ఐదు:** పెద్దఎత్తున ఐటీ కంపెనీలను, బహుళజాతి సంస్థల, పారిశ్రామిక సంస్థల కార్పొరేట్ కార్యాలయాలనూ ఏర్పాటుచేయడానికి వాతావరణ పరిస్థితులు కూడా సహకరించాలి. ఈ కోణంలో ఇంతకంటే మెరుగైన ప్రత్యామ్నాయాలు అందుబాటులో వున్నప్పుడు ఈ అంశం కూడా ప్రతికూలంగా మారుతుంది.

పరిపాలననూ, అభివృద్ధిని వికేంద్రీకరిస్తే సరిపోతుందా? ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక మహానగరం అవసరం లేదా?... రాష్ట్ర విభజన ఫలితంగా ఆంధ్రప్రదేశ్ భారీ రెవెన్యూ కోల్పోయింది. నేటికీ 60 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి వున్నారు. అక్షరాస్యతలోనూ వెనుకబాటుతనమే కొనసాగుతున్నది. ఈ లోపాలను అధిగమించి ఏటా లక్ష ఉద్యోగాలను సృష్టించుకోగలిగితేనే రాష్ట్రం అభివృద్ధి పట్టాల పైకి ఎక్కుతుందని శివరామకృష్ణన్ కమిటీ నివేదిక స్పష్టం చేసింది. ఈ కర్తవ్యం నెరవేరాలంటే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్ లాంటి ఒక నగరం అవసరమే. ఒక మహానగరం అవసరమే. పైన చెప్పుకున్న లోపాలు లేని మహానగరానికి ఎక్కడ అవకాశం వుంది?

### విశాఖే నెంబర్ వన్

దాదాపు రెండువేల ఐదు వందల సంవత్సరాల ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) ప్రాంత చరిత్ర మనకు అందుబాటులో వుంది. కానీ ఎందుకో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ భూభాగంలో ఒక మహానగరం వర్ధిల్లిన దాఖలా మాత్రం కనిపించడం లేదు. ఒకరకంగా ఈ ప్రాంతానిది బహుళ నగర సంస్కృతి. అనేక చిన్న నగరాలు స్వయంపోషకంగా ప్రకాశించాయి. గ్రీకు చరిత్రకారుడు మెగస్తనీస్ క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలోనే మౌర్య చంద్రగుప్తుని కాలంలో భారతదేశాన్ని సందర్శించాడు. ఆంధ్ర దేశాన్ని శాతవాహనులు పాలిస్తున్న కాలం అది. కోట గోడలతో దుర్భేద్యంగా నిర్మించిన 30 నగరాలు ఆంధ్రులకు ఉన్నాయని మెగస్తనీస్ రికార్డు చేశాడు. అంతేకాకుండా పురావస్తు పరిశోధనల్లో లభించిన అవశేషాలు, శిలాశాసనాలు, నాణేల ఆధారంగా శాతవాహనులు, తదనంతరం పాలించిన ఇక్ష్వాకుల కాలం నాటికే ఆంధ్ర ప్రాంతంలో పట్టణీకరణ జరిగింది. శాతవాహనుల కాలం నుంచి, కాకతీయ సామ్రాజ్యం ఏర్పడేలోగా వెయ్యి సంవత్సరాల కాలవ్యవధిలో అనేక రాజవంశాలు ఈ ప్రాంతాన్ని పాలించాయి. ఒక్కో సమయంలో ఒక్కో నగరం అమరావతి, విజయపురి (నాగార్జునకొండ), భట్టిపోలు (ప్రతీపాలపురం), కోడూరు (కృష్ణా జిల్లా), కపోతపురం (కదిరి), వేంగి, కొల్లిపాక, బెజవాడ, పెద్దాపురం, అమలాపురం రాజధానులుగా వెలిశాయి. పల్లవ రాజధానిగా కాంచీపురం, కాకతీయ సామ్రాజ్య రాజధానిగా ఓరుగల్లు, గోల్కొండ రాజ్య రాజధానిగా హైదరాబాద్, విజయనగర సామ్రాజ్య రాజధానిగా విజయనగరం మహానగరాలుగా అభివృద్ధి చెందినప్పటికీ ఆ నాలుగు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ భూభాగానికి ఆవలనే ఉన్నాయి. ఇప్పటికీ దాదాపు 20 పట్టణాలకు గట్టి ఊతం లభిస్తే, అభివృద్ధి సాధించగల సామర్థ్యం వుంది. వాటిలో ఆంధ్రప్రదేశ్‌కు గ్రోత్ ఇంజన్‌గా నిలబడగల సామర్థ్యం ఉన్న నగరం నిస్సందేహంగా విశాఖపట్నం.

సహజసిద్ధమైన రేవు పట్టణం విశాఖ. కేవలం తన భౌగోళిక ప్రాధాన్యత కారణంగా, చుట్టూ వున్న ప్రాంతంలో నిక్షిప్తమైన ఖనిజ సంపద కారణంగా, తన సొంత మెరిట్‌పై ఆధారపడి పారిశ్రామికంగా మెరిసిన నగరం విశాఖ. సంగీత సాహిత్యాలలో తెలుగువాడి తలపాగా విశాఖ. షిప్‌యార్డు, భారత నౌకాదళ కేంద్రం, ఉక్కు ఫ్యాక్టరీ, నౌకా నిర్మాణ కేంద్రం తదితర కేంద్ర స్థాయి సంస్థల కారణంగా ఈ నగరానికి కాస్మోపాలిటన్ స్వభావం అబ్బింది. స్థానిక ప్రజలు సహజంగానే ఆత్మీయతకు, ఆతిథ్యానికి పెట్టింది పేరు. హైదరాబాద్ తరహాలో అభివృద్ధిలో దూసుకుపోగల అన్ని లక్షణాలు విశాఖకు వున్నాయి. నిజంగానే విశాఖను ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ రాజధానిగా ప్రకటిస్తే రాబోయే పదేళ్లలో దేశంలోని టాప్ టెన్ నగరాల జాబితాలో విశాఖ చేరి పోవడం ఖాయం. లక్ష కోట్లు ఖర్చు పెట్టకుండానే, ముక్కారు పంటల భూములను బలిపెట్టకుండానే, దశాబ్దాల తరబడి నిరీక్షించకుండానే ఒక మహానగరం సిద్ధమవుతుంది. సముద్రతీరం మీదుగా భోగాపురం ఆవలి నుంచి విజయనగరం, అనకాపల్లి మీదుగా అచ్యుతాపురం సముద్ర తీరం వరకు ఒక ఇంద్రధనుస్సు ఆకారంలో నయా విశాఖ వికసిస్తుందని ఆశిద్దాం.

muralivardelli@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### రెండు



"తప్పకుండా చేయాల్సిన పనులు రెండున్నాయి. దేశానికి అయిన గాయాన్ని మాన్పడానికీ, నమ్మకాన్ని పెంపొందించడానికీ వెంటనే ఎన్నార్సీని రద్దు చేయడం మొదటి చర్య. సీఏఏ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైనది. తెలివైన ప్రభుత్వం దానిని కూడా ఉపసంహరించుకుంటుంది"

– రామచంద్ర గుహ, చరిత్రకారుడు

### నిర్వచనం



"ఎన్‌ఆర్‌సీ=నేషనల్ రిజిస్టర్ ఆఫ్ చౌకీదార్స్"

– అతుల్ ఖత్రీ, కమెడియన్

### సీఎంలు



"చిన్నచిన్న వీడియోలు, ట్వీట్లు, ఇండియా గేట్ దగ్గర నిరసన ప్రదర్శనలు చేయడం అంతా బాగానే ఉంది. కానీ, కెప్టెన్ అమరీందర్ మినహా ఇతర రాష్ట్రాల కాంగ్రెస్ ముఖ్యమంత్రులెవరూ జాతీయ పౌరసత్వ సవరణ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో అనుమతించేది లేదని ఇతర ముఖ్యమంత్రుల్లా ప్రకటించరేం?"

– రోహిణి సింగ్, జర్నలిస్ట్

### వెనుక



"కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీ శశిథరూర్ కశ్మీర్‌లేని భారతదేశం మ్యాప్‌ను ఉద్దేశపూర్వకంగా షేర్ చేశారు. అదే మ్యాప్‌ను పాకిస్తాన్ కూడా వాడుకుంది. దీన్నిబట్టి పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా వీళ్లు తెలియజేసే నిరసనల వెనుక ఎవరు ఉన్నారో మీరు సులువుగానే తెలుసుకోగలరు"

– షెఫాలీ వైద్య, రచయిత్రి

### క్రమంగా..



"హిందూత్వ ఆధిపత్య నిరంకుశ విధానాలతో గత ఐదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం, భారతదేశం హిందూ రాష్ట్రంగా మారిపోతున్నాయి. ఇప్పుడు పౌరసత్వ సవరణ చట్టంతో భారతదేశం అందరిదీ అని భావించే వారంతా నిరసనలు తెలియజేయడం ప్రారంభించారు. అది మరింత తీవ్రతరం అవుతోంది"

– ఇమ్రాన్ ఖాన్, పాక్ ప్రధాని

### దూరం



"మయన్మార్ నుంచి భారతదేశానికి 1,769 కిలోమీటర్లు, చైనా మాత్రం 2 కి.మీ. దూరంలోనే ఉంది. అయినా, రోహింగ్యాలు మన దేశానికి రావడానికే ఎందుకు ఇష్టపడతారు? ఎందుకంటే, ఇండియాలోలా చైనాలో లౌకికవాదులు, మేధావులు, జాతివ్యతిరేకులు ఉండరు. చైనాలో శరణార్థులైన రోహింగ్యాలకు మద్దతిచ్చేవారెవరూ లేరు"

– పరేష్ రావల్, నటుడు

### స్పష్టం



"దేశంలోని అన్ని విశ్వాసాలు గల ప్రజలూ బీజేపీ మత దురహంకారంపట్ల ఆగ్రహంతో రగిలిపోతున్నారని అర్థమవుతోంది. అయినా, కేవలం ముస్లింలను మాత్రమే నిందించి బీజేపీ సభ్యులు పైశాచికానందం పొందుతున్నారు"

– రూపా గులాబ్, రచయిత్రి

## సాయానికి అడ్డంకులు

అగ్రరాజ్యాలన్నీ కలిసి సిరియాలోని సంక్షుభిత ప్రాంతాల ప్రజానీకాన్ని ఏం చేయదల్చుకున్నాయో అర్థం కావడం లేదని మానవహక్కుల సంస్థలు ఆందోళన పడుతున్నాయి. సిరియాలో ఘర్షణలు సాగుతున్న ఇడ్లిబ్ తదితర ప్రాంతాల్లోని ప్రజలకు ఇప్పుడు ఐక్యరాజ్యసమితి ద్వారా అందుతున్న మానవతా సాయాన్ని మరో ఏడాదిపాటు పొడిగించాలన్న తీర్మానాన్ని భద్రతామండలిలో రష్యా, చైనాలు వీటో చేశాయి. ఆ ప్రాంతాల్లోని 40 లక్షల మంది ప్రజలకు అయిదేళ్లుగా టర్కీ వైపున రెండు మార్గాల నుంచి, ఇరాక్ వైపున్న మరో మార్గం నుంచి ఈ సాయం అందుతోంది. టర్కీ లోని రెండు మార్గాలకు తాము ఓకే అని, అది కూడా ఆర్నెల్లపాటు పొడిగించడానికి మాత్రమే సమ్మతిస్తామని రష్యా, చైనా తెలిపాయి. సిరియా గురించి మండలిలో ఏ తీర్మానం వచ్చినా రష్యా వీటో చేయడం రివాజు. చైనా, రష్యాల తీరును అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్ తప్పుబడుతుంటే... టర్కీలోని రెండు మార్గాలనూ ఆర్నెల్లపాటు వినియోగించుకోవచ్చనని చెప్పినా ఎందుకు అంగీకరించడం లేదని రష్యా ప్రశ్నిస్తోంది. సాయం అందాల్సిన మార్గాల పైనే విభేదాలు! ఇప్పుడు అందుతున్న సాయం వచ్చే నెల 10తో నిలిచిపోతుంది. కానీ, అగ్రరాజ్యాలు ఇంతవరకూ ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. ఇదే అందరిలోనూ ఆందోళన కలిగిస్తోంది.

# సాగు అంచనాపై అలసత్వమే అసలు ప్రమాదం..!

సందర్భం



డా. యలమంచిలి శివాజి

వ్యవసాయరంగ సమస్యలపై బడ్జెట్ ముందస్తు చర్చలకు గాను నన్ను ఆహ్వానించినందుకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. ఇక విషయానికొస్తే చుక్కలంటుతున్న ఉల్లి ధరలను ప్రస్తావించకుండా ఈరోజుల్లో ఏ చర్చా సంపూర్తి కాదు. కొన్ని నెలల క్రితం కిలోకి 10 నుంచి 20 రూపాయలుగా ఉన్న ఉల్లి ధర ప్రస్తుతం రూ. 200లకు చేరడంతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ ఉన్న ప్రభుత్వాలు ఎప్పటిలాగే, ఉల్లి దిగుమతులు, సబ్సిడీ ధరలకు ఉల్లిపాయలను సరఫరా చేయడంపై యుద్ధ ప్రాతిపదికపై చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వేలాది మంది ప్రజలు ప్రతిరోజూ తమ ఆధార్ కార్డును సమర్పించి కిలో ఉల్లిపాయలు కొనడానికి పొడవాటి క్యూలలో నిలబడి వేసారిపోతున్నారు.

భారీ వర్షాల కారణంగా పంట దెబ్బతినిపోవడం, అదే సమయంలో డిమాండ్ మాత్రం యధాతథంగా ఉండటంతో ఉల్లిధరలు భారీగా పెరగడం వాస్తవం. దీనికితోడుగా వ్యాపారులు కృత్రిమంగా నిల్వ చేయడంతో ఉల్లిధరలు చుక్కలంటి దేశమంతా గగ్గోలు బయలుదేరింది. దేశంలో ఉల్లి పంటల ఉత్పత్తి పరిమాణంపై నిర్దిష్టమైన యంత్రాంగాన్ని సిద్ధం చేసుకుంటే ముందస్తు చర్య తీసుకోవడానికి వీలవుతుందని ఉల్లి సంక్షోభం మంచి గుణపాఠాలను అందించింది. భారీగా పంట పండటంతో ధరలు పూర్తిగా పడిపోయిన కారణంగా తక్కువ ధరలకు పంటలు అమ్ముకోవడం, పండిన పంటను నేలపాలు చేయడం వంటి ఘటనలు సంవత్సరాలుగా చూస్తూనే ఉన్నాం. ఉల్లిపాయల ఉత్పత్తి తగ్గుముఖం పడుతోందని తెలిసిన వెంటనే కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా ఉల్లి దిగుమతులకు పూనుకుంటే ధరలు ఈ స్థాయిలో పెరిగేవి కావు.

ఉల్లిధరలు పెరగ్గానే దేశవ్యాప్తంగా గగ్గోలు పెడుతున్నప్పటికీ ఉల్లిధరలు పడిపోయినప్పుడు రైతుకోసం ఏ ఒక్కరూ చుక్క కన్నీరు కార్చకపోవడాన్ని ప్రభుత్వం గుర్తించాలి. అనేక వ్యవసాయ ఉత్పత్తులకు ప్రభుత్వం కనీస మద్దతు ధరను ప్రకటిస్తోంది కానీ వరి, గోధుమ, పత్తి వంటి కొన్ని పంటలకు మినహాయిస్తే మిగిలిన పంటల విషయంలో దాన్ని అమలు చేయడానికి తగిన యంత్రాంగం కానీ, వనరులు కానీ లేవు.

***వ్యవసాయ మార్కెటింగ్ సంస్కరణలు:*** రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్ శిస్తుపేరిట వేల కోట్ల రూపాయలను వసూలు చేస్తున్నాయి కానీ మార్కెట్ యార్డుల్లో సౌకర్యాలకు కేటాయించడానికి బదులుగా దాన్ని జనరల్ పూల్‌కి దారిమళ్లిస్తున్నాయి. వసతుల లేమితో రైతులు తమ పంటలను ఆరుబయట స్థలాల్లో నిల్వచేసి వర్షం, వరదల సమయంలో తీవ్రంగా నష్టపోతున్నారు.

***వ్యవసాయ వృత్తులకు బీమా:*** ప్రతి ఏటా ఏదో ఒక పంట చేతికి రాక తల్లడిల్లిపోతున్న రైతుల క్షేమం కోసం వ్యవసాయ బీమాలో కీలక సంస్కరణలు తీసుకురావాలి. సన్నకారు, చిన్నకారు రైతులకు పంట బీమాను కల్పించడమే కాకుండా ప్రభుత్వమే దాని ప్రీమియం చెల్లించాలి. బీమా కంపెనీలకు మాత్రమే లాభాలు అందిస్తున్న ప్రస్తుత వ్యవసాయ బీమా విధానాన్ని పూర్తిగా సంస్కరించాలి.

***సాధారణ వ్యవసాయ సమస్యలు:*** వాస్తవ సాగుదారులకు వివిధ పథకాలను అనువర్తించి అమలు చేయగల సాంకేతిక జ్ఞానాలను తీసుకురావాలి. వ్యవసాయంలోకి యువతను ఆకర్షించడానికి ప్రత్యేక పథకాలను చేపట్టాలి. భారత్‌లో వ్యవసాయ పరిశోధనను పునరుజ్జీవింప జేయాలి. రైతు ప్రధాన పరిశోధనకు నిధులు అధికంగా కేటాయించాలి. ఇది మాత్రమే ఈ దేశ రైతులకు ప్రయోజనం కలిగిస్తుంది.

వ్యాసకర్త రాజ్యసభ మాజీ ఎంపీ
మొబైల్ : 98663 76735

# నేడు చంద్రన్న సంస్మరణ



తెలుగునేల మీద అలలు, అలలుగా ఎదిగిన అనేక ప్రజా ఉద్యమాలతో అర్ధ శతాబ్దం పైబడి నడిచిన దళిత సామాజిక ఉద్యమకారులు, నాటి ఇఫ్టూ కార్మిక నాయకులు, 2004లో నాటి ప్రభుత్వంతో విప్లవ పార్టీ తరపున శాంతి చర్చల ప్రతినిధి, కల్లెపు చంద్రన్న అలియాస్ చర్చల చంద్రన్న అలియాస్ ఐడీపీఎల్ చంద్రన్న ఈ నెల 12న అమరులైనారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఆలేరు దగ్గర టంగుటూరులో 1945 మే, 15న నిరుపేద దళిత కుటుంబంలో ముత్తమ్మ, ఎల్లయ్యలకు జన్మించిన పెద్దకొడుకు చంద్రన్న. చదువుల కోసం అష్టకష్టాలు పడి జనగామలో పదో తరగతి ముగించుకొని పొట్ట చేతపట్టు కుని సికింద్రాబాద్ చిలకలగూడలోని చింతబాయి బస్తీ చేరిండు. తెలంగాణ ఉద్యమం జోరుగా సాగుతున్న కాలంలో ఈశ్వరీ బాయిగారి వెంట ఉండి ఆందోళనలో పాల్గొంటూ ఐడీపీఎల్ ఉద్యోగిగా, ప్రాగాటూల్స్, ఆల్విన్, తుంగభద్ర ఇండస్ట్రీస్, బిర్లాప్లాంట్ సహా అనేక ఫ్యాక్టరీలలో విప్లవకార్మిక నాయకుడిగా ఎదిగాడు. దేశం నలుమూలల జాతీయ కార్మిక సంఘాల సభల్లో పాల్గొని, విప్లవ పార్టీ నిర్మాణంలోకి వెళ్ళి అడ్డగుట్ట, పార్సీగుట్ట, జగద్గిర్‌గుట్ట బతుకమ్మకుంట, భగత్ సింగ్ నగర్ ఒకటేమిటి మురికివాడల పేదలకోసం, అసంఘటిత కార్మికుల కోసం అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించి జనశక్తి పార్టీ తరపున 2004లో శాంతి చర్చలో పాల్గొన్న చర్చల చంద్రన్నగా మనకు తెలుసు.

ఎన్నికల్లో పోటీ చేసి తెలంగాణలో బహుజన నాయకత్వం ఎదగాలని రాజకీయ ఆచరణకు శ్రీకారం చుట్టి మాదిగ ఉప కులాల ఫ్రంట్ ఏర్పాటుచేశారు చంద్రన్న. తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏర్పాటు చేసి, అసంఘటిత కార్మిక సంఘాల ఫ్రంట్ నడిపి, తెలంగాణ కోసం పోరాడిన యోధులకు ఒక సంఘం ఉండాలని 'తెలంగాణ స్వాతంత్ర్య సమర యోధుల సంఘం' నడిపిన చంద్రన్నను స్మరించుకోవడం మన బాధ్యత. సంస్మరణ సభకు జెండా మనమే, ఎజెండా మనమే. నిన్న అంతిమ యాత్రలో కదిలింది మనమే, సంస్మరణ సభలో కదం తొక్కాల్సింది మనమే. జనం కొరకు నిలబడ్డ యోధుడు 'అన్ సంగ్ హీరో'గా కాల గర్భంలో కలిసిపోవద్దు. మన యోధుల చరిత్ర మనమే ఎత్తి పట్టాలి. ఈ సంస్మరణ సభను ఇంటి పార్టీ సమన్వయం చేస్తున్నది. చంద్రన్న అందరివాడు... సభను జయప్రదం చేద్దాం.

(నేటి సాయంత్రం 6 గంటలకు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కల్లెపు చంద్రన్న సంస్మరణ సభ)

పోతిరెడ్డిపల్లి రామన్న మాదిగ
తెలంగాణ ఇంటి పార్టీ రాష్ట్ర సెక్రటరీ
మొబైల్ : 90006 00744

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

# సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ

ఆదివారం ॥ 22-12-2019




కృష్ణంరాజు – శ్యామల

# ఇప్పటికీ అప్పటిలా..!

**పెళ్లయి ఇరవై మూడేళ్లయింది.**
**అప్పడే తీసి కడిగిన పెళ్లి ఫొటోలా ఫ్రెష్‌గా ఉన్నారు!**
**ఇన్నేళ్ల బాధ్యతలు, ఒత్తిళ్లు, పిల్లల పెంపకం..**
**ఇవేవీ.. వీళ్ల అనురాగ బంధాన్నిచెక్కు చెదరనివ్వలేదా!**
**"ఎందుకు చెదరనిస్తాయి?" అని అడుగుతున్నారు ఈ దంపతులు.**
**క్రెడిట్ ఎవరిది? రెబల్‌స్టార్‌దా, శ్యామలగారిదా?!**
**"చిన్నచిన్న విషయాలను పెద్దవిగా చేసుకోకుంటే..**
**ఆ క్రెడిట్ ఇద్దరిదీ అవుతుంది" అని అంటున్న**
**మిస్టర్ అండ్ మిసెస్ కృష్ణంరాజుతో**
**సాక్షి ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ.. ఈ సండే మీకోసం.**

- **ఇటీవల కృష్ణంరాజుగారికి ఆరోగ్యం బాగా లేదని విన్నాం.. ఏం జరిగింది?**

**శ్యామల:** ఏం లేదు.. జస్ట్ వైరల్ ఫీవర్. దానికే ఎవరికి వాళ్లు 'క్రిటికల్' అని ఊహించుకున్నారు. మనిషి బాగున్నప్పుడు అలా అనుకుంటే ఎవరికైనా బాధగానే ఉంటుంది కదా.

**కృష్ణంరాజు:** ఆ బాధ, కోపంతోనే నేను గన్ షూట్ చేస్తున్నట్లు ఉన్న ఫొటోను తను సోషల్ మీడియాలో పెట్టింది. అనవసరమైన గాసిప్పులు ప్రచారం చేస్తే షూట్ చేస్తానని అర్థం (నవ్వులు).

- **మరి... పెళ్లి రోజుని (నవంబర్ 20) ఎలా సెలబ్రేట్ చేసుకున్నారు?**

**శ్యామల:** వైరల్ ఫీవర్ అని చెప్పాను కదా. అందుకని ఇంట్లోనే చేసుకున్నాం. మామూలుగా అయితే లంచ్‌కో, డిన్నర్‌కో బయటకు వెళతాం. పిల్లలు మంచి హోటల్స్‌లో మాకోసం పార్టీ ఎరేంజ్ చేస్తారు.

- **మీ పెళ్లయి 23 ఏళ్లు అట కదా... ఇన్నేళ్ల వైవాహిక జీవితం గురించి...**

**కృష్ణంరాజు:** ఇన్నేళ్లయిందా అనిపిస్తోంది. రోజులు అంత వేగంగా వెళ్లిపోయాయనిపించింది అంటే జీవితం హ్యాపీగా ఉన్నట్లే. ఒక మంచి కలలా సాగిపోతోందంటే.. మా మధ్య ఉన్న అండర్‌స్టాండింగ్ కారణం. కోపాలు ఎవరికైనా ఉంటాయి. అలా కోపం వచ్చినప్పుడు కాసేపు మాట్లాడుకోం. కోపం తగ్గి, కొంత గ్యాప్ ఇచ్చాక మాట్లాడుకుంటాం చూడండి.. అది మాత్రం భలే ఉంటుంది.

- **పెళ్లి రోజుకి కానుకలు ఇచ్చుకుంటారా?**

**శ్యామల:** కృష్ణంరాజుగారే నాకు పెద్ద గిఫ్ట్. నేనేం కొనుక్కున్నా కాదనరు. నేను పెట్టుకునే నగలు, కట్టుకునే చీరలు అన్నీ ఆయన కొనేవే. అన్నింటికీ మించి ఆయనే నాకు పెద్ద బహుమతి.

- **మరి.. శ్యామలగారు ఇచ్చిన బహుమతుల గురించి?**

**కృష్ణంరాజు:** నేను 'మెటీరియల్ గిఫ్ట్'లని నమ్మను. తనే నాకు గిఫ్ట్.

శ్యామల: నేను మాత్రమే కాదు.. బుద్ధిమంతులైన ముగ్గురు పిల్లలను గిఫ్ట్‌గా ఇచ్చా(నవ్వుతూ).

- **కృష్ణంరాజుగారికి మీరు అభిమాని. అభిమాన హీరోతో పెళ్లి విశేషాలు చెబుతారా?**

**శ్యామల:** పెళ్లిరోజున కృష్ణంరాజుగారి వైపు తలెత్తి చూడాలంటే వణుకు. అలా తలొంచుకుని కూర్చున్నాను. ఎలాగో ధైర్యం కూడదీసుకుని ముందు కాళ్ల నుంచి మెల్లిగా చూసుకుంటూ ముఖం చూశాను. నాకసలు కలా? నిజమా? అర్థం కాలేదు. పెళ్లికి ముందు రోజు విజయనగరం నుంచి హైదరాబాద్ వచ్చాం. మాకు మంచి విడిది ఏర్పాటు చేశారు. నాకు చిన్నప్పటినుంచీ జామకాయలంటే ఇష్టం. విడిదింట్లో జామచెట్టు ఉంది. నేను వెళ్లి కోసుకుంటుంటే 'పెళ్లి కూతురివి.. అలా కొయ్యకూడదు' అని అమ్మ మందలించింది.

- **మీ మీద 'రెబల్ స్టార్' ట్యాగ్ ఉంది. మీ ఆహార్యం చూస్తేనే వణుకు సహజం. మరి.. శ్యామలగారికి మీరు ధైర్యం చెప్పారా?**

**కృష్ణంరాజు:** ఏం భయపడొద్దు అన్నాను.

**శ్యామల:** వీళ్లది చాలా పెద్ద ఫ్యామిలీ. అందుకని అమ్మ భయపడింది. అంతమందిలో నేను ఇమడగలుగుతానా లేదా అని భయం. కానీ కృష్ణంరాజుగారు నాతో 'ఎవరో ఏదో అంటారని నువ్వు భయపడొద్దు. ఏ పని చేసినా చక్కగా చెయ్' అని బాగా ధైర్యం ఇచ్చారు.

- **మరి.. పెళ్లి చూపుల గురించి?**

**శ్యామల:** వాళ్ల కజిన్‌ని పంపించారు. అమ్మాయిని బలవంతంగా ఒప్పించి, పెళ్లి చేస్తున్నారా? ఇష్టపడే చేసుకుంటుందా? అడిగి తెలుసుకోమన్నారు. 'నాకిష్టం' అని చెప్పాను. ఆయన కజిన్ వచ్చేసరికి మా ఇంటి చుట్టుపక్కల పిల్లలతో ఆడుకుంటున్నాను. 'నేను వెళ్లేసరికి వదినగారు పిల్లలతో ఆడుకుంటున్నారు' అని ఆయన చెబితే, 'అయితే ఓకే.. మనస్తత్వం కూడా పిల్లల్లానే ఉంటుంది. మంచిదే' అని నా ఫొటో చూసి, ఓకే చేశారు.

- **కృష్ణంరాజుగారి మొదటి భార్య చనిపోయాక మిమ్మల్ని పెళ్లి చేసుకున్నారు... బాగా చూసుకుంటారో లేదోననే డౌట్ ఏమైనా ఉండేదా?**

**శ్యామల:** అస్సలు లేదు. ఆయన మంచితనం గురించి ముందే మాకు తెలుసు. ఆ కుటుంబానికి ఎంతో మంచి పేరుంది. అయితే పెద్ద ఫ్యామిలీలో ఇమడగలనా? అనే భయం అమ్మకి ఉండేది. కానీ నేను వచ్చిన కొన్నాళ్లకే అందరికీ దగ్గరయ్యాను.

- **ఇంట్లో ఎవరి మాట నెగ్గుతుంది?**

**కృష్ణంరాజు:** బేసిక్‌గా నా అభిప్రాయాలను వేరే వాళ్ల మీద రుద్దడం నాకు ఇష్టం ఉండదు. వారి అభిప్రాయాలను తెలుసుకుని, అందుకు తగ్గట్టుగా నడుచుకుంటాను. ఒకరి అభిప్రాయానికి విలువ ఇవ్వకపోతే అండర్‌స్టాండింగ్ ఉండదు. తన విషయంలోనే కాదు.. నా పిల్లల విషయంలోనూ నేను అంతే చేస్తాను. ముందు వాళ్లేమనుకుంటున్నారో వింటాను. ఒక్కరి మాటే నెగ్గాలనుకోం. పిల్లలను నమ్మాలి. వాళ్లు ఎక్కడికెళ్లినా ప్రశ్నలు అడగడం, ఇంటికొచ్చాక ఎక్కడికెళ్లావని అడుగుతుండడం వల్ల ఎలాగూ అమ్మానాన్న మనల్ని నమ్మడం లేదు.. చేస్తే ఏం పోతుందిలే అన్నట్లుగా పిల్లల మనస్తత్వం మారుతుంది. ఆ స్కోప్ ఇవ్వకూడదు.

**శ్యామల:** మనం నమ్మితే పిల్లలు ఆ నమ్మకాన్ని నిలబెడతారన్నది మా ఇద్దరి అభిప్రాయం.

**కృష్ణంరాజు:** 'జీన్స్' అంటారు కదా.. అది నిజమే. ఆ ఫ్యామిలీ తాలూకు జీన్స్ పిల్లలకు కచ్చితంగా వస్తాయి. నా చిన్నప్పుడు మా నాన్నగారికి ఆరోగ్యం బాగా లేకపోతే నన్ను పిలిచి 'మన కుటుంబం ఇలాంటిది. మన పూర్వీకులు ఇలాంటి వారు' అని చెబితే, నా మనసులో నాటుకుపోయింది. మా నాన్నగారు ఎన్నో వందల కుటుంబాలను ఆదుకున్నారు. ఓసారి వరద వస్తే.. ఆ ఊరి చుట్టూ గట్టు కట్టించారు. వరద నీళ్లు ఇళ్లల్లోకి వస్తే.. ఆ ఊళ్లో ఉన్నవాళ్లను మా ఇంట్లోనే ఉండమని, వాళ్లకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. ఏప్రిల్, మేలో కొంతమందికి పనులు ఉండేవి కాదు. వాళ్లకు బస్తాలు బస్తాలు బియ్యం ఇచ్చేవారు. పని చెప్పాలి కదా అని ఏదో పని చెప్పేవారు. అయితే ఎంతమందికి చెబుతారు. అందుకని పని చెప్పలేని వాళ్లకు కూడా సహాయం చేసేవారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ఆదుకున్నారు. అవన్నీ తెలిసిన వ్యక్తిగా నాకూ సహాయం చేయడం అలవాటైంది. అలాగే కుటుంబ పరువుకి నష్టం కలగకూడదనేది డెవలప్ అయింది. అప్పుడు మా నాన్నగారు నాకు చెప్పినట్లుగా ఇప్పుడు నేను నా పిల్లలకు చెబుతుంటాను. అలాగే మా నాన్నగారికి ఉన్న సహాయ గుణం నాకు వచ్చినట్లుగా నా పిల్లలకూ వచ్చింది. 'కుటుంబ గౌరవం' అనే విషయాన్ని నా పిల్లలు కూడా తెలుసుకున్నారు.

- **మీకు ముగ్గురు ఆడపిల్లలు... చదువుల విషయంలో, ఇతర వ్యక్తిగత విషయాల్లో వాళ్లకు మీరు ఇస్తున్న గైడెన్స్ గురించి?**

**కృష్ణంరాజు:** మా అమ్మాయిలు ఎప్పుడైనా డౌన్ అయితే 'యు ఆర్ కృష్ణంరాజుస్ డాటర్.. యు ఆర్ గ్రేట్. డోంట్ వర్రీ. భయపడొద్దు. మీ గురించి ఎవరో ఏదో చెబుతారని అనుకోవద్దు. నేను నమ్మను' అని చెబుతుంటాను. అలా నమ్మి పెంచడంవల్ల ముగ్గురూ చదువులో బెస్ట్. మా పెద్దమ్మాయి సాయిప్రసీద లండన్‌లో మెరిట్ మీద ఎంబీఏ సీట్ సంపాదించుకుంది. ఇప్పుడు ప్రొడక్షన్ వైపు రావాలనుకుంటోంది. ప్రస్తుతం లాస్ ఏంజెల్స్‌లో ప్రొడక్షన్ కోర్స్ చేస్తోంది. చిన్న పాప సాయి ప్రకీర్తి ఆర్కిటెక్చర్ చదువుతోంది. మంచి పర్సంటేజ్ రావడంతో జేఎన్‌టీయులో సీట్ వచ్చింది. ఇంకో దాంట్లో కూడా వచ్చింది. తను బొమ్మలు బాగా గీస్తుంది. వాళ్ల ప్రభాస్ అన్నయ్య బర్త్‌డేకి బొమ్మ గీసి ఇస్తుంది. మూడోపాప సైకాలజీ చదువుతానంది. సరే.. మూడు నాలుగు లక్షలు డొనేషన్ కడతా అన్నాను. ఒకరోజు వచ్చి 'నా మూడు లక్షలు నాకు ఇవ్వండి' అంది. ఏంటని అడిగితే 'నాకు మేనేజ్‌మెంట్ కోటా అక్కర్లేదు.. ఇదిగో నేను మంచి పర్సంటేజ్ తెచ్చుకున్నాను. సీట్ నేనే తెచ్చుకుంటా. డొనేషన్ కట్టాలనుకున్న డబ్బు నాకివ్వండి' అంది. తండ్రి పేరుని వాడుకోవడం తప్పు కాదు. అయితే వాళ్లంతట వాళ్లు సీట్ సంపాదించుకోవాలనుకున్నారు. నటుడిగా నేను చాలా గొప్పవాడిని అయ్యుండొచ్చు. కానీ వ్యక్తిగా కూడా నాకు చెడ్డ పేరు లేదనే అనుకుంటాను. గౌరవంగా బతకాలన్నది నా అభిప్రాయం. పిల్లలు కూడా అదే అనుకుంటారు.

- **పిల్లలు ఇంత చక్కగా పెరగడంలో ఎవరి పాత్ర ఎక్కువ ఉంది?**

**కృష్ణంరాజు:** తన పాత్రే ఎక్కువ ఉంటుంది. నిద్ర లేచిన దగ్గర్నుంచి వాళ్లకి ఏం కావాలి? ఇంట్లో ఎలాంటి వాతావరణం ఉంటే చదువుకోగలుగుతారు? ఇలా అన్నీ తనకు తెలుసు. తనకి నాతో కలిపి మొత్తం నలుగురు పిల్లలు.

- **మరి.. ముగ్గురు అమ్మాయిలను పెంచడం కష్టంగా ఉందా? బాబునా?**

**శ్యామల:** (నవ్వుతూ).. నాకు ఈయన్ని పెంచడమే చాలా ఇష్టం. కంటికి రెప్పలా చూసుకుంటాను. పిల్లలు పుట్టాక చాలామంది భర్త మీద ప్రేమ తగ్గిందని, శ్రద్ధ తగ్గిందని అంటారు. కానీ నాకు మాత్రం ముందు ఆయనే. ఆయన్ను చూసుకుంటూ పిల్లల్ని కూడా బ్యాలెన్స్ చేసుకుంటాను. పిల్లల సెలవులప్పుడే నేను గుడికి వెళుతుంటాను. ఆ సమయంలో వాళ్ల నాన్న దగ్గర పిల్లల్ని పెట్టి నేను పూజలకు వెళతాను. ఒంటరిగా ఆయన్ను వదిలి ఎక్కడికీ వెళ్లను.

- **మీ పుట్టింటికి కూడా వెళ్లలేదా? మీ అత్తింటి వాళ్లు మిమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకున్నారు?**

**శ్యామల:** వెళ్లాలన్నా ఆ టైమ్‌కి ఎవరైనా ఆయన దగ్గర ఉంటేనే వెళతాను. అది కూడా ఒకటీ రెండు రోజులు మాత్రమే. మా పెళ్లికిముందు మా మామయ్యగారికి నేను కలలో కనిపించానట. ఆ అమ్మాయే మన ఇంటికి కోడలిగా వస్తుందని అన్నారట. నేను అత్తింటికి రాగానే 'నాకు కలలో కనిపించిన అమ్మాయి తనే. నా కొడుకుని బాగా చూస్తుందనే నమ్మకం నాకు ఉంది' అన్నారు. అత్తింట్లో ప్రేమకు లోటు లేదు. కృష్ణంరాజుగారికి అందరి ఆకలి తెలుసు కానీ ఆయన ఆకలి ఆయనకు తెలియదు. ఆ విషయంలో అత్తింట్లో వాళ్లకి భార్య ఎలా చూస్తుందో అని కాస్త టెన్షన్ ఉండేది. కానీ నేను వచ్చి, చూసుకోవడం మొదలుపెట్టాక ఆ టెన్షన్ పోయింది.

*(మధ్యలో కృష్ణంరాజు అందుకుంటూ)*.. మా అమ్మ అయితే చాలా టెన్షన్ పడేది. ఆకలైనా చెప్పేవాడిని కాదు. నీరసం వచ్చి అలా నిద్రపోయేవాడిని. అందుకని వాడు అడగడు.. మనమే పెట్టాలని పెట్టేది. ఇప్పుడు ఈవిడ అలానే పెడుతుంది.

- **మరి.. షూటింగ్‌కి వెళ్లినప్పుడు ఎలా?**

**శ్యామల:** ఆయన కోసం పని చేసేవాళ్లను కూడా ట్రైన్‌చేసి పెట్టాను. 'సార్ అడగరు.. మధ్యలో మీరే అడుగుతూ ఉండండి' అని చెప్పాను. వాళ్లు కూడా అలానే చేస్తారు.

- **కృష్ణంరాజుగారు భోజనప్రియుడు.. మీరు చేసే వంటల్లో ఆయనకు బాగా నచ్చినవి?**

**శ్యామల:** అన్నీ ఇష్టమే. ముఖ్యంగా నాన్‌వెజ్ అంటే చాలా ఇష్టం. అయితే ఇంతకుముందుకన్నా ఇప్పుడు తక్కువ తింటున్నారు. ఈ మధ్య ఎవరో 'ఏంటి సార్.. మరీ తక్కువ తింటున్నారు?' అని అడిగితే 'మేం ఏడుజన్మలకు సరిపడా తినేశాం' అన్నారు (నవ్వులు). ఆయనకు పెసరట్టు అంటే ఇష్టం. వాళ్ల పెద్దక్కగారు బాగా చేసేవారు. ఆవిడ దగ్గర్నుంచి ఆయన నేర్చుకుని, నాకు నేర్పించారు. ఆయన చేపల కూర కూడా బాగా వండుతారు.

- **మీరు వంట ఎలా నేర్చుకున్నారు?**

**కృష్ణంరాజు:** నేను వేటకు వెళ్లేవాడిని. పచ్చ పావురాలు అని ఉండేవి. చాలా రుచిగా ఉంటాయి. పొద్దున్నే అవి వేటాడి తీసుకు వస్తే.. అక్కడే అడవిలో వండి పెట్టేవాళ్లు. కొండ గొర్రె అంటారు. అది కూడా బాగుంటుంది. లంచ్‌కి కొండ గొర్రె. ఒక్కోసారి పులి గాండ్రింపులు వినపడినప్పుడు వంట చేసేవాళ్లు భయపడి పారిపోయేవాళ్లు. అప్పుడు నేనే వంట చేసేవాడిని. అయితే నాకు అన్నం వార్చడం వచ్చేది కాదు. రెండు మూడు సార్లు చేతులు కాల్చుకున్నాను కూడా. రామారావుగారు నిషేధం విధించాక వేట మానేశాను.

- **ఎప్పుడైనా పులిని వేటాడారా?**

**కృష్ణంరాజు:** లేదు. అయితే నా వెనకాల నుంచి ఒక్క పరుగుతో ముందుకు వెళ్లింది. పులి మహా పిరికి. తననెవరైనా ఎటాక్ చేస్తారనే అనుమానం కలిగితేనే అది ఎటాక్ చేస్తుంది. లేకపోతే చేయదు.

శ్యామల: మీకు ఓ పులి ఫ్యాన్ కదా..

**కృష్ణంరాజు:** అవును. ఒక పులి ఉండేది. 'కటకటాల రుద్రయ్య' కోసం ఆ పులిని తీసుకొచ్చారు. అది గాండ్రించడం మొదలుపెట్టింది. నేను దాని మెడ దగ్గర మెల్లిగా అలా నిమురుతూ మచ్చిక చేసుకున్నాను. ఆ పులితో నాకు ఫైట్‌సీన్ ప్లాన్ చేశారు. అంతకుముందు నేను దాని మెడ పట్టుకుంటే విసిరి కొట్టింది. అంతదూరం పడ్డాను. అయితే మచ్చిక చేసుకున్న తర్వాత ఫ్రెండ్లీ అయిపోయింది. నేను దాని మెడ పట్టుకుంటే అది అలా చూస్తూ ఉండిపోయింది. చివరికి మేమే అది ఫైట్ చేసినట్లు మ్యానిపులేట్ చేశాం (నవ్వుతూ). అదే పులిని ఏడాది తర్వాత వేరే సినిమా కోసం తీసుకొస్తే.. నన్ను గుర్తుపట్టేసి, ఫ్రెండ్లీ అయిపోయింది. లాభం లేదని దాన్ని పంపించేసి, వేరే పులిని తీసుకొచ్చి, ఫైట్ సీన్ తీశాం.

- **మీ విషయాలు వింటుంటే భలే ఉంది... ఫైనల్లీ హ్యాపీ మ్యారేజ్ లైఫ్‌కి కొన్ని టిప్స్?**

**ఇద్దరూ:** ఇప్పుడు ఆడపిల్లలు, మగపిల్లలు కలిసి చదువుకుంటున్నారు. ఫ్రెండ్లీగా ఉంటున్నారు. అయితే పెళ్లయ్యాక కొంతమంది మగపిల్లలు మారిపోతున్నారు. ఆంక్షలు పెడుతున్నారు. ఫ్రెండ్లీనెస్ పోతోంది. అది తప్పు. అది తెలుసుకోలేక గొడవలు పడి విడిపోతున్నారు. అలాగే ఇప్పుడు ఇద్దరూ సంపాదించుకుంటున్నారు కాబట్టి కొన్ని జంటలు 'నువ్వెంత అంటే నువ్వెంత' అంటున్నట్లు ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య ఆ పోటీ తప్పు. ఇద్దరూ సమానం అనుకోవాలి.

అలాగే 'ఈగో' సమస్యలు ఒకటి. కొంచెం మనసు పెట్టి ఆలోచించి, చిన్న చిన్న విషయాలను పెద్దవి చేసుకోకుండా ఉంటే కాపురం హాయిగా ఉంటుంది.

**– డి.జి. భవాని**

- **మీ ఇంటి నుంచి వేరే సెలబ్రిటీల ఇంటికి క్యారేజ్‌లు వెళుతుంటాయట కదా?**

**శ్యామల:** వెళుతుంటాయి. వస్తుంటాయి కూడా. కృష్ణంరాజుగారి కోసం షూటింగ్ లొకేషన్‌కి భోజనం తీసుకెళ్లేదాన్ని, మొత్తం యూనిట్‌కి సరిపడా పట్టుకెళ్లేదాన్ని. చిరంజీవిగారి ఇంట్లో దోసెలు బాగుంటాయి. ఆ మధ్య చిరంజీవిగారిని కలిసినప్పుడు ఆ మాట అంటే.. 'అన్నయ్యా.. నువ్వు బ్రేక్‌ఫాస్ట్ ఎన్నింటికి చేస్తావో చెప్పు.. ' అని అడిగి, ఒక ఆదివారం దోసెలు, రెండు రకాల చట్నీలు పంపించారు. ఎంజాయ్ చేస్తూ తిన్నాం. సురేఖ (చిరంజీవి సతీమణి) గారు అంత బాగా చేస్తారు. మా ఇంట్లో బిర్యానీ చేసి, ఆవిడ పంపిన క్యారియర్‌లో పెట్టి పంపించాం. చిరంజీవిగారు మధ్యాహ్నం తిని, సాయంత్రం కూడా తింటానని ఉంచమన్నారట. ఆ మధ్య మోహన్‌బాబుగారింట్లో జరిగిన పార్టీకి వెళ్లినప్పుడు చిరంజీవిగారు ఆ విషయం చెప్పారు.

- **ప్రభాస్ గురించి?**

**శ్యామల:** మా ఆయన్ను 'పెద్ద బాజీ' అని బాబు పిలుస్తాడు. నన్ను 'కన్నమ్మా' అని పిలుస్తాడు. ప్రభాస్ మాకు కొడుకే. ఇప్పుడు మా ప్రభాస్ ఏమంటాడంటే.. 'ఇన్నేళ్లు కష్టపడ్డారు. ఇప్పుడు మీరు సుఖపడాలి. మిమ్మల్ని మేం హ్యాపీగా చూడాలి' అని వాళ్ల పెదనాన్నతో అంటాడు. పెదనాన్న అంటే.. ఆయనకు సుప్రీమ్ అన్నమాట. అంత ప్రేమ. చెల్లెళ్లతో కూడా చాలా ప్రేమగా ఉంటాడు.



పిల్లలు సాయి ప్రసీద, సాయి ప్రదీప్తి, సాయి ప్రకీర్తిలతో కృష్ణంరాజు దంపతులు

## ● ముగ్గు-ముచ్చట



17 చుక్కలు
17 వరుసలు



శ్రావణి కోలా,
రామంతాపూర్,
హైదరాబాద్



**ముగ్గులకు ఆహ్వానం**

**ముగ్గులు పంపవలసిన చిరునామా:**
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. muggulu.sakshi@gmail.com

## తిరుప్పావై 7వ పాశురం

**కీశు కీశెన్రెంగుం ఆనైచ్చాత్తన్ కలందు**
**పేశిన పేచ్చరవం కేట్టిలైయో పేట్టి ప్పెణ్ణే**
**కాశుమ్ పిఱప్పుం కలకలప్ప క్కై పేర్ త్తు**
**వాశ నఱుమ్ కుళల్ ఆయిచ్చియర్ మత్తినాల్**
**ఓ శైపడుత్త తయిర్ అరవం కేట్టిలైయో**
**నాయగ ప్పెణ్ పిళ్ళాయ్! నారాయణన్ మూర్ త్తి**
**కేశవనై ప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో**
**తేశం ఉడైయాయ్! తిఱవేలోర్ ఎమ్బావాయ్.**



బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్

ఈ 7వ పాశురంలో ఆండాళ్ మేల్కొల్పే గోపిక కృష్ణభక్తురాలు.

అదుగో, భరద్వాజ పక్షులు చేసే కిలకిలారావాలు నీ చెవిని పడలేదా? నీ శయనమందిరం బయట అవి చేసే ధ్వనులకు నీ నిద్ర చెదరటం లేదా? తెల్లవారుతున్నది. జ్ఞానం లేని పక్షులే ప్రకృతిధర్మానికి లోబడి లేచి, నలుదిక్కులకు ఆహారం కోసం బయలుదేరుతుంటే వ్రతదీక్షాపరురాలివైన నువ్వు ఇంకా మేల్కొనలేదెందుకు? అర్చకస్వాములు విష్ణ్వాలయంలో గరుడవాహనుని సేవకు భక్తులను రారమ్మని తెల్లని శంఖం పూరించి పిలుపునిస్తున్నారు. ఓ తేజస్వినీ, ఎల్లెడలా ప్రతిధ్వనిస్తున్న, సుపరిచితమైన ఆ మహా మహిమాన్విత ధ్వనియైనా నీకు వినబడుట లేదేమి? గొల్లస్త్రీలు తెలతెలవారక మునుపే పెరుగు చిలికేటప్పుడు వారి గొలుసులు, గాజులు కవ్వపు శబ్దంతో కలిసి చేసే ధ్వనులు కూడా వినబడటం లేదా, నీ చెవులకు మూతలున్నాయి కాబోలు. గొల్లస్త్రీలు ధరించిన పూలదండల పరిమళాలు కూడా నీ ముక్కును స్పృశించటం లేదా? కేశి అనే రాక్షసుడిని వధించిన కేశవుడికి మేము పాడుతున్న మేల్కొల్పులు నీకు వినబడటం లేదా? మాతో కలిసి భగవానుని మహిమలను కొనియాడుదువు, పిచ్చిపిల్లా నీ నిద్ర చాలించి తలుపు తియ్యవమ్మా!

''తలుపుతో పాటు నీ హృదయకవాటాలు కూడా తెరిస్తే నీ ఆత్మ జాగృత మౌతుంది'' అంటుంది ఆండాళ్.

**–శ్రీదేవి మురళీధర్**




# సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
ఆదివారం
22-12-2019

# తీర్థ యాత్రలు


● నయనతార
● విఘ్నేశ్ శివన్‌తో నయనతార

వీలు కుదిరితే విహారయాత్రలకు వెళ్తుంటారు కోలీవుడ్ ప్రేమజంట నయనతార, విఘ్నేష్ శివన్. అయితే ఈసారి తీర్థయాత్రలపై దృష్టిపెట్టినట్టు కనిపిస్తోంది. ఈ మధ్యనే తిరుచెందూర్‌లో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, కన్యాకుమారిలో భగవతి అమ్మన్ దేవాలయాలను జంటగా సందర్శించారు. తాజాగా కన్యాకుమారిలోని స్వామి తొప్పు అయ్యవాళి దేవాలయం, సుచింద్రంలోని స్థనుమాలం ఆలయాన్ని సందర్శించారు. ఇలా వరుసగా దేవాలయాలను సందర్శించడం వెనక కారణం ఏంటి? అంటే... ప్రస్తుతం నయనతార 'మూకుత్తి అమ్మన్' (ముక్కుపుడక అమ్మవారు) అనే భక్తి చిత్రం చేస్తున్నారు. ఇందులో నయనతార అమ్మవారి పాత్ర చేస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యేవరకూ శాకాహారిగా మారారు. ఈ సినిమా కోసమే ఈ సందర్శనాలు అని భోగట్టా. ఈ ఇద్దరి పెళ్లికి సంబంధించిన మొక్కుబడులా? అనే టాక్ కూడా ఉంది. ఈ ఏడాది చివర్లో లేదా వచ్చే ఏడాది ప్రారంభంలో వీరు వివాహం చేసుకోబోతున్నారనేది మరో వార్త.

# లక్కీవాలా


● రవితేజ
నభా నటేశ్

రవితేజ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'డిస్కోరాజా'. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, నభా నటేష్, తాన్యా హోప్ కథానాయికలుగా నటించారు. రామ్‌తాళ్లూరి నిర్మించారు. ఈ సినిమాలోని ''ఢిల్లీవాలా.. ఢిల్లీ వాలా...హ్యాపీ గో లక్కీవాలా' అనే పాటను శనివారం విడుదల చేశారు. ప్రముఖ గీత రచయిత రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను ఆదిత్య అయ్యంగార్, గీతా మాధురి, రాహుల్ నంబియార్ పాడారు. ఈ సినిమాకు తమన్ సంగీతం అందించారు. ఇది హీరో ఇంట్రడక్షన్ సాంగ్ అని చిత్రబృందం పేర్కొంది. సైంటిఫిక్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ చిత్రంలో బాబీ సింహా, 'వెన్నెల' కిశోర్, సత్య కీలక పాత్రలు పోషించారు. 'డిస్కోరాజా' చిత్రం జనవరి 24న విడుదల కానుంది.

# పర్‌ఫెక్ట్ బర్త్ డే గిఫ్ట్

మహేశ్‌బాబు హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. ఇందులో రష్మికా మందన్నా కథానాయికగా నటించారు. ఈ సినిమాలో తమన్నా ఓ ప్రత్యేక పాటకు డ్యాన్స్ చేశారు. శనివారం (డిసెంబరు 21) తమన్నా పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఈ పాటలోని ఆమె లుక్‌ను విడుదల చేశారు. ఈ లుక్‌ని ఉద్దేశించి 'పర్‌ఫెక్ట్ బర్త్‌డే గిఫ్ట్' అని తమన్నా పేర్కొన్నారు. ఈ చిత్రం జనవరి 11న విడుదల కానుంది.


● తమన్నా

# ఆ ముద్ర పడకుండా చూసుకుంటున్నా


● మారుతి

''సీరియస్ విషయాన్ని కూడా ఎక్కువ సీరియస్‌గా తీసుకోను నేను. అది నా మనస్తత్వం. ఏదైనా విషయం చెప్పాలన్నా ఎంటర్‌టైనింగ్‌గానే చెబుతాను. నా సినిమాలో కథలను కూడా అలానే చెప్పాలనుకుంటాను'' అన్నారు దర్శకుడు మారుతి. ఆయన దర్శకత్వంలో సాయితేజ్, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'ప్రతిరోజూ పండగే'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాస్ నిర్మించారు. గత శుక్రవారం ఈ చిత్రం విడుదలయింది. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి పంచుకున్న విశేషాలు.

- 'ప్రతిరోజూ పండగే' కథను ఎవరికి చెప్పినా బావుంది అన్నారు. 65 రోజుల్లో సినిమాను పూర్తి చేశాం. సినిమా రిలీజ్ ముందు కూడా పెద్ద టెన్షన్ పడలేదు. ఎందుకంటే.. ఎమోషన్స్‌తో ఓ కథను సరిగ్గా చెప్పగలిగితే ఆడియన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. మా సినిమాతో అది మళ్లీ నిరూపితం అయింది.
- థియేటర్స్‌లో ఆడియన్స్ బాగా ఎంజాయ్ చేస్తున్నారు. ఎమోషన్ కంటే కామెడీ టైమింగ్ ఏమైనా డామినేట్ అయిందా? అనే డౌట్ వచ్చింది. 'భలే భలే మగాడివోయ్' సినిమా తర్వాత ఇన్ని ఫోన్ కాల్స్ రావడం ఇదే. 'చాలా హెల్దీగా చేశావు' అని చిరంజీవిగారు అభినందించారు. 'చాలా బాగా డీల్ చేశావు' అని రాఘవేంద్రరావుగారు అన్నారు. ఇండస్ట్రీ నుంచి చాలా కాల్స్ వస్తున్నాయి.
- రావు రమేశ్‌గారు పాత్ర బాగా వచ్చింది అని అందరూ అంటున్నారు. ఆయన యాక్ట్ చేస్తుంటే మేమందరం ఎగ్జయిట్ అయ్యాం.
- మారుతి ఒక జానర్ సినిమాలే తీయగలడు అని ముద్ర వేయించుకోవడం నాకు ఇష్టం లేదు. అందుకే సినిమా సినిమాకు జానర్ మారుస్తుంటాను. ఒకేలాంటి సినిమాలు తీస్తే నాకు నేనే బోర్ కొట్టేస్తాను.
- ప్రస్తుతం ట్రెండ్ మారిపోయింది. బెస్ట్ కథలే ఇవ్వాలి. వెబ్ సిరీస్‌లు కూడా వస్తున్నాయి. అవే ఫ్యూచర్. నేనూ వెబ్ సిరీస్ చేస్తాను. నెట్‌ఫ్లిక్స్ 'లస్ట్ స్టోరీస్'కి అడిగారు. కానీ కుదర్లేదు.


● శివలెంక కృష్ణప్రసాద్, సతీష్ వేగేశ్న, మెహరీన్, కళ్యాణ్‌రామ్, ఉమేశ్ గుప్తా

# కళ్యాణ్‌రామ్‌కి సరిపోయే టైటిల్ ఇది

**- సతీష్ వేగేశ్న**

''మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అని కార్ల్ మార్క్స్ అన్నాడు. కానీ మానవ సంబంధాలు హార్దిక సంబంధాలుగా ఉండాలి'' అని దర్శకుడు సతీష్ వేగేశ్న అన్నారు. కళ్యాణ్‌రామ్, మెహరీన్ జంటగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎంత మంచివాడవురా'. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఆదిత్యా మ్యూజిక్ అధినేత ఉమేష్ గుప్తా నిర్మించారు. జనవరి 15న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో కళ్యాణ్‌రామ్ మాట్లాడుతూ – ''ఎంత మంచి వాడవురా' నా మనసుకి దగ్గరైన సినిమా. జనవరి మొదటివారంలో ప్రీ–రిలీజ్ వేడుకను ఏర్పాటు చేస్తాం'' అన్నారు. ''సంక్రాంతి రైతుల పండగ. అలాగే సంక్రాంతి సినిమావాళ్ల పండగ కూడా. ప్రస్తుత పరిస్థితుల్లో మనుషుల మధ్య సత్సంబంధాలు తగ్గిపోతున్నాయి. వాటి గురించి ఈ సినిమాలో బాగా చర్చించారు దర్శకుడు. కళ్యాణ్‌రామ్ కెరీర్‌లో ఇది బెంచ్‌మార్క్ సినిమా అవుతుంది'' అన్నారు నరేశ్. ''ఈ టైటిల్ పెట్టగానే అందరూ బావుంది అన్నారు. ఇండస్ట్రీలో చాలా మంది 'కళ్యాణ్‌రామ్‌కి పర్ఫెక్ట్ టైటిల్' అన్నారు. ఆయన అందరితో చాలా బావుంటారు. నిర్మాతలు ఏది అడిగినా కాదనకుండా ఇచ్చారు. కళ్యాణ్‌రామ్‌గారి గత సినిమాలతో పోలిస్తే భిన్నంగా ఉంటుంది. ఈ సినిమా పాయింట్‌ను ఓ గుజరాతీ సినిమా నుంచి తీసుకున్నాం'' అన్నారు సతీష్ వేగేశ్న. ''సతీష్‌గారు కథ చెప్పగానే మాటలురాలేదు. ఈ కథ అందర్నీ కదిలిస్తుంది. ఈ సినిమా టీమ్ అందరూ మంచివాళ్లే'' అన్నారు మెహరీన్. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు గోపీసుందర్, శివలెంక కృష్ణప్రసాద్, ఉమేష్ గుప్తా, చిత్రబృందం పాల్గొన్నారు.

# ఇచ్చట వాహనములు నిలుపరాదు


● సుశాంత్

సుశాంత్ హీరోగా గత ఏడాది ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'చిలసౌ' చిత్రానికి మంచి ప్రేక్షకాదరణ దక్కింది. ఈ సినిమాను జాతీయ అవార్డు వరించింది. ఇక సుశాంత్ హీరోగా నటించనున్న తాజా చిత్రానికి 'ఇచ్చట వాహనములు నిలుపరాదు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఎస్. దర్శన్ దర్శకత్వంలో రవిశంకర్ శాస్త్రి, హరీష్ కోయిలగుండ్ల ఈ సినిమాను నిర్మించనున్నారు. ఈ సినిమా టైటిల్ పోస్టర్, మోషన్ పోస్టర్‌ను శనివారం విడుదల చేశారు. వచ్చే ఏడాది జనవరిలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.''వాస్తవ సంఘటనల ఆధారంగా సాగే రొమాంటిక్ థ్రిల్లర్ ఇది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.

# లేక్ వ్యూ ఫెస్టివల్‌కు జార్జిరెడ్డి


● సందీప్ మాధవ్

స్టూడెంట్ లీడర్ జార్జిరెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'జార్జిరెడ్డి'. సందీప్ మాధవ్ టైటిల్ రోల్లో, జీవన్‌రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని అప్పిరెడ్డి, సంజయ్‌రెడ్డి, దామోదర్ రెడ్డి నిర్మించారు. నవంబరు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తాజాగా 'జార్జిరెడ్డి' చిత్రం ఫోర్త్ లేక్ వ్యూ ఇంటర్‌నేషనల్ ఫిల్మ్‌ఫెస్టివల్‌కు ఎంపికైంది. ఈ నెల 22, 23 తేదీల్లో ఈ చిత్రాన్ని ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించనున్నారు. ఢిల్లీ, నోయిడాల్లో ఈ చిత్రం ప్రత్యేక పదర్శనలు జరుగనున్నాయి. ''చిన్న సినిమాగా విడుదలైన మా 'జార్జిరెడ్డి' ఇండస్ట్రీని బాగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఇంటర్‌నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ లెవల్‌కి వెళ్లడం చాలా సంతోషంగా ఉంది'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ వేడుకకు చిత్రయూనిట్ హాజరు కానుంది.












epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సన్నిధి
నల్లగొండ ॥ ఆదివారం
22-12-2019

సువార్త

# నిష్కల్మషమైన ప్రార్థనతోనే జీవన సాఫల్యం

ప్రార్థన అంటే, మన హృదయంలో నుండి పెల్లుబికే ఆత్మ ప్రేరేపిత భావజాలమే తప్ప మన పెదాలు పలికే పై పై మాటలు కాదని దావీదు చక్రవర్తి తన జీవితంలో తెలుసుకున్నాడు. ఒకప్పుడు నిస్సహాయత ఆవరించిన ప్రాణాపాయ స్థితుల్లో, తన శత్రువుల కుట్రలు, దాడులను ఎదుర్కోలేక అరణ్యాలు, అననుకూల పరిస్థితుల్లో దావీదు అజ్ఞాతంగా బతుకుతూ దేవునికి చేసిన ఆర్తనాదాలతో కూడిన ఎన్నో ప్రార్థనలు బైబిల్‌లోని కీర్తన గ్రంథంలో విశ్వాసులకు అందుబాటులో ఉన్నాయి. అయితే దేవునిలో ఎదిగిన తర్వాత దావీదు 'నాకు కలిగిన శ్రమలు, నీ కట్టడలు నాకు నేర్పి, నాకు మేలు చేశాయి' అన్నాడు (కీర్తనలు 119:71). మొత్తం 176 వచనాలున్న అత్యంత సుదీర్ఘమైన 119వ కీర్తన దావీదే రాశాడని పండితులు భావిస్తారు. విశ్వాసి హృదయంలో నుండి పొంగే ఎంతో సున్నితమైన, ఉదాత్తమైన ఆలోచనాసరళితో కూడిన స్వచ్ఛమైన భావాల పరవళ్లు ఈ కీర్తనలో కనిపిస్తాయి. అందులోని పదాలు, దావీదు ప్రార్థన అనే మహా కట్టడంలో అద్భుతంగా అమరిన అందమైన రాళ్లు!! ఉపవాసం శరీరాన్ని నియంత్రించి అందలి ఆత్మను ప్రజ్వరిల్ల చేస్తే, శ్రమలు విశ్వాసి శరీరాన్ని క్రుంగదీసి, విశ్వాసి ఆత్మను దేవునితో నేరుగా అనుసంధానం చేసి, విశ్వాసి కోసం పరలోకాశీర్వాదాల ద్వారాల్ని తెరుస్తాయి. ఒకప్పటి గొర్రెల కాపరినైన తాను గొప్ప రాజప్రసాదంలో నివసిస్తుంటే, తన ఔన్నత్యానికి కారకుడైన దేవుని 'మందసం' ఒక గుడారంలో ఉండడమా? అన్న కృతజ్ఞతా భావనతో దేవునికి ఒక అద్భుతమైన ఇంటిని అంటే ఆరాధనా మందిరాన్ని కడదామనుకున్న దావీదు ఆలోచనకు దేవుడు సమ్మతి తెలుప లేదు. 'దిక్కు, దిశా లేకుండా అడవుల్లో తిరిగే నీకే ఒక ఇంటినిచ్చిన నాకోసం ఇంటిని అంటే మందిరాన్ని కట్టించే స్థాయి, స్థోమత నీకుందా?' అని దేవుడు ప్రశ్నిస్తే, దావీదు నిరుత్తరుడయ్యాడు. తర్వాత ఎంతో వినమ్రతతో దేవునికి మరింత చేరువై 'దావీదు నా హృదయానుసారుడైన మనుషుడు' అంటూ దేవుడే తనను మెచ్చుకునేలా తన జీవితాన్ని సరిదిద్దుకున్నాడు. ఆ పరిణతితోనే శ్రమలు, అవమానాలు, ఓటములు, నిందలు తనకు మేలు చేశాయంటూ దావీదు తన కీర్తనల్లో సూక్తీకరించాడు.



దేవుని కనికరాన్ని, న్యాయాన్ని, అనంతమైన ఆయన కృపను జీవితంలో అనుభవించి తెలుసుకున్న దావీదులో, దేవుడు తన హృదయస్పందనను అర్థం చేసుకునే మహా విశ్వాసిని కనుగొన్నాడు. అడవిలో ఒక సింహం, ఎలుగుబంటి దావీదు కాస్తున్న గొర్రెల మందపైన ఒకసారి దాడి చేశాయి. అయినా చాలా చిన్నవాడు, బలహీనుడైన దావీదు తెగించి వాటిని చంపి, అవి నోట కరుచుకొని వెళ్తున్న గొర్రెపిల్లను దావీదు రక్షించాడు. ఒక బలహీనమైన గొర్రెపిల్ల కోసం, సింహంతో, ఎలుగుబంటితో తలపడి తన ప్రాణాల మీదికి తెచ్చుకోవడం నిజానికి లోకం దృష్టిలో వెర్రితనమే కానీ అదే దేవుని న్యాయమన్నది దావీదుకు అప్పటికే అర్థమయ్యింది. పనికిమాలిన ఒక గొర్రె కోసం విలువైన నా ప్రాణాలు ఎందుకు పణంగా పెట్టాలి? దానివల్ల నాకేం లాభం? అని ఆలోచించేవాడు ఈ లోకంలో ఎంతో తెలివైనవాడు. అయితే దేవుని న్యాయాన్ని అర్థం చేసుకున్నవాళ్లకు మాత్రమే బలహీనుల పక్షంగా పోరాడటంలోని ఆశీర్వాదాలు అర్థమవుతాయి. పాపిని శిక్షించాల్సిందే, చంపాల్సిందే అన్న లోకన్యాయాన్ని కాదని, బలహీనుడైన పాపిని రక్షించి, సంస్కరించి, అతనికొక వినూత్న జీవితాన్ని ప్రసాదించి, అతన్ని లోక కల్యాణం కోసం వాడుకోవాలన్న దేవుని న్యాయసంవిధానంలో భాగంగానే, ఆయన అద్వితీయ కుమారుడైన యేసుక్రీస్తు ఈ లోకానికి పాపుల రక్షకుడుగా, ఆనాడు దావీదు పుట్టిన బెత్లెహేములోనే, దావీదు తర్వాత దాదాపు 28 తరాలకు జన్మించిన శుభదినమే క్రిస్మస్!! అలా తానెదుర్కొన్న శ్రమలన్నీ దావీదుకు నిజంగానే గొప్ప మేలు చేశాయి. ఎందుకంటే ఏ దేవుని న్యాయం కోసమైతే దావీదు తన జీవితాన్ని ధారపోశాడో, ఆ దేవుని అద్వితీయ కుమారుడైన యేసే, దేవుని న్యాయానికి ప్రతిరూపంగా ఆ దావీదు వంశంలోనే, దావీదు స్వస్థలమైన బెత్లెహేములోనే జన్మించాడు. అలా దేవుని లాగే, బలహీనుల పక్షపాతిగా జీవించిన దావీదుకు 'జీవన సాఫల్యం' రూపంలో గొప్ప మేలు జరిగింది.

**- రెవ.డా.టి.ఎ. ప్రభుకిరణ్**

స్త్రీ వైశిష్ట్యం-21

# అమ్మ.. బ్రహ్మ





బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

అమ్మ పరబ్రహ్మం. వేదం అందుకే 'మాతృదేవోభవ' అంటూ మొదటి నమస్కారం అమ్మకే చేయించింది. అమ్మ పరబ్రహ్మమైనట్లుగా తండ్రిని పరబ్రహ్మంగా చెప్పడం చాలా కష్టం. నమశ్శంకరాయచ..అంది యజుర్వేదం. అన్నివేళలా బిడ్డల సుఖం కోసం ఆరాటపడతాడు కనుక ఈ భూమిమీద తిరుగాడుతున్న శివ స్వరూపం తండ్రి. అంతవరకే. కానీ తల్లి పరబ్రహ్మ స్వరూపం. బిడ్డ పుట్టడానికి తల్లి తన గర్భాన్ని గర్భాలయం చేస్తుంది. ఇంగ్లీష్ లో ఒక సామెత ఉంది. From womb to tomb, she is the most innocent lamb..అని. తల్లి కడుపు దగ్గరి నుంచి సమాధి వరకు ఆమె స్పర్శ లేకుండా అసలు జీవనం సాగదు. అంత రాశీభూతమైన అమాయకత్వం. ఏ ప్రతిఫలాన్ని కోరదు. అమ్మ దగ్గర పిల్లలు సేదదీరినట్లుగా లోకంలో మరెక్కడా సేదదీరలేరు. అందుకే శంకరాచార్యులంతటివాడు అయ్యవారి స్తోత్రం చేస్తూ 'శివానంద లహరి' అని, అమ్మవారి దగ్గరకు వచ్చేసరికి 'సౌందర్యలహరి' అన్నారు తప్ప 'అంబానంద లహరి' అనలేదు.

సౌందర్యం.. అన్నమాటకు అర్థం బాహ్యంలో శరీరంలో ప్రకాశించే అందం కాదు. అది ఈవేళ ఉంటుంది. ఒక దుర్ఘటన జరిగితే పోతుంది. అందుకే –''మా కురు ధన జన యవ్వన గర్వం హరతి నిమేషాత్కాలః సర్వం మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా'' అని అంటారు శంకర భగవత్పాదులు. అమ్మది అందం కాదు...సౌందర్యం. అది ఎంత వయసొచ్చినా పెరుగుతుంది తప్ప తరిగేది కాదు. అమ్మ కడుపులో ఉండగా నాభీ బంధం. అమ్మ తాను తిన్న అన్నసారాన్ని నాభిద్వారా బిడ్డకు అందిస్తుంది. కడుపులోంచి బిడ్డ బయటకు వచ్చిన తరువాత నాభి కోస్తారేమో కానీ హృదయబంధం అలాగే నిలబడిపోతుంది. ఈమె నా తల్లి. వీడు నా బిడ్డడు. ఆ సంబంధం పోదు. చిట్టచివరకు ప్రాణ, అపాన, ఉదాన, వ్యాన, సమాన, నాగ, కుర్మ, క్రౌకార, ధనంజయ, దేవదత్తములనబడే పది వాయువులలో వ్యాన వాయువు శిథిలమైన ఆస్తిమీద యాజమాన్యపు హక్కు పెట్టుకున్నట్లు శరీరాన్ని ఆశ్రయించి ఉండిపోతుంది...అంటే ఏదో పాడుపడిపోయిన ఒక భవనం ఉంది. దాన్ని ఎవరయినా ఛటుక్కున అమ్మేస్తారేమోనని ఇది ఫలానా వారికి చెందినది అని అక్కడ ఒక ఫలకం పెట్టినట్లు... శరీరంలోంచి జీవుడు వెళ్లిపోయినా ఈ శరీరం నాది అని ఒక అభిమాన దేవత ఉండిపోతుంది. అదెప్పుడు పోతుందో తెలుసా... కడుపున పుట్టిన కొడుకు శ్మశానంలో ఆనంద హోమం చేసి ''పిచ్చి అమ్మా! ఈ శరీరం జర్జరీభూతం అయిపోయింది, ముసలిది అయిపోయిందమ్మా ... ఎందుకూ సహకరించదు. దానిలో ఎందుకుంటావ్... మా మీద మమకారంతో కదూ... అమ్మా, మేం యోగ్యమైన మార్గంలో నడుస్తున్నాం. నువ్వు ఈ శరీరాన్ని విడిచిపెట్టి వేరొక శరీరంలో ప్రవేశించు''–అని కొడుకు ప్రార్థన చేస్తే వ్యాన వాయువు వదిలిపెడుతుంది. అంటే అమ్మకూ, బిడ్డలకూ ఉండే అనుబంధం ఎంత గాఢంగా ఉంటుందో చూడండి.

మాతృత్వంలో ఉండే అద్భుతం అటువంటిది. ఆమె పడని కష్టం ఉండదు. కాలు ఎక్కడ జారుతుందేమో నన్న భయంతో లోపల పెరుగుతున్న పిండం పట్ల అనుక్షణం అప్రమత్తంగా ఉంటుంది. లోపల భయంకరమైన పంజరం తయారయి సప్తధాతువులు–చర్మం, రక్తం, మాంసం, కొవ్వు, అస్థి, శుక్ల, మేధ ఏర్పడు తుంటే... జీవుడు అందులో ప్రవేశిస్తుంటే... కాలు పెట్టి పిల్లవాడు లోపల కడుపులో తంతే... కిలకిలా నవ్వుతూ.. తన అమ్మతో–''చూడమ్మా! ఇక్కడ వాడు తంతున్నాడమ్మా'' అని పొంగిపోతుంటుంది. ఫలితం ఆశించని అమ్మ– 'సౌందర్యం' అన్న మాటకు పర్యాయపదమయింది.

జెన్ పథం

ఓ చెట్టుకింద ముగ్గురు కూర్చున్నారు. చెట్టు కొమ్మల్లో ఉన్న పక్షులు కీచుకీచుమని అరుస్తున్నాయి. ఆ అరుపులు విన్న ఆ ముగ్గురూ ఇలా అనుకున్నారు. మొదటగా హిందువు 'పక్షులు ఓంఓం అని ఓంకారంపెడుతున్నాయి' అన్నాడు. అనంతరం ముస్లిం 'పక్షులు ఓం ఓం అనడం లేదు. అల్లా అల్లా అని ధ్యానిస్తున్నాయి' అన్నాడు. ఇక మూడో వ్యక్తి అయిన క్రైస్తవుడు 'పక్షులు ఓం ఓం అనడం లేదు. అల్లా అల్లా అని కూడా అనడంలేదు. అవి ఏసు ప్రభువా ఏసుప్రభువా అని అంటున్నాయి' అన్నాడు.

నిజానికి పక్షులూ ఆ ముగ్గురూ చెప్పుకుంటున్నట్లు అరవడంలేదు. అవి ఎప్పట్లాగా తమ సహజ ధోరణిలో కీచుకీచుమనే అరుస్తున్నాయి. ఆ అరుపులను ఆ ముగ్గురూ అర్థం చేసుకోవడం లేదన్నదే నిజం. అలాగే నిజం తెలుసుకోకుండానే అధికశాతం మంది ప్రార్థన చేస్తున్నారు. నిజానికి ప్రార్థన అనేది ప్రపంచంలోని వారందరూ క్షేమంగా ఉండాలని తలవడం. ఆ రీతిలో ప్రజల ప్రార్థన ఉంటోందా? లేదు. కనుక మతం ఏదైనా కులం ఏదైనా సర్వజనులూ బాగుండాలని ప్రార్థించడమే అసలు సిసలు ప్రార్థన అవుతుంది.

**- యామిజాల జగదీశ్**

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

పండుగ పర్వం

# నడయాడిన దైవం

**శ్రీ శంకర భగవత్పాద పరంపరాగత మూలామ్నాయ కంచి కామకోటి పీఠానికి 68వ పీఠాధిపతిగా 13 సంవత్సరాల పసిప్రాయంలో బాధ్యతలను స్వీకరించిన చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామివారు నూరేళ్ల తమ జీవితకాలంలో దాదాపు 85 సంవత్సరాల పాటు పీఠబాధ్యతలను, ఇటు ధర్మబోధనలను ఏకకాలంలో సమర్థంగా నిర్వహిస్తూ ఆ పీఠానికి పరమాచార్యునిగా పేరొందారు. రేపు ఈ నడిచేదైవం ఆరాధన. ఈ సందర్భంగా...**



ఎంతోమంది వీరి దర్శనం లభిస్తే చాలు, జన్మధన్యమైందని భావించేవారు. దేశ, విదేశీ రాజకీయ, చారిత్రక, మత ప్రముఖులు స్వామివారిని సందర్శించి, వారితో చర్చించి తమ అభిప్రాయాలను పంచుకునేవారు. స్వామివారు తమదైన శైలిలో చెప్పిన సమాధానంతో వారంతా సంతృప్తికరమైన భావనతో తిరిగి వెళ్ళేవారు.

ప్రాచీన తాళపత్రాలను సేకరించి వాటిని పరిష్కరించి ప్రచురించే దిశగా ప్రయత్నాలు కొనసాగించారు. మరోవైపు జైళ్ళలో శిక్షను అనుభవిస్తున్న ఖైదీలను సన్మార్గంలోకి తెచ్చేందుకు కృషి కొనసాగించారు. ఆసుపత్రులలో వైద్యులకు భోజనాలకు ఏర్పాట్లు చేయించారు. ఇలా పలుమార్గాలలో వీరి సమాజసేవ కొనసాగింది.

**మహాస్వామి వారి మహితోక్తులు**

- మనసు ఈశ్వరునికి స్థానం. కానీ మనం దాన్ని చెత్తతో నింపేస్తున్నాం. దాన్ని మనమే శుభ్ర పరచుకుని, ఈశ్వరుని ప్రతిష్ఠించుకుని, శాంతితో ఉండాలి. అందుకోసం మనం ప్రతిరోజూ కనీసం ఐదునిమిషాలు ధ్యానానికి కేటాయించి, ప్రళయం సంభవించినా దాన్ని చేయగలిగిన సంకల్పం కలిగి ఉండాలి
- సేవ అనేది కేవలం మానవ సమాజానికే పరిమితం చేయకుండా, జంతుజాలానికి కూడా చేయాలి. పూర్వపు రోజుల్లో పశువుల కోసం ప్రత్యేకంగా చెరువులు తవ్వించేవారు. చాలా చోట్ల గరుకు స్తంభాలు వేయించేవారు. ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ ఒక్క ఆవుకైనా చేతి నిండా సరిపడే గడ్డి పెట్టాలి. దీన్నే గోగ్రాసం అంటారు. గ్రాసం అంటే నోటినిండా అని అర్థం. గ్రాస్ అనే ఆంగ్ల పదం దీని నుండే వచ్చింది
- మన వ్యక్తిగత అవసరాలకోసం డబ్బును ఖర్చుచేయడమంటే ముఖానికి మసిపూసుకున్నట్లే
- కనీస అవసరాలకై ఎదురుచూసే ఎంతోమంది అభాగ్యులకు సేవచేయడం కూడా పరమేశ్వరారాధనే అవుతుంది. దానివల్ల ఆత్మతృప్తి కలుగుతుంది
- ఇతరుల బాగుకోసం చేసే పనిలో కలిగే బాధైనా చివరకు ఆనందాన్నే మిగులుస్తుంది.

**అరటి ఆకులు - ప్లాస్టిక్ పొట్లాలు**

కంచి మహాస్వామి వారు 1960లో తిరుచ్చి నేషనల్ కాలేజ్ హైస్కూలులో మకాం చేస్తున్నారని తెలిసి వారి దర్శనం కోసం రోజూ వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారు. వచ్చినవారందరికీ రుచికరమయిన భోజనం పెడుతున్నారు. ఉదయం పదకొండు గంటలకు మొదలయ్యే ఈ అన్నదానం సాయంత్రం నాలుగ్గంటల వరకూ జరిగేది. ఏర్పాట్లు చేసే బృంద సభ్యులు ఈ భక్తుల తాకిడిని నియంత్రించడానికి, భోజనాలు అయ్యాక వారిని పంపడానికి చాలా తంటాలు పడుతున్నారు. వారి సమస్యను స్వామివారికి చెప్పి, భోజనానికి వచ్చే భక్తులకు పంక్తి భోజనం కాకుండా ఆహార పొట్లాలను ఇచ్చే విషయమై స్వామివారికి తెలిపారు.

పరమాచార్య ఆ కమిటీ సభ్యులను ముందర కూర్చోబెట్టుకుని రెండు ప్రశ్నలను అడిగారు. మొదటిది: ఆహార పొట్లాంలోని పదార్థాన్ని తిన్న తరువాత ఆ అరటి ఆకులను వారు ఎక్కడ పడవేస్తారు? రెండవది: దాహాన్ని తీర్చుకోవడానికి నీళ్ళకోసం వారు ఎక్కడకు వెళతారు?

ఈ ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం ఇవ్వలేకపోవడంతో స్వామివారే చెప్పారు. ''నేను ఎన్నో ప్రాంతాలకు వెళ్లినప్పుడు, భోజనం తరువాత ఆ అరటి ఆకులను ఒక తొట్టెలో పడవేస్తారు. నేను చూశాను– ఆ ఆకులలో మిగిలిపోయిన పదార్థాలను నారికురవలు సేకరిస్తారు. ఆ ఆకులకు అంటుకున్న ఆహార పదార్థాలను ఆవులు తింటాయి. మీరు గమనించండి, ఆకులు వేసి భోజనం పెట్టడం వల్ల ఎందరో ఇతరుల ఆకలి కూడా తీరుతోంది''.

''ఆహార పొట్లాలను తయారు చెయ్యాలన్న మీ ఆలోచనను విరమించుకొని, అందరికీ అరటి ఆకులు వేసి భోజనం పెట్టండి. ఇంతమంది ప్రజలు ఆహారం స్వీకరించడాన్ని చూడటం, దాని కోసం ఖర్చు పెట్టుకోవడం కూడా మీకు పుణ్యం. నాకు ఆనందం కూడా''

అన్న సమారాధనలు చెయ్యడం చూశాము కానీ, దాని గొప్పదనాన్ని ఇటువంటి మహాత్ములు చెప్పిన తరువాతనే అర్థం చేసుకున్నాము.

**- రా. వేంకటసామి 'శక్తి వికటన్' నుంచి**

ఆలయం ఆగమం

# జాలకాలు.. శిల్పచాతుర్య నిలయాలు



గాలి.. వెలుగు ధారాళంగా ప్రసరించేందుకు ఏర్పాటు చేసే నిర్మాణాన్ని వాతాయనం అంటారు. వాతాయనం అంటే కిటికీ. ఆలయాల్లో.. శిల్పశాస్త్ర పరిభాషలో కిటికీలను జాలకం అంటారు. జాలం (వల) వలె అనేక రంధ్రాలతో నిర్మిస్తారు కనుక దీన్ని జాలకం అని పిలుస్తారు. ఈ కిటికీలు ఎక్కడ? ఎందుకు నిర్మిస్తారంటే.. చాలాచోట్ల ఆలయంలో గర్భగుడి బయటి భాగాన్ని.. దానిపై ఉండే కోష్ఠదేవతల్ని.. ఆ శిల్ప సౌందర్యాన్ని చూసే అవకాశం ఉంటుంది. కానీ కొన్ని ఆలయాల్లో గర్భగుడి చుట్టూ రక్షణగా గోడ నిర్మించి ఉంటారు. ఇలాంటి ఆలయానికి సాంధార దేవాలయం అని పేరు. తిరుమలలో గర్భగుడి చుట్టూ వైకుంఠద్వారంగా పిలిచే భాగం సాంధార నిర్మాణమే. ఇంకా తంజావూరు.. హంపి.. అలంపూర్.. వంటి ఎన్నో దక్షిణాది ఆలయాలు సాంధారదేవాలయాలే. ప్రధానంగా ఆలయాన్ని శత్రువుల బారి నుండి రక్షించడానికి.. విమానగోపురం నిర్మాణ బరువును తట్టుకోవడానికి ఈ గోడ కడతారు. ఈ గోడతో గర్భగుడిని మూసివేయడం వలన రెండింటికీ మధ్య ప్రదక్షిణలు ఆచరించే భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా.. గాలీ.. వెలుతురు కోసం బయటి గోడకు ఈ జాలకాలు నిర్మిస్తారు. గర్భగుడికి ఎక్కడా జాలకాలు నిర్మించ కూడదు... నిర్మించరు. ఇంకా అంతరాళ మండపం.. రంగమండపం.. మహా మండపం.. వంటి మూసి ఉన్న నిర్మాణాల్లో జాలకం నిర్మించవచ్చు. చాలాచోట్ల స్వామివారి మూలవిరాట్టుపై సూర్యకిరణాలు ప్రసరిస్తాయి. ఇవి ఆలయంలోని ఎదురుగా ఏర్పాటు చేసిన జాలకాల వలనే. జాలకం గాలి, వెలుతురు కోసం నిర్మించేదైనా దక్షిణాది ఆలయాల్లో అద్భుతమైన శిల్ప సౌందర్యాన్ని ఈ జాలకాల్లో మనం చూడొచ్చు. ఇందులో ఆవు కన్నులంత.. అదే ఆకృతిలో రంధ్రాలను చేస్తే దాన్ని గవాక్షం అంటారు. ఏనుగుకన్ను ఆకారంలో రంధ్రాలను చేసిన జాలకానికి కుంజరాక్షం అని పేరు. స్వస్తిక చిహ్నాలను పోలి ఉంటే స్వస్తిక వాతాయనం అనీ... పెను నాగుపాములు అలంకరించి ఉంటే నాగబంధ జాలకం అనీ.. లతలు, తీగలు ఒకదానికొకటి గుండ్రంగా చుట్టుకుని ఉంటే వల్లీబంధ జాలకం అనీ.. పూవులవంటి ఆకారంలో ఉంటే పుష్పబంధ జాలకం అనీ.. మధ్య మధ్యలో విగ్రహాలు ఉంటే శిల్పజాలకం(కొన్నిచోట్ల రామాయణ, మహాభారతం, క్షేత్రం మహాత్మ్యాలు, దేవతామూర్తులను కూడా వీటిపై చెక్కుతారు) అనీ.. గుండ్రటి ఆకారం ఉంటే గులికా జాలకం అనీ..ఇలా ఒకే ఆలయంలో అనేక రకాలైన జాలకాలను చూడవచ్చు. వీటిని దగ్గరకెళ్ళి పరిశీలించి చూస్తే తప్ప అవి కిటికీలు అని తెలియనంతగా శిల్పకళా చాతుర్యం ఈ జాలకాల నిండుగా ఉంటుంది. ఈ జాలకాల నుంచి వెలుగులు.. గాలి ప్రసరించినట్టు.. భగవంతుని కరుణ మనపై ప్రసరించాలని కోరుకుందాం.



**- కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య**
ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

ప్రశ్నోత్తర భారతం



## అర్జున ద్రోణులు

424. కొమ్మ మీద ఉన్న పక్షి గురించి ద్రోణుడు అడిగినప్పుడు ధర్మరాజు, అర్జునుడు ఏయే సమాధానాలు చెప్పారు?
425. వారి మాటలకు ద్రోణుడు ఏమన్నాడు?
426. ఒకనాడు ద్రోణుడు రాకుమారులతో ఎక్కడకు వెళ్లాడు?
427. ద్రోణుడు గంగానదిలో స్నానం చేస్తుండగా ఏం జరిగింది?
428. రాకుమారులందరూ మొసలి మీద బాణం వేయడానికి వెనుకంజ వేసినప్పుడు, అర్జునుడు ఏం చేశాడు?
429. ద్రోణుడు మనసులో ఏమనుకున్నాడు?

**- నిర్వహణ: డా. వైజయంతి పురాణపండ**

**జవాబులు:** 424) ధర్మరాజు తనకు పక్షి, పరిసరాలు, ద్రోణుడు, తమ్ములు కనిపిస్తున్నారని చెప్పాడు. అర్జునుడు తనకు పక్షి శిరసు మాత్రమే కనిపిస్తోందన్నాడు. 425) దర్మరాజు ధనుర్విద్యకు పనికిరాడన్నాడు. అర్జునుడిని ఆనందాశ్రువులతో ఆశీర్వదించాడు. 426) రాకుమారులను వెంటపెట్టుకుని గంగానదికి వెళ్లాడు.427) ఒక మొసలి వచ్చి ద్రోణాచార్యుని పిక్క పట్టుకుంది. 428) అర్జునుడు బాణం సంధించి, నీటిలోకి విడిచాడు. అలా ఐదు బాణాలు వదలటంతో, మొసలి ద్రోణుని పిక్క వదిలి, చచ్చిపోయి, నీటి మీద తేలింది. 429) ద్రుపదుడు బంధుజన సహితంగా పట్టుబడ్డాడనుకున్నాడు. అర్జునునికి మరిన్ని విద్యా రహస్యాలు ఉపదేశించాడు.

గురు సన్నిధి

# మాతా శారదాదేవి



ప్రాచీన ఆదర్శాలు–ఆధునిక జీవన విధానాలను సమన్వయం చేసుకున్న సరస్వతి ఆమె. ఒకవైపు ఇంటి వ్యవహారాలు చూస్తూ, కుటుంబంలోని ఒడిదుడుకులనే తపస్సుగా స్వీకరించిన సాధారణ గృహిణి ఆమె. బడికి వెళ్ళి పాఠాలు నేర్వలేదు. పుస్తకాలు చదవలేదు. కానీ ఆమెతో మాట్లాడిన గొప్పమేధావులు సైతం ఆమె ఆధ్యాత్మిక జ్ఞానానికి అబ్బురపోయేవారు. ఆవిడే శారదాదేవి. రామకృష్ణ పరమహంస ధర్మపత్ని.

వీరిద్దరిది భౌతికమైన సంబంధం లేని అన్యోన్య దాంపత్యం. తామరాకుపై నీటిబొట్టులా సంసారంలో ఉంటూనే దాని ప్రభావం తమ మీద పడకుండా చూసుకున్నారు వీరిరువురూ. రామకృష్ణులను తన ఆధ్యాత్మిక పురోగతికి సాయపడే గురువుగా శారదాదేవి తలిస్తే, ఆమెను సాక్షాత్తూ కాళీమాతగా భావించేవారు రామకృష్ణులు. రామకృష్ణ పరమహంసను గురువుగా స్వీకరించినవారంతా శారదాదేవిని మాతృమూర్తిగా ప్రేమించారు.

**జగమంత కుటుంబం**

సాధకుడైన భర్తకు కాళీమాతలా, అతని శిష్యుకు తల్లిలా భాసించిన శారదాదేవి... మాతృమూర్తి అన్న మాటకు మరో నిర్వచనాన్ని ఇచ్చారు. తనకు పిల్లలు లేరనే లోటు లేకుండా శిష్యులనే తన సంతానంగా భావించి వారి ఆలనాపాలన చూసుకునేది శారదాదేవి..

భౌతికంగా రామకృష్ణులు దూరమయ్యాక ఏం చేయాలో, ఎటు వెళ్లాలో తెలియని అయోమయ స్థితిలో ఉన్న శిష్యగణానికి శారదామాత తగిన ధైర్యాన్ని అందించారు. రామకృష్ణుని శిష్యులందరికీ కొత్త ఆశగా చిగురించారు. ఎలాంటి ఆధ్యాత్మిక సలహాకైనా, సందేహ నివృత్తికైనా శారదాదేవి దగ్గరకి చేరేవారు వారంతా. రామకృష్ణుల సాన్నిహిత్యంతో తనకు కలిగిన యోగానుభవాలను వారికి చెబుతూ ఓపికగా వారి సందేహాలను తీర్చేది శారదాదేవి

**అమ్మ నోట మాటలు–ఆణిముత్యాలు**

ధ్యానం ఆవశ్యకతను వివరిస్తూ ''క్రమం తప్పక ధ్యానం చేస్తూ ఉంటే మనస్సు నిశ్చలమై ఒక స్థాయికి చేరి, ఇక ధ్యానంతో పనిలేని స్థితికి వస్తారు. తీవ్రమైన గాలులు మేఘాలను చిన్నాభిన్నం చేసినట్టు, భగవంతుడి నామం మనోమాలిన్యాలను తొలగిస్తుంది. అందుకే నామజపం ఒక సాధనగా అభ్యసించాలి'' అని చెప్పేవారు. అలాగే మీకు మనశ్శాంతి కావాలంటే ఎదుటివారి తప్పులు వెతకడం మానండి. మీలోని తప్పులను సరిదిద్దుకోండి. ఎవ్వరూ పరాయివారు కాదు. ప్రపంచమంతా మనదే''. అంటూ సందేశాన్ని అందించారు.

**- అప్పాల శ్యామప్రణీత్ శర్మ అవధాని,**
వేదపండితులు, (నేడు శారదా దేవి జయంతి)

ఇస్లాం వెలుగు

# కర్తలేని సృష్టి!?

బాగ్దాదు నగరాన్ని మెహదీ అనే రాజు పరిపాలిస్తున్న కాలమది. ఆ కాలంలో హజ్రత్ ఇమాం అలైహ్ అనే గొప్ప ధార్మిక పండితుడు ఉండేవారు. ఖురాన్, హదీసు విద్యల నిష్ణాతులు. ఎంతటి చిక్కు సమస్యకైనా చిటికెలో పరిష్కారం చూపేవారు. రాజుకి ఏసందేహమొచ్చినా ఇమాంని పిలవనంపేవాడు.

ఒకసారి రాజదర్బారులోకి ఓ వ్యక్తి వచ్చాడు. తనను తాను గొప్ప జ్ఞానిగా చెప్పుకుంటూ, దేవుడు లేడని, ఆస్థాన పండితులెవరైనా ఉన్నాడని నిరూపిస్తే చర్చకు సిద్ధమని ప్రకటించాడు. అప్పుడు రాజుగారు, ఇమాం అలైహ్ వద్దకు మనిషిని పంపించారు. ఆ వ్యక్తి ఇమాంగారికి విషయమంతా చెప్పి, రాజుగారు తమరిని రమ్మని ఆజ్ఞాపించారని తెలియజేశాడు. ''సరే నువ్వు వెళ్ళు.. నేను వస్తున్నానని చెప్పు'' అన్నారు ఇమాం. ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. అటు రాజ దర్బారులో రాజు సహా, మంత్రులు, ప్రధానులు, రక్షణాధికారులు, ప్రజలు అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సమయం గడిచిపోతోంది కాని ఇమాం గారు రాలేదు. ప్రజల్లో ఉత్కంఠ పెరిగిపోతోంది. ఆ వ్యక్తి సభికులందరివైపు చిద్విలాసంగా చూస్తూ.. రాజుగారిని ఉద్దేశించి, ''రాజా..! ఇక మీ ఆస్థాన పండితుడు రాడు. నాతో వాదించగలిగే జ్ఞానం మీ పండితుడికి లేదు. ఇక ఓటమిని అంగీకరించడం తప్ప మరో మార్గం లేదు'' అన్నాడు.

అంతలో హజ్రత్ ఇమాం అబూహనీఫా సభలో ప్రవేశించారు. ఇమాం గౌరవార్థం అందరూ లేచి నిలుచున్నారు. రాజు ఎంతో గౌరవ మర్యాదలతో ఇమాంని ఘనంగా స్వాగతించాడు. ఆలస్యానికి కారణం అడిగాడు.



''రాజా .. ''నేను మీ ఆజ్ఞమేరకు బయలుదేరి దజ్ లా రేవుదగ్గరికి వచ్చాను. కాని అక్కడ నావలేవీ సిద్ధంగా లేవు. చాలాసేపు ఎదురు చూశాను. కాని ఒక్క నావికుడూ జాడ లేడు. అక్కడే చాలా సమయం గడిచిపోయింది. ఏం చేయాలో అర్థం కావడం లేదు. అలాంటి సమయంలో ఒక అద్భుతం జరిగింది. నదిలోంచి చెక్కలు బయటికి వచ్చాయి. చూస్తూ చూస్తూనే అవి వడ్రంగి చెక్కినట్లుగా సైజులు తయారై అమరడం ప్రారంభించాయి. అంతలో నీటిలోనుండి మేకులు వెలువడ్డాయి. అవి కూడా వేటి స్థానంలో అవి ఎవరూ కొట్టకుండానే దిగబడిపోయ్యాయి. అంతలోనే మళ్ళీ మైనం ఉబికి వచ్చి, రంధ్రాలను పూడ్చేసింది. చూస్తూ చూస్తూనే అప్పటికప్పుడు ఎవరో తయారు చేస్తున్నట్లుగానే పడవ తయారై పోయింది. నేను రెప్పవేయడం కూడా మరిచి పోయాను. ఏం జరుగుతోందో అర్థంకాని పరిస్థితిలో ఉండగానే అది నేరుగా నావైపుకే వచ్చి, ఇక ఎక్కమన్నట్లుగా వంగింది. అప్రయత్నంగానే నేను పడవ ఎక్కేశాను. వెంటనే అది వాలుకు ఎదురీదుతూ గమ్యానికి చేర్చి ఇక దిగమన్నట్లుగా తీరం వైపుకు ఒంగింది. నేను దిగిపోయాను. దిగిన వెంటనే ఆ పడవ చూస్తుండగానే మాయమైపోయింది. ఏమీ అర్థంకాని స్థితిలో అక్కడే ఆలోచిస్తూ ఉండిపోయ్యాను. ఎప్పటికో కాస్త తేరుకుని వచ్చేసరికి ఇంత ఆలస్యం జరిగిపోయింది.' అన్నారు అబూహనీఫా. ఇదంతా విన్న దేవుడు లేడని వాదించడానికి వచ్చిన ఆ మేధావి .. ''అయ్యా.. పండితులవారూ.. మీరు చెప్పిన కథ వింటే నాకు నవ్వొస్తోంది. భలే బాగా చెప్పారు.. ఎవడూ తయారు చేయకుండానే ఇవన్నీ జరగడం సాధ్యమా? ఇది ఏమాత్రమైనా తర్కానికి నిలిచే మాటేనా?' అన్నాడు కుండ బద్దలు కొట్టినట్టు.

''అయ్యా.. కేవలం చిన్న పడవ.. చేసేవాడెవడూ లేకుండా తయారు కానప్పుడు, ఇంత పెద్ద సృష్టి దానంతట అదే ఎలా తయారవుతుందంటారు? అనంతమైన ఆకాశం, సువిశాలమైన భూమండలం, ఈ భూమ్యాకాశాల మధ్యనున్న సమస్త ప్రకృతీ.. ఇదంతా ఎవరూ లేకుండానే, ఎవరూ తయారు చేయకుండానే వాటంతట అవే ఉనికిలోకొచ్చాయా?' అని సూటిగా అడిగారు ఇమాం. దీంతో దర్బారంతా కరతాళ ధ్వనులతో, జయజయ ధ్వానాలతో మారుమోగిపోయింది. సిగ్గుతో తలదించుకొని అక్కడినుండి నిష్క్రమించాడు వాదనకొచ్చిన ఆ (అ)జ్ఞాని.

**- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్**

epaper.sakshi.com

వార్తల్లో వ్యక్తులు

## పర్వేజ్ ముషారఫ్



రాజ్యాంగాన్ని రద్దుచేసి, సైనిక పాలన విధించి, దేశద్రోహ నేరానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై మాజీ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌కు పాకిస్తాన్ ప్రత్యేక కోర్టు మరణ శిక్ష విధించింది. పాకిస్తాన్ సైనిక పాలనలో అధ్యక్ష స్థానంలో ఉండి ముషారఫ్ నిరంకుశంగా వ్యవహరించారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తులను గృహ నిర్బంధంలో ఉంచారు. అనేక మంది న్యాయమూర్తులను తొలగించారు. ఇవే నేరారోపణలపై ముషారఫ్‌కు మరణశిక్ష విధించారు. అంతేకాదు!! ముషారఫ్ పరారీలో ఉన్నారు కనక... ఆయన దొరికే నాటికి చనిపోయి ఉంటే... శవాన్నైనా సరే పాకిస్తాన్‌కి తెచ్చి మూడు రోజుల పాటు ఉరికొయ్యకు వేలాడదీయాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం విశేషం.

## కుల్దీప్ సింగ్ సెంగార్



ఉత్తరప్రదేశ్‌లోని ఉన్నావ్‌లో 17 ఏళ్లమైనర్ బాలికపై బీజేపీ శాసనసభ్యుడు కుల్దీప్ సింగ్ సెంగార్ అత్యాచారానికి పాల్పడిన ఘటన దేశంలో సంచలనం రేకెత్తించింది. ఆ తరువాత సైతం వరుస నేరాలకు సెంగార్ మూలకారణమయ్యాడు. ఈ ఘటన ఆడపిల్లల భద్రతపై భయాందోళనలు రేకెత్తించింది. వెల్లువెత్తిన నిరసనల నేపథ్యంలో సెంగార్‌ని బీజేపీ నుంచి బహిష్కరించారు. ఈ కేసులో సెంగార్‌ని దోషిగా ప్రకటించిన ఢిల్లీ తీస్ హజారీ కోర్టు అతడికి యావజ్జీవ కారాగార శిక్షను విధించింది.

## యూట్యూబ్ రియాన్...



ఆట వస్తువులపై రివ్యూలు గుప్పించే ఎనిమిదేళ్ళ బుడతడు రియాన్. అయితే ఏంటని అనుకోవద్దు. యూట్యూబ్ ద్వారా అత్యధిక ఆదాయం పొందుతున్నవాడిగా వరసగా రెండోసారి నిలిచాడు కనుకనే ఈ వారం వార్తల్లోకెక్కాడు. ఫోర్బ్స్ వెల్లడించిన 2019 యేడాది టాప్ టెన్ ర్యాంకుల ప్రకారం ఈ బుడతడి వార్షికాదాయం 26 మిలియన్ డాలర్లు (రూ.184.72 కోట్లు). 2018లో ఈ పిల్లాడి ఆదాయం 22 మిలియన్ డాలర్లు(సుమారు రూ.156.28 కోట్లు).

• జాతీయం

# 'పౌర' నిరసనల ఫలితమేంటి?



సవరణ చట్టానికి 8 రాష్ట్రాల వ్యతిరేకత

బహుశా! కేంద్ర ప్రభుత్వం ఇంతటి నిరసనలను ఊహించలేదేమో!!. ఎందుకంటే కశ్మీర్లో 370వ అధికరణాన్ని రద్దు చేసినపుడు, వివాదాస్పద మసీదు– మందిర్ స్థలంపై సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పుడు వారు ఏదైతే ఊహించారో అదే జరిగింది. కొన్ని వర్గాల నుంచి నిరసనలు వ్యక్తమైనా అవి మరీ అదుపు చేయలేనంత స్థాయిలో లేవు. కాబట్టే చల్లబడిపోయాయి. కానీ పౌరసత్వ సవరణ చట్టం విషయంలో మాత్రం కేంద్రం, బీజేపీ అధినాయకత్వం అంచనాలు తప్పాయనే అనుకోవాలి. ఈశాన్యంలో మొదలైన నిరసన జ్వాలలు దేశం నలుదిక్కులా అలుముకున్నాయి. యావత్ దేశాన్నీ కుదిపేస్తున్నాయి. రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఒరిస్సా, బీహార్, పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు తాము ఎన్నార్సీని ఏ మాత్రం ఆమోదించలేమని తేల్చి చెప్పేశాయి. ఈ నేపథ్యంలో కేంద్రం సైతం కొన్ని మార్పులకు సిద్ధమని సంకేతాలు పంపటం మొదలుపెట్టింది.

### భగ్గుమన్న విశ్వవిద్యాలయాలు

పౌరసత్వ సవరణ చట్టంపై ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో రాజుకున్న ఉద్యమంతో యువత పెద్ద ఎత్తున వీధుల్లోకొచ్చింది. పాకిస్తాన్, బాంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్‌ల నుంచి 2014 డిసెంబరు 31కన్నా ముందు దేశంలోకి వచ్చిన ముస్లింలను ఈ సవరణ నుంచి మినహాయించటమనేది మతపరమైన పక్షపాత ధోరణికి నిదర్శనమంటూ ఢిల్లీ జామియా ఇస్లామియా విద్యార్థి ఉద్యమం నిరసిస్తోంది. మద్రాసు యూనివర్సిటీ ఇప్పటికే డిసెంబర్ 23 వరకు సెలవులు ప్రకటించింది. యూపీలోని అలీగఢ్ ముస్లిం వర్సిటీలో ఆగ్రహ జ్వాలలు మిన్నంటాయి. హైదరాబాద్‌లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హెచ్‌సీయూల్లో ఉద్యమాలు కొనసాగుతున్నాయి. ఒక్క ఉత్తర ప్రదేశ్‌లోనే శుక్రవారం నాటికి తొమ్మిదిమంది, ఈశాన్య రాష్ట్రాల్లో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. బీహార్‌లో, మహారాష్ట్రలో సైతం ఉద్యమం హింసాత్మకంగా మారింది.

### నిరసన ఒక్కటే.. డిమాండ్లు వేరు..

పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా అనేక రాష్ట్రాల్లో ఉద్యమాలు జరుగుతున్నా ఒక్కో రాష్ట్ర ఆందోళన ఒక్కో భిన్నమైన ప్రతిపాదనని తెరపైకి తెస్తోంది. ఈశాన్య రాష్ట్రాల్లో స్థానికులపై స్థానికేతరుల ఆధిపత్యం పెరుగుతుందనీ, అక్కడి సంస్కృతీ, సంప్రదాయాలూ, ప్రజల జీవన విధానం ధ్వంసమైతుందన్నది ప్రధానమైన ఆరోపణ. తమిళనాడులో శ్రీలంక తమిళులకు అన్యాయం జరుగుతోందన్న వాదన వినిపిస్తోంది. మరికొన్ని చోట్ల ముస్లింలే ప్రధాన డిమాండ్‌గా తెరపైకి వస్తున్నారు. ఈ నేపథ్యంలో కొన్ని సవరణలకు సిద్ధమంటూ కేంద్రం సంకేతాలిస్తోంది. అవి ఏంటన్నది మున్ముందు వెల్లడికానుంది.

• అంతర్జాతీయం

# అగ్రరాజ్యంలో అభిశంసన సెగలు..



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై అభిశంసన ముద్ర పడింది. రిపబ్లికన్ పార్టీకి చెందిన ట్రంప్‌కు వ్యతిరేకంగా తెచ్చిన అభిశంసన తీర్మానం... అమెరికా ప్రతినిధుల సభలో (దిగువ సభ) పాసైపోయింది. ఎందుకంటే ఈ సభలో డెమొక్రాట్లదే మెజారిటీ. అయితే ఈ అభిశంసన పూర్తవ్వాలంటే ఎగువ సభ సెనేట్ కూడా ఆమోదించాలి. అక్కడేమో రిపబ్లికన్లదే మెజారిటీ!!. మరెలా సాధ్యం?

నిజానికి అమెరికా చరిత్రలో అభిశంసనను ఎదుర్కొన్న మూడో అధ్యక్షుడు ట్రంప్. సెనేట్ ఈ బిల్లును ఆమోదించదన్న ధీమాతోనే ట్రంప్ ఇప్పటికిప్పుడే సెనేట్‌కు దీన్ని పంపాలని పట్టుబట్టారు. నిజానికి వచ్చేనెల్లో ఈ తీర్మానం సెనేట్‌లో చర్చకు వస్తుందని అంతా భావించారు. కానీ ట్రంప్ అంతకు ముందే పెట్టాలని కోరటం ఆసక్తికరంగా మారింది. డెమొక్రాట్లు ఇందుకు సుముఖత వ్యక్తం చేయకపోవటంతో... ట్రంప్ ఎదురుదాడి మొదలుపెట్టారు. తనకు ఓటేసిన అమెరికన్ల బ్యాలెట్లను రద్దుచేసేందుకు డెమొక్రాట్లు ప్రయత్నిస్తున్నారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. నిజానికి అమెరికాలో అభిశంసన కొత్తకాదు. గతంలో ఇద్దరు అధ్యక్షులు అభిశంసన అనుభవాలను ఎదుర్కొన్నారు. కానీ ఎవ్వరూ అభిశంసనకు గురికాలేదు. 1868 ఫిబ్రవరిలో నాటి అధ్యక్షుడు ఆండ్రూజాన్సన్‌పై 11 అభియోగాలతో అభిశంసన ప్రవేశపెట్టారు. అభియోగాలన్నీ ఒక యుద్ధ కార్యదర్శిని తొలగించి మరొకరిని ఆ స్థానంలో నియమించడానికి సంబంధించినవే. ఇక 1998లో బిల్‌క్లింటన్‌కి అభిశంసన అనుభవం ఎదురయ్యింది. ప్రభుత్వ ఉద్యోగిని పౌలా జోన్స్‌పై లైంగిక నేరానికి పాల్పడ్డారని... ఈ వ్యవహారంలో కోర్టును తప్పుదోవ పట్టించారని తీర్మానం ప్రవేశపెట్టారు. ఇది కూడా సెనేట్‌లో వీగిపోయింది.

### ఎందుకిప్పుడు అభిశంసన?

డెమొక్రటిక్ పార్టీ అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేస్తున్న జోబైడెన్ మీద విచారణ చేపట్టాలంటూ ఉక్రెయిన్‌ను ఒత్తిడి చేసి, ఆ దేశాన్ని తనకు రాజకీయంగా సాయం చేయాలని కోరడం ద్వారా ట్రంప్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాడనేది ఆయనపై డెమొక్రాట్లు చేసిన తొలి అభియోగం. రెండవది.. ప్రతినిధుల సభలో విచారణకు ట్రంప్ సహకరించకుండా కాంగ్రెస్‌ను ధిక్కరించారన్నది. ఈ రెండు అంశాల ఆధారంగా గురువారం అమెరికా ప్రతినిధుల సభ అగ్రరాజ్యాధిపతి పదవికి అర్హుడు కాదని చెప్పకనే చెప్పింది. ట్రంప్ అభిశంసనకు అనుకూలంగా 230, వ్యతిరేకంగా 197 ఓట్లు వచ్చాయి.

### రాజీనామా చేసిన... రిచర్డ్ నిక్సన్

జాన్సన్, క్లింటన్, ట్రంప్‌లా కాక తనపై వచ్చిన అభియోగాలపై ప్రతినిధుల సభలో విచారణను ఎదుర్కొన్న మరో అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్. పలు రాజకీయ ఆరోపణలపై ఆయన్ను ప్రతినిధుల సభ విచారించింది. తరవాత అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు సభ సిద్ధమౌతుండడంతో నిక్సన్ తనే అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఇంతవరకూ ఏ ఒక్క అమెరికా అధ్యక్షుడూ అభిశంసన కారణంగా అధికారాన్ని కోల్పోలేదు.

• వెరైటీ

# ట్విట్టర్... ముట్టుకుంటే మూర్ఛ!

ఉదయం లేవంగానే చాలామంది చేసే మొట్టమొదటి పని ట్విట్టర్, ఫేస్‌బుక్ పోస్టులు చూసుకోవడం.

మీరీ పని చేయకుంటే ఓకేగానీ.. చేస్తుంటే మాత్రం ఒకింత జాగ్రత్త పడటం మేలు.

ఎందుకంటారా? ట్విట్టర్ సందేశాలతోనే మీకు మూర్ఛ లక్షణాలు కనిపించే అవకాశముంది కాబట్టి!

ఆశ్చర్యంగా ఉందా.. అదెలాగో తెలుసుకునే ముందు ప్రపంచవ్యాప్తంగా సుమారు ఐదు కోట్ల మందిని ఇబ్బంది పెడుతున్న మూర్ఛ వ్యాధి గురించి కొంచెం అర్థం చేసుకోవాలి. మన శరీరాల్లో సమాచారం ఒక కణం నుంచి మరోదాంట్లోకి వెళ్లేందుకు విద్యుత్తు సంకేతాలు అవసరం. ఈ సంకేతాలు అకస్మాత్తుగా పెరిగిపోతే దాన్ని మూర్ఛ అంటాం. శరీరం వేగంగా వణికిపోవడం, వాంతులు, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, స్పృహ తప్పిపోవడం వంటివి మూర్ఛ లక్షణాలు. కొన్ని సందర్భాల్లో మరణం కూడా సంభవించవచ్చు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. చాలామందికి ఈ మూర్ఛవ్యాధి స్వతఃసిద్ధమైంది. కానీ కొంతమందికి మాత్రం కొన్ని దృశ్యాలు చూస్తే చాలు. పైన చెప్పుకున్న లక్షణాలన్నీ కనిపిస్తాయి.

ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందీ అంటే.. ఈ మధ్య అమెరికాలో ఓ సైబర్ దాడి జరిగింది. మూర్ఛవ్యాధిపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు ఏటా నవంబరులో అక్కడ కొన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఎపిలెప్సీ ఫౌండేషన్ సభ్యులు సుమారు 33 వేల మందికీ ఓ ట్విట్టర్ సందేశం వచ్చింది. దాంట్లో ఓ బొమ్మ మాత్రమే ఉంది. కానీ.. దృశ్యాలు చూస్తే మూర్ఛ లక్షణాలు అభివ్యక్తమయ్యే వాళ్లకు ఈ మాత్రం బొమ్మ చాలు. ఫౌండేషన్ సభ్యుల్లో సుమారు ౙ30 మంది ఇబ్బందికి గురయ్యారు కూడా. టెక్నాలజీతో చిక్కులు వస్తాయనేందుకు ఇదో చిన్న ఉదాహరణ. ''మూర్ఛవ్యాధితో బాధపడుతున్న వారు సమావేశమైన గదిలో ఇలాంటి బొమ్మలతో చొచ్చుకుపోవడం లాంటిది ఇది'' అని ఫౌండేషన్ డైరెక్టర్ అలిసన్ నికోల్ అంటున్నారు. ట్విట్టర్ సాయంతో ఇలాంటి దాడి జరగడం ఇదే మొదటిసారి కాదు. 2016లో కర్ట్ ఈఛన్‌వాల్డ్ అనే మూర్ఛ బాధితుడికి ఓ జిఫ్ ఫైల్ పంపితే.. దాన్ని తెరిచినందుకుగాను ఆయన ఎనిమిది నిమిషాలపాటు యాతన పడ్డాడు. మూడు నెలల తరువాత ఎఫ్‌బీఐ జాన్ రైన్ రివెల్లో అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ట్రంప్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశాడన్న కారణంగా తాను ఈ పనికి పాల్పడినట్లు జాన్ చెప్పుకోవడం కొసమెరుపు!



• తెలంగాణ

# యాదాద్రి నిర్మాణ పనులు చకచకా

### స్వయంగా రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట కొత్త రూపును సంతరించుకుంటోంది. యాదాద్రిగా భక్తకోటిని భక్తి పారవశ్యంలో ఓలలాడించేందుకు శరవేగంగా సిద్ధమవుతోంది. చివరి దశ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మధ్యలో కొన్ని వివాదాల వల్ల పనుల్లో వేగం తగ్గింది. దీంతో ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు స్వయంగా రంగంలోకి దిగారు. పొరపాట్లకు తావులేకుండా పనులు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దాదాపు రెండు నెలల ఆర్టీసీ 'సంక్షోభం' సమయంలో క్రమం తప్పకుండా సమీక్షలు, ఏరోజుకారోజు పరిస్థితుల పర్యవేక్షణ, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆదేశం... ఇలా బిజీబిజీగా గడిపిన ముఖ్యమంత్రి ఇప్పుడు యాదాద్రిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. దేశంలోనే గొప్ప ఆధ్యాత్మిక, సందర్శనీయ ప్రాంతంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా డిసెంబర్ 17న దాదాపు ఆరున్నర గంటల పాటు యాదాద్రి నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ యాదాద్రి క్షేత్ర పనులను స్వయంగా పర్యవేక్షించటం ఇది 12వసారి కావడం గమనార్హం.

### సద్దుమణిగిన వివాదాలు

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మహా యాగంతో యాదగిరీశుడు స్వయంభూ మూర్తిగా మళ్లీ భక్తులకు దర్శనమివ్వబోతున్న క్రమంలో కొన్ని వివాదాలు కాస్త ఇబ్బంది పెట్టాయి. సీఎం కేసీఆర్ సహా కొందరు రాజకీయ నేతలు, పార్టీ గుర్తులను పోలిన చిహ్నాలు యాదాద్రి ఆలయ స్తంభాలపై దర్శనమివ్వడం సంచలనం సృష్టించింది. దీనిపై సర్వత్రా తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. యాదాద్రి డెవలప్‌మెంట్ అథారిటీ ప్రతినిధులు వెంటనే అప్రమత్తమై వాటిని తొలగించటంతో వివాదం సద్దుమణిగింది. అలాగే ప్రధాన గర్భాలయంలో స్వయంభూ మూర్తి ఉండే చోట చెక్కించారన్న ప్రచారం జరిగింది. ఆ విషయంలో కూడా అధికారులు వివరణ ఇచ్చారు. ఆలయ గర్భాలయ ప్రాశస్త్యం దెబ్బతినే పనులేవీ చేపట్టలేదని స్పష్టం చేశారు. యాదాద్రిలో గర్భాలయ మూలమూర్తిని దర్శించుకునేందుకు భక్తులు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు. పనులు వేగంగా సాగుతుండడంతో భక్తజనం కోరిక త్వరలోనే సాకారం అవుతుందని యాదాద్రి అధికారులు చెబుతున్నారు.

• ఆంధ్రప్రదేశ్

# నవ్యాంధ్రకు మూడు రాజధానులు

### ఏపీ ప్రభుత్వానికి జీఎన్ రావు కమిటీ సిఫార్సులు



**ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు**

- ఉత్తరాంధ్ర: శ్రీకాకుళం, విశాఖ, విజయనగరం జిల్లాలు
- మధ్య కోస్తా: ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు
- దక్షిణ కోస్తా: గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు
- రాయలసీమ: వైఎస్సార్, చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలు

**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందేలా అమరావతిలో లెజిస్లేటివ్ క్యాపిటల్, విశాఖలో ఎగ్జిక్యూటివ్ క్యాపిటల్, కర్నూలులో జ్యుడీషియల్ క్యాపిటల్ ఏర్పాటు చేయాలని జీఎన్ రావు కమిటీ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. రాజధానితోపాటు రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సిఫార్సులు చేసేందుకు జీఎన్ రావు నేతృత్వంలో నిపుణుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. జీఎన్ రావు కన్వీనర్‌గా సెప్టెంబరులో ఈ కమిటీ ఏర్పాటైంది. కమిటీలో సభ్యులుగా విజయమోహన్, ఆర్.అంజలీ మోహన్, డాక్టర్ మహావీర్, డాక్టర్ సుబ్బారావు, కేటీ రవీంద్రన్, అరుణాచలం నియమితులయ్యారు. ఈ కమిటీ ఆంధ్రప్రదేశ్‌లో మూడు నెలలకు పైగా విస్తృతంగా పర్యటించి, నివేదిక రూపొందించింది. కమిటీ మొత్తం 10,600 కిలోమీటర్లు తిరిగి, రాజధాని, అభివృద్ధి తదితర అంశాలపై అధ్యయనం చేసింది. ప్రజల నుంచి 38 వేల విజ్ఞాపనలు స్వీకరించి పరిశీలించింది. 2 వేల మంది రైతులతో నేరుగా మాట్లాడింది. అన్ని జిల్లాలకు వెళ్లి.. అక్కడి ప్రజలు ఏం కోరుకుంటున్నారనే దానిపై అభిప్రాయ సేకరణ చేసింది. సమగ్ర అధ్యయనం అనంతరం జీఎన్ రావు కమిటీ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది.

**ఎక్కడెక్కడ ఏమిటంటే..**

- విశాఖపట్నంలో సచివాలయం, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం, శాఖాధిపతుల కార్యాలయాలు, హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి.
- వేసవిలో అసెంబ్లీ సమావేశాలు విశాఖపట్నంలో నిర్వహించాలి.
- అమరావతిలో శీతాకాల అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలి. అమరావతిలో హైకోర్టు బెంచ్, ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం ఉండాలి. ఎన్జీటీ ఆదేశాల ప్రకారం రివర్ ఫ్రంట్ నిర్మాణాలు ఉండరాదు.
- కర్నూలులో హైకోర్టు నెలకొల్పాలి.
- అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగా.. కర్ణాటక తరహాలో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో నాలుగు ప్రాంతీయ అభివృద్ధి మండళ్లు ఏర్పాటు చేయాలి.

# ఎన్‌ఎండీసీతో చరిత్రాత్మక ఒప్పందం

- కడప ఉక్కు కర్మాగారానికి ఏటా 5 మిలియన్ టన్నుల ముడి ఇనుప ఖనిజం
- పలువురికి ఉపాధి అవకాశాలు

**సాక్షి, అమరావతి:** రాయలసీమ ప్రజల దశాబ్దాల చి రకాల వాంఛన నెరవేర్చేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. వైఎస్సార్ జిల్లాలో ఏర్పాటు చేయనున్న ఉక్కు కర్మాగారానికి ముడి ఇనుమును సరఫరా చేయడానికి జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థతో (ఎన్ఎండీసీ) కీలక ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఎన్ఎండీసీ ఏటా 5 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని సరఫరా చేయనుంది. కడప ఉక్కు కర్మాగారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసిన విషయం వి దితమే. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎన్ఎండీసీ, ఏపీ హైగ్రేడ్ స్టీల్స్ సంస్థ ప్రతినిధులు ఒ ప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇది చరిత్రాత్మకమైన ఒప్పందంగా ముఖ్యమంత్రి అభివర్ణించారు.

- ఉక్కు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే చర్యల్లో భాగంగా తొలివిడతలో కర్మాగారానికి సమీపంలో ఉన్న గనుల నుంచి ఎన్ఎండీసీ ముడి ఇనుమును సరఫరా చేయనుంది.
- వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లి, పెదనందలూరు గ్రామాల్లో ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేయడానికి ముఖ్యమంత్రి సోమవారం వైఎస్ జగన్ శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించి ప్రాథమిక కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది.
- ఈ యూనిట్ కోసం 3,295 ఎకరాలను ఏపీహైగ్రేడ్ స్టీల్స్‌కు ప్రభుత్వం కేటాయించింది. నీటి అవసరాలకు గండికోట రిజర్వాయర్ నుంచి 2 టీఎంసీలను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.
- ఈ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కావడం ద్వారా 10,000 మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించడంతో పాటు పరోక్షంగా ఇంతకు రెండింతల మందికి ఉపాధి లభించనుంది.



## ఇండియా టూర్ స్క్వాష్ టోర్నీ విజేత హరీందర్ పాల్ సంధూ

సొంతగడ్డపై భారత స్క్వాష్ రాకెట్స్ సమాఖ్య (ఎస్ఆర్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో జరిగిన ఇండియా టూర్ టోర్నమెంట్‌లో భారత ప్లేయర్ హరీందర్ పాల్ సంధూ విజేతగా అవతరించాడు. ముంబైలో శనివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో నాలుగో సీడ్ హరీందర్ 11–5, 11–6, 11–7తో ఏడో సీడ్ టొమొటకా ఎండో (జపాన్)పై విజయం సాధించాడు. ఇదే టోర్నీ మహిళల సింగిల్స్ విభాగం ఫైనల్లో హనా రమదాన్ (ఈజిప్ట్) 11–8, 6–11, 11–4, 11–3తో లూసీ టర్మెల్ (ఇంగ్లండ్)ను ఓడించి టైటిల్ దక్కించుకుంది.

# విజయంతో వీడ్కోలు చెబుతారా!

భారత జట్టు ఈ ఏడాది 27 వన్డేలు ఆడితే 18 గెలిచింది. ఎనిమిది మ్యాచ్‌లలో ఓడగా, మరొకటి రద్దయింది. ప్రపంచ కప్‌లో సెమీఫైనల్ వరకు చేరిన టీమిండియా... ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, వెస్టిండీస్ లను వారి సొంతగడ్డపైనే ఓడించి మూడు సిరీస్ విజయాలు సాధించింది. అయితే స్వదేశంలో మాత్రం ఆసీస్ చేతిలో సిరీస్ చేజార్చుకున్న మన టీమ్ ఇప్పుడు ఏడాది చివరి సిరీస్ చివరి మ్యాచ్ పోరుకు సన్నద్ధమైంది. గత మ్యాచ్ తరహాలోనే వెస్టిండీస్‌ను చిత్తు చేసి 2019ని ఘనంగా ముగించాలని పట్టుదలగా ఉంది. ఐదేళ్ల తర్వాత ఇటీవలే అఫ్గానిస్తాన్‌పై తొలి ద్వైపాక్షిక సిరీస్ నెగ్గిన విండీస్ కూడా మరో గెలుపుతో సత్తా చాటాలని పట్టుదలగా ఉంది.


నవదీప్ సైనీ


కోహ్లి

మధ్యాహ్నం గం.1.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

- సిరీస్ గెలుపే లక్ష్యంగా భారత్
- పట్టుదలగా వెస్టిండీస్
- కటక్‌లో నేడు చివరి వన్డే
- ఈ ఏడాది ఆఖరి మ్యాచ్ ఆడనున్న టీమిండియా

**కటక్:** భారత్, వెస్టిండీస్ పోరు చివరి ఘట్టానికి చేరింది. టి20 సిరీస్‌ను భారత్ గెలుచుకున్న అనంతరం జరిగిన రెండు వన్డేల్లో ఇరు జట్లు చెరొకటి నెగ్గి సమ ఉజ్జీగా నిలిచాయి. ఈ నేపథ్యంలో సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మూడో వన్డేలో నేడు భారత్, విండీస్ తలపడనున్నాయి. బలాబలాలపరంగా ఇప్పటికీ భారత్‌దే పైచేయిగా కనిపిస్తున్నా... ఈ పర్యటనలో ప్రత్యర్థి ఆటను చూస్తే వారిని తక్కువగా అంచనా వేయడానికి వీల్లేదు. కోహ్లి సేన తమ ఆధిపత్యం ప్రదర్శించి సిరీస్‌ను ఖాతాలో వేసుకుంటుందా అనేది ఆసక్తికరం.

### బౌలింగ్‌లో సమస్య!

గాయం కారణంగా దీపక్ చాహర్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని స్థానంలో వచ్చిన నవదీప్ సైనీ ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయలేదు. ఒత్తిడితో నిండిన చివరి పోరులో అతడికి అవకాశం ఇస్తే ఏమాత్రం ప్రభావం చూపగలడనేది కీలకం. మరో పేసర్ శార్దుల్ కూడా అంతంత మాత్రంగానే బౌలింగ్ చేస్తున్నాడు. దాంతో సీనియర్ షమీపై భారం మరింత పెరిగింది. వైజాగ్ మ్యాచ్‌లో హ్యాట్రిక్‌తో అదరగొట్టిన కుల్దీప్ యాదవ్ మరోసారి కీలకం కానున్నాడు. అయితే భారత్ అదనపు స్పిన్నర్‌తో బరిలోకి దిగుతుందా చూడాలి. అదే జరిగితే శార్దుల్ స్థానంలో చహల్‌కు అవకాశం దక్కవచ్చు. కోహ్లిలాంటి స్టార్ 'సున్నా' చుట్టిన తర్వాత కూడా జట్టు 387 పరుగులు సాధించిందంటే టీమిండియా బ్యాటింగ్ సామర్థ్యం ఏమిటో అంచనా వేయవచ్చు. ఓపెనర్లు రోహిత్, రాహుల్ తిరుగులేని బ్యాటింగ్ మరోసారి భారత్‌కు శుభారంభం అందిస్తే ప్రత్యర్థికి కష్టాలు తప్పవు. రెండు మ్యాచ్‌లలో కలిపి ఐదు బంతులు ఎదుర్కొని కోహ్లి నాలుగు పరుగులు మాత్రమే చేయడం ఆశ్చర్యకరం! అయితే అతని స్థాయికి తర్వాతి మ్యాచ్‌లోనే పరుగుల వరద పారించడం పెద్ద కష్టం కాదు. బరాబతి స్టేడియంలో గతంలో ఆడిన నాలుగు మ్యాచ్‌లలో వరుసగా 3, 22, 1, 8 పరుగులు మాత్రమే చేసిన కోహ్లికి ఇప్పుడు దానిని కూడా సవరించే అవకాశం ఉంది. యువ ఆటగాళ్లు అయ్యర్, పంత్ జంటగా చెలరేగిపోవడం శుభ పరిణామం. ఆ తర్వాత బ్యాటింగ్‌లో జాదవ్, జడేజా కూడా తమ వంతు పాత్ర పోషించగలరు. మొత్తంగా బౌలింగ్ కాస్త బలహీనపడిన కారణంగా భారత బ్యాటింగ్ బలగం తమపై ఉన్న అంచనాలకు అనుగుణంగా ఆడితే గెలుపు ఖాయం.


పొలార్డ్ హెట్‌మైర్

### మార్పుల్లేకుండానే...

విశాఖ వన్డేలో భారత బ్యాట్స్‌మెన్‌ను అడ్డుకోవడంలో విండీస్ బౌలర్లు పూర్తిగా విఫలమయ్యారు. ముఖ్యంగా కాట్రెల్‌ను కోలుకోలేని విధంగా మనోళ్లు దెబ్బ కొట్టారు. అయితే ఐపీఎల్‌లో భారీ మొత్తానికి అమ్ముడై ఉత్సాహంగా ఉన్న కాట్రెల్ మళ్లీ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నాడు. అతనికి జోసెఫ్, హోల్డర్ అండగా నిలవడం ముఖ్యం. స్పిన్నర్ ఖారీ పైర్ భారీ స్కోర్లు నమోదైన గత మ్యాచ్‌లో మెరుగైన గణాంకాలే నమోదు చేశాడు కాబట్టి ఈసారి కూడా అతని నుంచి పొదుపైన బౌలింగ్‌ను విండీస్ ఆశిస్తోంది. బ్యాటింగ్‌లో హోప్ అద్భుతమైన ఫామ్‌లో ఉండగా, మరో ఓపెనర్ లూయిస్ కూడా చెలరేగిపోగలడు. రెండో వన్డేలో అనూహ్యంగా రనౌట్ కాకుండా ఉంటే హెట్‌మైర్ కూడా మ్యాచ్‌ను శాసించేవాడు. తాజాగా ఐపీఎల్ వేలం తర్వాత అతని ఆత్మవిశ్వాసం కూడా రెట్టింపైంది. హెట్‌మైర్‌ను భారత్ నిలువరించలేకపోతే కష్టం. పూరన్ బ్యాటింగ్ మెరుపులు కూడా గత మ్యాచ్‌లో కనిపించాయి. అయితే కెప్టెన్ పొలార్డ్ మాత్రం చెప్పుకోదగ్గ ఆటతీరు కనబర్చలేదు. కెప్టెన్ కావడంతో పాటు విధ్వంసక బ్యాట్స్‌మన్‌గా తనకున్న గుర్తింపును బట్టి ఒక్కటైనా మెరుపు ఇన్నింగ్స్ ఆడాలని వెస్టిండీస్ కోరుకుంటోంది. ఈ మ్యాచ్‌లోనైనా పొలార్డ్ ప్రభావం చూపగలడా అనేది ఆసక్తికరం.

### తుది జట్లు (అంచనా)

**భారత్:** కోహ్లి (కెప్టెన్), రోహిత్, రాహుల్, అయ్యర్, పంత్, జాదవ్, జడేజా, షమీ, కుల్దీప్, సైనీ, శార్దుల్/చహల్.
**వెస్టిండీస్:** పొలార్డ్ (కెప్టెన్), హోప్, లూయిస్, హెట్‌మైర్, పూరన్, ఛేజ్, హోల్డర్, కీమో పాల్, జోసెఫ్, పైర్, కాట్రెల్,

### పిచ్, వాతావరణం

బ్యాటింగ్‌కు బాగా అనుకూలమైన వికెట్. భారీ స్కోరుకు అవకాశం ఉంది. ఈ మైదానంలో వన్డే జరిగి మూడేళ్లయింది. భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య జరిగిన నాటి మ్యాచ్‌లో ఏకంగా 747 పరుగులు నమోదయ్యాయి. మంచు ప్రభావం కూడా ఉంది కాబట్టి మరోసారి టాస్ గెలిచే జట్టు ఫీల్డింగ్‌కు మొగ్గు చూపడం ఖాయం. మ్యాచ్‌కు వర్షం నుంచి ముప్పు లేదు.

# ఒకేసారి 27 రికార్డులు బద్దలు

## ఖతర్ కప్‌లో రజతం గెలిచిన భారత లిఫ్టర్ జెరెమీ లాల్‌రినుంగా



**దోహా:** ఖతర్ కప్ అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ టోర్నమెంట్‌లో యూత్ ఒలింపిక్స్ చాంపియన్, భారత యువతార జెరెమీ లాల్‌రినుంగా రజత పతకం సాధించాడు. పురుషుల 67 కేజీల విభాగంలో పోటీపడిన మిజోరం లిఫ్టర్ లాల్‌రినుంగా మొత్తం 306 (స్నాచ్‌లో 140 కేజీలు+క్లీన్ అండ్ జెర్క్‌లో 166 కేజీలు) కేజీలు బరువెత్తి రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 17 ఏళ్ల లాల్‌రినుంగా తన పేరిటే ఉన్న ఐదు సీనియర్ జాతీయ రికార్డులను, ఐదు జాతీయ జూనియర్ రికార్డులను, ఐదు జాతీయ యూత్ రికార్డులను, మూడు యూత్ వరల్డ్ రికార్డులను, మూడు ఆసియా యూత్ రికార్డులను, ఆరు కామన్వెల్త్ రికార్డులను బద్దలు కొట్టాడు.

# ట్రయల్స్‌కు బాక్సర్ నిఖత్ అర్హత

## మేరీకోమ్‌తో పోటీకి అవకాశం



**న్యూఢిల్లీ:** ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌లో పాల్గొనేందుకు నిర్వహించనున్న సెలక్షన్ ట్రయల్స్‌కు తెలంగాణ బాక్సర్ నిఖత్ జరీన్ అర్హత సాధించింది. 51 కేజీల విభాగంలో మేరీకోమ్, జ్యోతి గులియా, రితూ గ్రేవాల్‌లతో పాటు నిఖత్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ నెల 27, 28 తేదీల్లో ట్రయల్స్ జరుగుతాయి. ఈ నలుగురు బాక్సర్లకు ర్యాంకింగ్స్ కేటాయించగా మేరీకోమ్ మొదటి, నిఖత్ రెండో స్థానంలో ఉన్నారు. భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) నిబంధనల ప్రకారం తొలి స్థానంలో ఉన్న మేరీకోమ్, నాలుగో స్థానంలో ఉన్న రితూతో తలపడుతుంది. జ్యోతిని నిఖత్ ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈ రెండు బౌట్‌లలో గెలిచిన వారి మధ్య ఫైనల్ బౌట్ ఉంటుంది. మేరీ, నిఖత్ తమ తొలి బౌట్‌లలో విజయం సాధిస్తే వారిద్దరు ఫైనల్లో తలపడతారు. తుది విజేతకు మాత్రమే ఫిబ్రవరిలో చైనాలో జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత్ తరఫున పాల్గొనే అవకాశం ఉంటుంది.

# భారత మహిళల 'ఎ' జట్టుకు రెండో ఓటమి

## వరుసగా రెండో విజయంతో సిరీస్ నెగ్గిన ఆసీస్ 'ఎ'


వేద

**గోల్డ్ కోస్ట్ (ఆస్ట్రేలియా):** భారత మహిళల 'ఎ' జట్టుతో జరుగుతున్న అనధికారిక మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌ను ఆస్ట్రేలియా మహిళల 'ఎ' జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సొంతం చేసుకుంది. శనివారం జరిగిన రెండో టి20లో ఆస్ట్రేలియా 37 పరుగుల తేడాతో భారత్‌పై విజయం సాధించింది. దీంతో సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 145 పరుగులు చేసింది. సారథి తహిలా మెక్‌గ్రాత్ (40 బంతుల్లో 46; 5 ఫోర్లు, సిక్స్), బ్రిడ్జెట్ ప్యాటర్సన్ (27 బంతుల్లో 37; 4 ఫోర్లు) ఆకట్టుకోగా... చివర్లో స్యామి జో జాన్సన్ (12 బంతుల్లో 24; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడింది. భారత బౌలర్లలో హైదరాబాద్ అమ్మాయి అరుంధతి రెడ్డి (2/22) రాణించింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 108 పరుగులు చేసి ఓడిపోయింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ (1) విఫలమైంది. వేద కృష్ణమూర్తి (35 బంతుల్లో 38; 3 ఫోర్లు, సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచింది. చివర్లో అరుంధతి రెడ్డి (14 బంతుల్లో 19; 1 ఫోర్లు, సిక్స్) దూకుడుగా ఆడటంతో భారత్ స్కోరు 100 పరుగులు దాటగలిగింది. తొలి టి20లో భారత్ 9 వికెట్ల తేడాతో ఓడగా... నామమాత్రపు మూడో టి20 ఈనెల 23వ తేది జరుగుతుంది.

# రెండో ర్యాంక్‌లోనే రాధ

## ఐసీసీ మహిళల టి20 ర్యాంకింగ్స్



**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా ప్రకటించిన మహిళల బౌలింగ్ టి20 ర్యాంకుల్లో... భారత ఎడంచేతి వాటం స్పిన్నర్ రాధా యాదవ్ (769 రేటింగ్ పాయింట్లు) తన రెండో ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. టాప్ స్థానంలో ఆస్ట్రేలియా బౌలర్ మెగాన్ స్కట్ (773 రేటింగ్ పాయింట్లు) ఉంది. ఇక ఇతర భారత బౌలర్లలో దీప్తి శర్మ ఒక స్థానం కోల్పోయి ఐదో స్థానానికి పడిపోగా... పూనమ్ యాదవ్ ఆరో స్థానంలో కొనసాగుతోంది. బ్యాటింగ్ విభాగంలో భారత ప్లేయర్లు తమ ర్యాంక్‌లను కాపాడుకున్నారు. జెమీమా రోడ్రిగ్స్ నాలుగో స్థానంలో ఉండగా... స్మృతి మంధాన ఐదు, హర్మన్‌ప్రీత్ కౌర్ తొమ్మిదో స్థానాల్లో నిలిచారు. ఇక మహిళల టి20 జట్ల విభాగంలో భారత్ 260 రేటింగ్ పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఆస్ట్రేలియా 293 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా... ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

# కోచ్ అర్జున్ యాదవ్‌ను తొలగించండి

- అనుభవం లేని ఆటగాళ్లతో రంజీ ట్రోఫీలో హైదరాబాద్ తడబాటు
- శాట్స్ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి వ్యాఖ్య



**సాక్షి, హైదరాబాద్:** అనుభవం లేని ఆటగాళ్లు, అర్హత లేని కోచ్ అర్జున్ యాదవ్ కారణంగానే రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు ఘోర పరాజయాల్ని చవిచూస్తోందని తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర్ రెడ్డి వ్యాఖ్యానించారు. తక్షణమే అర్జున్ యాదవ్‌ను తొలగించి అన్ని అర్హతలు ఉన్న కోచ్‌ను హైదరాబాద్‌కు నియమించాలని ఆయన హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)ను కోరారు. 'పంజాబ్‌తో జరిగిన రంజీ ట్రోఫీలో హైదరాబాద్ ఇన్నింగ్స్ 125 పరుగులతో ఓడటం సిగ్గుచేటు. అనుభవం లేని క్రికెటర్లు జట్టులో ఉన్నారు. హెచ్‌సీఏ కక్ష సాధింపు ధోరణిని విడిచిపెట్టి అనువజ్ఞుడైన అంబటి రాయుడును తిరిగి హైదరాబాద్ జట్టులో ఆడించాలి. కోచ్ అర్జున్ యాదవ్‌ను కూడా వెంటనే తప్పించి ఆయన స్థానంలో అర్హత ఉన్న మరో కోచ్‌ను నియమించాలి. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ వెంటనే జోక్యం చేసుకోవాలి. హెచ్‌సీఏ అధ్యక్షుడు అజహరుద్దీన్‌తో మాట్లాడి హైదరాబాద్ రంజీ జట్టులోకి రాయుడును తీసుకొచ్చే అంశంపై కేటీఆర్ శ్రద్ధ తీసుకోవాలని కోరుతున్నా. ఇలా చేస్తేనే హైదరాబాద్ జట్టుకు మేలు జరుగుతుంది' అని వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు.

# పట్టుబిగించిన పాక్

- వరుసగా రెండో సెంచరీతో ఆబిద్ అలీ రికార్డు
- శ్రీలంకతో రెండో టెస్టు


ఆబిద్ అలీ


మసూద్

**కరాచి:** లేటు వయసు (32 ఏళ్లు)లో టెస్టు అరంగేట్రం చేసిన పాకిస్తాన్ ఓపెనర్ ఆబిద్ అలీ మళ్లీ అదరగొట్టాడు. శ్రీలంకతో జరిగిన తన అరంగేట్రం టెస్టులో శతకంతో కదంతొక్కిన అతను... తాజాగా రెండో టెస్టులోనూ సెంచరీ (281 బంతుల్లో 174; 21 ఫోర్లు, సిక్స్)తో ఆకట్టుకున్నాడు. దాంతో ఆడిన తొలి రెండు టెస్టుల్లోనూ సెంచరీలు చేసిన తొలి పాకిస్తాన్ క్రికెటర్‌గా ఆబిద్ చరిత్రకెక్కాడు. ఓవరాల్‌గా ఈ ఘనత సాధించిన తొమ్మిదో క్రికెటర్‌గా నిలిచాడు. అరంగేట్రం చేసిన వన్డే, టెస్టు మ్యాచ్‌ల్లో సెంచరీలు చేసిన తొలి క్రికెటర్‌గా ఆబిద్ అలీ ఇప్పటికే తన పేరును రికార్డు పుస్తకాల్లో లిఖించుకున్నాడు. ఆబిద్‌కు మరో ఓపెనర్ షాన్ మసూద్ శతకం (198 బంతుల్లో 135; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు) కూడా తోడవడంతో పాకిస్తాన్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి 104 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 395 పరుగులు చేసింది. దీంతో 315 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ప్రస్తుతం అజహర్ అలీ (57 బ్యాటింగ్; 4 ఫోర్లు), బాబర్ ఆజమ్ (22 బ్యాటింగ్; ఫోర్) క్రీజులో ఉన్నారు. ఓవర్‌నైట్ స్కోరు 57/0తో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ ఓపెనర్లు ఆబిద్, మసూద్ శ్రీలంక బౌలర్లను ఒక ఆట ఆడుకున్నారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 278 పరుగులు జోడించారు. పాకిస్తాన్‌కు టెస్టుల్లో తొలి వికెట్‌కు ఇది రెండో అత్యుత్తమ భాగస్వామ్యం కావడం విశేషం. అమీర్ సోహైల్– ఇజాజ్ అహ్మద్ (1997) జోడీ ఇదే గ్రౌండ్‌లో వెస్టిండీస్‌పై నెలకొల్పిన 298 పరుగుల భాగస్వామ్యం తొలి స్థానంలో ఉంది.

# గోల్‌కీపర్ నిర్లక్ష్యం...

## గెలవాల్సిన మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్న హైదరాబాద్


కమల్‌జీత్

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ ఆటగాళ్ల శ్రమను జట్టు గోల్ కీపర్ కమల్‌జీత్ సింగ్ వృథా చేశాడు. సొంత మైదానంలో గెలవాల్సిన చోట తన నిర్లక్ష్యంతో హైదరాబాద్ జట్టు 'డ్రా'తో సరిపెట్టుకునేలా చేశాడు. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) సీజన్–6 ఫుట్‌బాల్ టోర్నీలో భాగంగా శనివారం ఇక్కడి జీఎంసీ బాలయోగి స్టేడియంలో అట్లెటికో డి కోల్‌కతాతో జరిగిన మ్యాచ్‌ను హైదరాబాద్ 2–2తో 'డ్రా'గా ముగించింది. 90వ నిమిషంలో ప్రత్యర్థి ఆటగాడి నుంచి బంతి అందుకున్న కమల్‌జీత్... అవసరం లేకపోయినా బంతిని గాల్లోకి తన్నాడు. అయితే ఆ బంతి గతి తప్పి నేరుగా హైదరాబాద్ 'డి' బాక్స్ ముందే కాచుకొని ఉన్న ప్రత్యర్థి కోల్‌కతా ప్లేయర్ హెర్నాండెజ్ దగ్గరికి వెళ్లడం... అతను హెడర్‌తో కృష్ణ రాయ్‌కు పాస్ ఇవ్వడం చకచకా జరిగిపోయాయి. కృష్ణ ఎటువంటి పొరపాటు చేయకుండా బంతిని గోల్ పోస్టులోకి పంపి స్కోరును 2–2తో సమం చేశాడు. దీంతో మైదానంలోని హైదరాబాద్ అభిమానులు షాక్‌కు గురయ్యారు. మైదానంతా ఒక్కసారిగా మూగబోయింది. కమల్‌జీత్ నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు జట్టు డిఫెండర్, భారత జట్టు సభ్యుడైన ఆదిల్ ఖాన్ ఆగ్రహంతో గోల్‌కీపర్ మీదకు దూసుకెళ్లగా... అక్కడే ఉన్న సహచర ఆటగాళ్లు అతనిని నిలువరించారు. అంతకుముందు 15వ నిమిషంలో కృష్ణ రాయ్ గోల్‌తో కోల్‌కతా 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. 39వ నిమిషంలో బోబో గోల్‌తో హైదరాబాద్ స్కోరును సమం చేసింది. అనంతరం 85వ నిమిషంలో బోబో మళ్లీ గోల్ చేయడంతో హైదరాబాద్ 2–1తో ఆధిక్యంలోకి వెళ్లింది. కానీ చివరి క్షణాల్లో గోల్‌కీపర్ నిర్లక్ష్యం కారణంగా హైదరాబాద్ గోల్‌ను సమర్పించుకుంది.

# హైదరాబాద్ ఎదురీత

## కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీ

**సాక్షి, హైదరాబాద్:** కల్నల్ సీకే నాయుడు అండర్–23 క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు ఎదురీదుతోంది. ఉత్తర్‌ప్రదేశ్‌తో జరుగుతోన్న ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ ఓటమిని తప్పించుకునేందుకు పోరాడుతోంది. ఫాలోఆన్ ఆడుతూ ఓవర్‌నైట్ స్కోరు 4/0తో శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ ఆట ముగిసే సమయానికి 91 ఓవర్లలో 8 వికెట్లకు 220 పరుగులతో నిలిచింది. మూడోరోజు ఆట మొత్తం పట్టుదలగా నిలిచినప్పటికీ ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే హైదరాబాద్ ఇంకా 151 పరుగులు చేయాల్సి ఉంది. బుద్ధి రాహుల్ (100 బ్యాటింగ్; 17 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ సెంచరీతో జట్టును ఆదుకున్నాడు. శ్రేయస్ వాలా (43; 6 ఫోర్లు) రాణించాడు. ప్రస్తుతం రాహుల్‌తో పాటు అమ్మార్ అయూబ్ (0 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. ఉత్తర్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 484 పరుగులు చేయగా.. హైదరాబాద్ 113 పరుగులకు ఆలౌటైంది.

# రాణించిన పున్నయ్య, చైతన్య

## కూచ్ బెహర్ క్రికెట్ టోర్నమెంట్

**ముంబై:** కూచ్ బెహర్ క్రికెట్ టోర్నమెంట్‌లో హైదరాబాద్ జట్టు కోలుకుంటోంది. తొలుత బౌలింగ్‌లో రాణించి ముంబైని కట్టడి చేసిన హైదరాబాద్ అనంతరం బ్యాటింగ్‌లోనూ కుదురుకునేందుకు ప్రయత్నిస్తోంది. శరద్ పవార్ క్రికెట్ స్టేడియంలో ముంబై జట్టుతో జరుగుతోన్న ఈ మ్యాచ్‌లో శనివారం ఆట ముగిసే సమయానికి హైదరాబాద్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 34 ఓవర్లలో 4 వికెట్లకు 96 పరుగులతో నిలిచింది. వైష్ణవ్ రెడ్డి (42) రాణించాడు. ప్రస్తుతం తుషార్ (7 బ్యాటింగ్), ప్రతీక్ రెడ్డి (23 బ్యాటింగ్; 4 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. హైదరాబాద్ ఇంకా 22 పరుగులు వెనుకబడి ఉంది. ముంబై బౌలర్లలో దర్శన్ 2 వికెట్లు దక్కించుకున్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 113/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ముంబై జట్టును హైదరాబాద్ బౌలర్లు పున్నయ్య (5/92), వెంకట చైతన్య (4/83) కట్టడి చేశారు. వీరిద్దరూ రాణించడంతో ముంబై జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.5 ఓవర్లలో 243 పరుగులకు ఆలౌటైంది.

# మూగజీవాల మృత్యుఘోష



- అర్ధరాత్రి డివైడర్‌ను ఢీకొట్టిన వ్యాన్
- 15 పశువుల మృత్యువాత
- హైదరాబాద్‌కు తరలిస్తుండగా ప్రమాదం

**వాజేడు:** మూగజీవాలను తరలిస్తున్న ఓ గూడ్స్ వ్యాన్ శనివారం తెల్లవారుజామున ప్రమాదానికి గురైంది. వ్యాన్‌లో మొత్తం 40 మూగ జీవాలు ఉండగా.. అందులో 15 మృతి చెందాయి. మరో 10 పశువులు తీవ్రంగా గాయపడ్డాయి. భద్రాచలం జిల్లా చర్ల మండలం వైపు నుంచి ములుగు జిల్లా వాజేడు మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తుండగా.. వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్ వద్ద డివైడర్‌ను ఢీకొట్టి దానిపైకెక్కి ఒక పక్కకు ఒరిగిపోయింది. దీంతో వ్యాన్‌లోని రెండు అరల్లో ఒక అరకు ఏర్పాటు చేసిన చెక్కలు ఊడి పోవడంతో పైన ఉన్న పశువులు కింది అరలో ఉన్నవాటిపై పడ్డాయి. తెల్లవారుజామున సంఘటన జరగడంతో ఉదయం వరకు ఎవరికీ తెలియలేదు. మూగ జీవాలను రక్షించే అవకాశం లేకుండా పోయింది. గాయ పడిన పశువులు తెల్లవార్లూ వాహనంపై నుంచి వేలాడుతూ.. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న దృశ్యం ప్రతి ఒకరినీ కలచి వేసింది. గాయపడిన మూగ జీవాలకు బయటకు తీయించి గోపాల మిత్ర అనుముల కృష్ణారావు, మరో గోపాల మిత్రతో వైద్యం చేయించారు. మృతి చెందిన వాటిని స్థానికుల సహకారంతో బయటకు తీయించి రహదారి పక్కన ఉంచారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.



# గోదావరి లోయలో బొగ్గు నిక్షేపాలు

## జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ బిస్వజిత్

**కేయూ క్యాంపస్ :** ప్రాణహిత గోదావరి లోయ ప్రాంతాల్లోనూ బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని, పలు చోట్ల అన్వేషణ కొనసాగుతోందని జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ బిస్వజిత్ గంగోపాధ్యాయ అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా కాకతీయ యూనివర్సిటీ జియాలజీ విభాగంలో శనివారం జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'భువి సంవాద్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రాణహిత గోదావరి లోయ.. కోల్డ్ ఫీల్డ్ అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. 'భూభౌతిక పద్ధతుల ద్వారా ఖనిజ అన్వేషణ' అనే అంశంపై వజ్రాలు లభించే ప్రాంతాల గురించి సీనియర్ సైంటిస్టు బంగారు బాబు వివరించారు. కార్యక్రమంలో జియాలజీ విభాగం అధిపతి కె.డేవిడ్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్‌వర్మ, సతీష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


# DELHI POLICE

## NOTICE

### DIRECT RECRUITMENT FOR THE POST OF HEAD CONSTABLE (ASSISTANT WIRELESS OPERATOR/TELE-PRINTER OPERATOR) IN DELHI POLICE EXAMINATION, 2019

**ONLINE REGISTRATION OPENING DATE: 28.12.2019**
**ONLINE REGISTRATION CLOSING DATE: 27.01.2020**
**Official website: www.delhipolice.nic.in**

Online applications are invited from Male and Female Indian citizens for filling up the following vacancies for the post of temporary Assistant Wireless Operator/Tele-printer Operator (Head Constable) (Group 'C') in Delhi Police in Level-4 in pay matrix (₹25500-81100) plus usual and admissible allowances to the Central Government Employees from time to time. They will be governed under Delhi Police Act and Central Civil Services Rules applicable to other members of the force and other Acts and Rules applicable from time to time. On appointment they shall be entitled for the pension benefits as per the "New Restructured Defined Contributory Pension Scheme" applicable for the new entrants to the Central Government Services with effect from 01.01.2004:-

| Name of Post | | | No. of Vacancies* | | | | | | Pay Matrix Level |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | GEN./UR | EWS | OBC | SC | ST | Total | |
| Head Constable (AWO/TPO) | Male | Open | 134 | 40 | 93 | 76 | 49 | 392 | Pay Matrix Level-4 (₹ 25500-81100) |
| | | Departmental | 15 | 04 | 10 | 08 | 06 | 43 | |
| | Female | Open | 67 | 19 | 45 | 38 | 24 | 193 | |
| | | Departmental | 07 | 02 | 05 | 04 | 03 | 21 | |
| | | TOTAL | 223 | 65 | 153 | 126 | 82 | 649 | |

*The number of vacancies is indicative and may undergo change anytime before declaration of final result.

**Note:-**

I. 10% vacancies are reserved for Ex-Servicemen (Ex-SM) as per Govt. of India's instructions. The personnel of Central Para Military Forces are not eligible to apply under Ex-Servicemen category.

II. Abbreviations used are UR-Un-Reserved, EWS-Economically Weaker Section, OBC-Other Backward Class, SC-Scheduled Caste and ST-Scheduled Tribe.

Candidates from all parts of the country fulfilling the following conditions can apply:-

(1) **Age as on 01.07.2019:-** 18 to 27 years for UR/EWS candidates, relaxable for following category of candidates upto the age of:-
- OBC- 30 years.
- SC/ST-32 years.
- Widow/Divorced Women/Judicially separated women who are not re-married:- 35 years for UR/EWS (38 years for OBC and 40 years for SC/ST).
- Sportsmen/Sportswomen:- 32 years for UR/OBC/EWS (37 years for SC/ST) who have represented State at the National level and Country at the International level.
- Departmental candidate of Delhi Police:- 40 years for UR/EWS (43 years for OBC and 45 years for SC/ST) who have rendered 03 years regular and continuous service in Delhi Police.
- For Ex-Servicemen, as per rules.

(2) **Educational Qualification:-** 10+2 (Senior Secondary) pass from a recognized Board with Science & Mathematics as subjects.

OR

National Trade Certificate (NTC) in the trade of Mechanic-Cum-Operator Electronic Communication System.

(3) **Professional Requirement :-**
- English word processing speed-1000 key depressions in 15 minutes.
- Basic knowledge of Computer Functions:- Opening/Closing of PC, printing, MS office usage, saving & modification in typed text, paragraph setting & numbering etc.

**CAUTION:-**

(i) Furnishing of false information or suppression of any factual information in the application form would be a disqualification for the post.

(ii) In the event of any forgery/falsification of any document(s) being detected at any stage, besides cancellation of candidature, a criminal case will also be registered against the candidate, as per law.

**APPLICATION FORMS:-** Only those Applications which are successfully filled up through the Website **www.delhipolice.nic.in** shall be accepted. Application forms sent in any other format shall be rejected.

**Fee:-** The application fee would be ₹100/- (only online). SC/ST/Ex-Servicemen and women candidates are exempted from payment of fee.

Before applying for the post, candidates should go through the Recruitment Notice carefully and ensure that they fulfill all the eligibility conditions like Age-Limit/ Essential Qualifications(EQs)/ etc. as indicated above. Candidature of candidates not meeting the eligibility conditions will be cancelled at any stage of the recruitment process without any notice. Candidature of Applicants shall be purely provisional at all stages of the recruitment process.

**For details, the applicants are requested to go through the detailed advertisement appearing in the Employment News/Rozgar Samachar dated 28.12.2019** and Delhi Police website: **www.delhipolice.nic.in**. It contains category-wise number of vacancies, eligibility conditions, procedure of filling the form, terms & conditions as well as information regarding various tests like Computer Based Examination, Physical Endurance & Measurement Tests (PE&MT), Trade Test and Test of Proficiency in Computer Operation as prescribed for the post. Applicants should understand all the information and instructions carefully before applying for the post.

**(M.I. HAIDER)**
DEPUTY COMMISSIONER OF POLICE,
ESTABLISHMENT, DELHI

DP/9183/19


# కొత్త'తరం'.. కొండంత దూరం

## చేనేతపై ఆసక్తి చూపని యువతరం

- రాష్ట్రంలో 17,573 చేనేత మగ్గాలు
- రెట్టింపు సంఖ్యలో మరమగ్గాలు 36,088
- చేనేతను మింగిన పవర్‌లూమ్స్
- జియో ట్యాగింగ్‌తో పక్కాగా లెక్కలు

*అగ్గిపెట్టెలో ఇమిడే చీరలను మగ్గాలపై నేసిన చేనేత కార్మికుల కళావైభవం కాలక్రమంలో మరుగున పడుతోంది. చేనేత మగ్గాలను నేసే కార్మికులు వయో భారంతో ఉన్నారు. కొత్త వారు ఈ రంగంలోకి రావడం లేదు. దీంతో ఆఖరు తరం చేనేత మగ్గాలపై శ్రమిస్తోంది. ప్రభుత్వం రాష్ట్రంలోని చేనేత మగ్గాలకు, మరమగ్గాల (పవర్‌లూమ్స్)కు జియోట్యాగింగ్ చేయించింది. దీంతో రాష్ట్రంలోని మగ్గాల సంఖ్య పక్కాగా లెక్క తేలింది. చేనేత మగ్గాలు మరణశయ్యపై ఉన్నాయనే విషయం తాజా సర్వేల్లో వెల్లడైంది. రాష్ట్రంలో మరమగ్గాల సంఖ్య పెరుగుతుండగా.. చేనేత మగ్గాలు, కార్మికుల సంఖ్య తగ్గుతోంది.* సిరిసిల్ల



సిరిసిల్లలో మూలకు పడిన చేనేత మగ్గాల విడిభాగాలు

### 'చితి'కి 'పోతున్న' కార్మికులు



చంద్రయ్య

చేనేత మగ్గంపై బట్ట నేస్తున్న ఇతని పేరు మామిడాల చంద్రయ్య (92). సిరిసిల్ల విద్యానగర్‌లో ఉండే చంద్రయ్య బుద్ధి తెలిసినప్పటి నుంచి చేనేత మగ్గంపై బట్టనేస్తున్నాడు. ఒకప్పుడు చేనేత వస్త్రాల తయారీతో మంచిగా బతికాడు. ఇల్లు కట్టుకున్నాడు. భార్య కమలమ్మ ముగ్గురు కొడుకులు, ఒక్క కూతురుతో కలిసి జీవించాడు. కానీ ఆయన మలి సంధ్యలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని 2019 మే 26న మరణించాడు. ఆయనకు ప్రభుత్వం ద్వారా చిల్లిగవ్వ ఆర్థిక సాయం రాలేదు. ఇప్పుడు భార్య కమలమ్మ ఇబ్బందుల్లో ఉంది. ఆయన నేసిన చేనేత మగ్గం మూలన పడింది. ఇది ఒక్క చంద్రయ్య దుస్థితే కాదు.. రాష్ట్రంలోని చేనేత కార్మికుల అందరి పరిస్థితి ఇదే.

**ఆరు పదుల వయస్సులో..**

చిన్న చేపను పెద్ద చేప మింగినట్లుగా చేనేత మగ్గాలను మరమగ్గాలు (పవర్‌లూమ్స్) మింగేశాయి. కాలంతో పోటీ పడలేక.. జిగిసచ్చిన వృద్ధ కార్మికులు మరో పని చేతకాక.. వయసు మీద పడినా.. జానెడు పొట్ట కోసం కళ్లు కనిపించకపోయినా.. ఒళ్లు సహకరించకున్నా.. కాళ్లు, చేతులు ఆడిస్తూ.. బట్టను నేస్తున్నారు. చేనేత కార్మికులంతా 60 ఏళ్ల నుంచి 90 ఏళ్ల వయసున్న వారు ఇంకా మగ్గంపై శ్రమిస్తూ పొట్టపోసుకుంటున్నారు. కుటుంబ అవసరాల కోసం తక్కువ కూలీ ఉన్నా... మగ్గాన్నే నమ్ముకున్న కార్మికులు మలి సంధ్యలో పని చేస్తున్నారు. సిరిసిల్లలో మూడు చేనేత సహకార సంఘాలు ఉండగా.. 55 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరంతా 60 ఏళ్లు పైబడిన వారే. మీరు బట్ట నేస్తే రూ.20 ఇస్తారు. రోజుకు 4 నుంచి 5 మీటర్ల బట్ట నేస్తూ చేనేత కార్మికులు జీవనం సాగిస్తున్నారు. అత్యంత కష్టతరమైన ఈ పనిలో వయోవృద్ధులు శ్రమించడం బాధాకరం. ఈ పనిని కొత్తగా ఎవ్వరూ నేర్చుకోకపోవడంతో ఈ తరం తనువు చాలిస్తే.. చేనేత మగ్గాలు మూలకు పడాల్సిందే.

**మరమగ్గాల జోరు**

రాష్ట్రంలోని 17 జిల్లాల్లో మరమగ్గాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 36,088 మరమగ్గాలు ఉండగా.. 17,573 చేనేత మగ్గాలు ఉన్నాయి. గతంలో నాలుగు జిల్లాలకే పరిమితమైన మరమగ్గాలు ఇప్పుడు 17 జిల్లాలకు విస్తరించినట్లు సర్వేలో తేలింది. రాష్ట్ర ప్రభుత్వం జియో ట్యాగింగ్ నిర్వహించగా ఏ మగ్గం ఎక్కడా ఉందనేది. ఎవరు పని చేస్తున్నారు. ఏమేమీ ఉత్పత్తులు చేస్తున్నారనే వివరాలు స్పష్టంగా తెలిసింది. అత్యధికంగా సిరిసిల్ల జిల్లాలో 26,494 మరమగ్గాలు ఉన్నాయి. ఇలా మరమగ్గాల సంఖ్య పెరుగుతుండగా.. చేనేత మగ్గాల సంఖ్య తగ్గుతోంది.

**సర్కార్ చేయూత**

వస్త్రోత్పత్తి రంగానికి ప్రభుత్వ పరంగా పెద్ద ఎత్తున ప్రోత్సాహం లభిస్తుంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగానికి మూడేళ్లలో రూ.1244 కోట్ల ఆర్డర్లు లభించాయి. దీంతో సిరిసిల్ల పరిశ్రమ కుదుట పడింది. మరమగ్గాల ఆధునీకరణకు కేంద్ర ప్రభుత్వం కూడా చేయూతనివ్వడం కాస్తా ఉపకరించింది. అదే చేనేత మగ్గాలకు ప్రభుత్వ పరంగా పెద్దగా రాయితీలు లేకపోవడంతో చేనేత పరిశ్రమ వయోభారంతో ఉంది

### కూలీ డబ్బులు సరిపోవడం లేదు



సిరిసిల్లలో బతుకమ్మ చీరల ఉత్పత్తితో మంచి వేతనం లభించింది. వారానికి రూ.3000 నుంచి రూ.3500 వరకు వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వ ఆర్డర్లు పూర్తి అయ్యాయి. దీంతో మళ్లీ పాలిస్టర్ బట్ట నేస్తున్నాం. వారానికి రూ.1,500 వస్తుంది. కుటుంబ పోషణకు వచ్చే కూలీ డబ్బులు సరిపోవడం లేదు. **కందుకూరి రమేశ్, పవర్‌లూమ్ కార్మికుడు**

### నెలంతా పనిచేస్తే 1500



నాకు మరో పని రాదు. చేనేత మగ్గంపై బట్టనేస్తాను. నా భార్య పెంటవ్వ. ఏం సాతగాదు. పక్షవాతంతో మంచంపై ఉంది. నెలకు రూ.1,600 మందులు కావాలే. ఇద్దరు కొడుకులు ఎవరికి వారు బతుకుతున్నారు. మేమిద్దరమే ఉంటున్నాం. నెలంతా పని చేస్తే రూ.1500 వస్తాయి. ఖర్చులకు సరిపోతలేవు. **హన్మాండ్లు, చేనేత కార్మికుడు**

# ఉత్తమ పంచాయతీలకు ప్రోత్సాహకాలు

## మంత్రి ఎర్రబెల్లి ప్రకటన



**పాల్వంచ రూరల్:** ఉత్తమ గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహకాలు అందిస్తామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో శనివారం పలు పంచాయతీలకు ట్రాక్టర్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన వాటికి ప్రథమ బహుమతి రూ.50 లక్షలు, ద్వితీయ రూ.40 లక్షలు, తృతీయ రూ.30 లక్షలు, నాలుగో స్థానం సాధించిన పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున ప్రోత్సాహకాలు అందిస్తామని వివరించారు. ఈ నిధులతో గ్రామాలను మరింతగా అభివృద్ధి చేసుకోవచ్చని చెప్పారు. ట్రాక్టర్లను గ్రామాభివృద్ధి పనులకే వినియోగించాలని, వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటే సర్పంచ్‌లపై చర్య తప్పదని హెచ్చరించారు. కేంద్రం నుంచి ఎలాంటి సహకారం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి పంచాయతీలకు రూ.332 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. 500 జనాభా ఉన్న పంచాయతీలకు రూ.8 లక్షలు, 1000 జనాభా ఉంటే రూ.16 లక్షలు, 2000 జనాభా ఉంటే రూ.32 లక్షలు చొప్పున మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీ నామా నాగేశ్వర రావు, ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, రేగా కాంతారావు, బానోత్ హరిప్రియ, పొదెం వీరయ్య పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
**ప్రజారోగ్యం మరియు మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ**
**ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన**

**పనుల పేర్లు: (1) NIT No.43/Devarakonda/UGD/SDF/2019-20,తేది: 20.12.2019** దేవరకొండ మున్సిపాలిటీ- మున్సిపాలిటీలకు సహాయం క్రింద దేవరకొండ మున్సిపాలిటీలో 187 నం.ల అభివృద్ధి పనులు (1 నుండి 20 వరకు గల వార్డులలో 185 CC రోడ్డు & డ్రెయిన్లు, వార్డ్ నం.20లో ఖిల్లా ఏరియాలో UGD మరియు పార్క్ అభివృద్ధి). **మొత్తం ECV : రూ.21.46 కోట్లు.** బిడ్ దాఖలు ముగింపు తేది: 08-01-2020 సా.4:30 గం. **(2) NIT No.41/TUFIDC/Unit-II/ZHB/Street Lighting/2019-20,తేది: 20.12.2019 (2వ పిలుపు).** జహీరాబాద్ మున్సిపాలిటీ-TUFIDC రుణ సహాయం క్రింద జహీరాబాద్ మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు స్ట్రీట్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయుట. **మొత్తం ECV : రూ.62.07 లక్షలు. (3) NIT No.42/TUFIDC/Unit-II/ZHB/ Bhagareddy Stadium/Lighting/2019-20,తేది: 30.11.2019 (2వ పిలుపు).** జహీరాబాద్ మున్సిపాలిటీ- TUFIDC రుణ సహాయం క్రింద జహీరాబాద్ మున్సిపాలిటీలో బాగారెడ్డి స్టేడియం వద్ద 6 నం.ల ఫ్లడ్ లైట్ పోల్స్. **మొత్తం ECV : రూ.75.94 లక్షలు. (4) NIT No.36/TUFIDC/Unit-II/Andole Jogipet/Beautification of Roads/2019-20,తేది: 20.12.2019 (7వ పిలుపు).** అందోల్ జోగిపేట నగర పంచాయతీ-TUFIDC రుణ సహాయం క్రింద అందోల్ జోగిపేట నగర పంచాయతీలో రోడ్ల సుందరీకరణ. **మొత్తం ECV : రూ.80.82 లక్షలు.** (2, 3 & 4 పనులు. ముగింపు తేది: 30-12-2019 సా.4:30 గం.). తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ @ **tender.telangana.gov.in** లో చూడవచ్చును.

**సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్ (PH), TUFIDC, UNIT-II (FAC)**
DIPR Ro.No.2038-DP/CL/Advt/1/2019-20, Dt: 21.12.2019



# GREATER WARANGAL MUNICIPAL CORPORATION

**Roc.No. E2/32904/2019** **Dt. 20-12-2019**

**Sub:** GWMC - EE (Env.) - Inviting Sealed Quotations for unit price for Supply of Four Wheeler Swachh Auto (Diesel Operated) for Door to Door Garbage Collection and Transporation to Processing unit — Regarding.

**Ref:** G.O.Rt.No. 682 M.A. & U.D. Dept., Govt. of Telangana, Dt. 21-10-2019.

*****

With reference to the subject and reference cited, sealed quotations are invited from reputed companies / manufacturers / authorised dealers or agencies for Supply of Four Wheeler Swachh Autos (Diesel Operated) for Door to Door Garbage Collection and Transporation to Processing unit in Greater Warangal Municipal Corporation limits on or before **02-01-2020** by Post / Hand in the following manner to the address mentioned below **by 4-30 P.M.**

| Specifications | Total Cost* of supply and Delivery within the GWMC Limits for Single Swachh Auto (Rs) |
|---|---|
| **Vehicle type: 4W Minimum 16 HP BS IV** | |
| **Battery: 12V** | |
| **Container** | |
| Closed Box Swacch Auto type | |
| Container Capacity (Min 3 cum) | |
| Closed Box shall have Separator/Compartments for Wet& Dry (60% Wet : 40 % Dry) with 4 doors open on top for loadingand one at rear side for unloading with hinge arrangement. | |
| **Container Body** | |
| Bottom - Min 2 mmthick Aluminium sheet over the base sheet. Inner Side including doors: Min 2 mm thick Aluminium Sheet over the side base sheet of 2mm thick MS / GI sheet. Outer Side Body including doors: 2 mm thick MS Sheetover the side base sheetof 2mm thick MS / GI sheet. Partition: 2 mm thick GI Sheet. | |
| Hydraulic Tipping (Min.45°) with Single acting with manual stabilizers with maximum operating pressure of 60 bar. | |
| GPS for Vehicle Tracking System | |
| Public Addressing System with all ancillary units. | |
| Provision for GWMC Branding as per Dept. instruction. | |
| Painting | |
| Two Coat of Zinc Based Primer, Two Coats of PU Paint or Anti-rust (Aluminium coat) | |
| Seating arrangement (Driver + One) | |
| Warranty period: Two Years for Engine and Hydraulic System. | |
| **Electrical:** All electrical system components as per AIS 008 (as per chasis part supply). Rear Marker, Height marker Lamps, etc as per AIS 090 (as per chasis part supply). | |
| Tool Kit with Spare wheel. | |

* **Note:** Total cost shall include cost of the Swachh auto (1 NO), registration cost (temporary and permanent), all taxes such as road tax, GST etc, insurance, transportation charges etc. and any other incidental charges.

* Firms shall submit the detail technical specifications of the vehicle along with the quotation.

**Contact: 9701999037; ee1gwmc@gmail.com**

Sd/- **Executive Engineer** (Env)
Greater Warangal Municipal Corporation
Circle I, Kasibugga, Warangal 506022.




ముస్తాబైన మల్లన్న ఆలయం

## నేడు కొమురవెల్లి
# మల్లన్న కల్యాణం

### పట్టువస్త్రాలు సమర్పించనున్న హరీశ్

**సాక్షి సిద్దిపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొమురవెల్లి ఆలయం మల్లన్న కల్యాణ మహోత్సవ వేడుకలకు ముస్తాబైంది. వీరశైవ ఆగమ శాస్త్ర సంప్రదాయం ప్రకారం శ్రీమల్లికార్జున స్వామికి, బలిజ మేడలమ్మ, గొల్ల కేతమ్మల కల్యాణ మహోత్సవ వేడుకకు సర్వం సిద్ధం చేశారు. కొమురవెల్లిలోని తోట బావి వద్ద కల్యాణ వేదికను పందిళ్లతో అందంగా అలంకరించి సిద్ధం చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల 45 నిమిషాలకు వీరశైవ ఆగమ పండితులతో మల్లన్న కల్యాణం నిర్వహించనున్నారు. స్వామివారి కల్యాణం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపునమంత్రి హరీశ్‌రావు తలంబ్రాలు, పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

## విద్యాశాఖ మంత్రి తెలుసా?

### విద్యార్థులకు విద్యాశాఖ కార్యదర్శి ప్రశ్న

**ఎల్కతుర్తి:** వరంగల్ అర్బన్ జిల్లా ఎల్కతుర్తిలోని ఆదర్శ పాఠశాలను రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.జనార్దన్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నైపుణ్యాలను ఆరా తీసే క్రమంలో పలు రకాల ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పేరు ఏమిటని అడగగా విద్యార్థుల నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అదే విధంగా మరికొన్ని ప్రశ్నలకు సైతం సమాధానాలు రాకపోవడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇక విద్యార్థి రాజు పాఠశాలకు రాలేదని తెలుసుకున్న జనార్దన్‌రెడ్డి ఆయన తండ్రికి ఫోన్ చేసి వివరాలపై ఆరా తీశారు. పిల్లలకు పనులు చెప్పకుండా రోజూ బడికి పంపించాలని సూచించారు.



విద్యార్థిని ప్రశ్నిస్తున్న జనార్దన్ రెడ్డి

# సెల్‌టవర్ దగ్ధం



దగ్ధమవుతున్న సెల్ టవర్

**నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ నగరంలోని గాజుల్‌లో శనివారం మధ్యాహ్నం ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సెల్ టవర్ దగ్ధం అయ్యింది. ఉదయం నుంచి కరెంట్ లేకపోవడంతో టవర్‌కు చెందిన జనరేటర్ పారంభించారు. అది కాస్త వేడెక్కి మంటలు అంటుకున్నాయి. సెల్ టవర్ వైర్లకు మంటలు అంటుకొని పైకి ఎగబాకాయి. దీంతో రెండు గంటల పాటు దట్టమైన పొగ, మంటలు చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. సుమారు రూ. 20 లక్షల నష్టం వాటిల్లినట్లు సెల్ టవర్ సిబ్బంది తెలిపారు.



యాగం పూర్ణాహుతి

# మతం ముసుగు వేయడం అవివేకం

### శారదా పీఠాధిపతి శ్రీ నర్సింహ భారతిస్వామి

**హన్మకొండ కల్చరల్:** హిందూ సమాజంపై మతం ముసుగు వేయడం అవివేకమని శారదా పీఠాధిపతి శ్రీ నర్సింహ భారతిస్వామి అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో తాటిపల్లి శ్రీనివాస్, తాటిపల్లి రోజారాణి దంపతుల నిర్వహణలో నిర్వహించిన అతిరుద్ర యాగం శనివారం మహాపూర్ణాహుతితో ముగిసింది. శ్రీ నర్సింహ భారతిస్వామి, ఆదిలాబాద్ జిల్లా గోపాలకృష్ణ మఠానికి చెందిన శ్రీశ్రీ యోగానంద సరస్వతి స్వామి పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా వేములవాడ దేవాలయం వేదపండితులు రాజారవిచంద్ర శాంతికల్యాణం నిర్వహించారు.



బస్సులో ప్రయాణిరాలితో మాట్లాడుతున్న పువ్వాడ

# ఆర్టీసీ బస్సులో 'పువ్వాడ'

**మంచుపల్లి:** రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శనివారం ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఎంపీ నామా నాగేశ్వర్ రావు, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్‌తో కలిసి బస్సెక్కారు. ఖమ్మం నుంచి కొత్తగూడెం వరకు ప్రయాణించారు. అనంతరం బస్టాండ్ పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

# విరిగిన రైలు పట్టా



**కేసముద్రం:** మహబూబాబాద్ జిల్లా తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ 431/7-9 అప్‌లైన్‌లో ట్రాక్‌పై రైలు పట్టా శనివారం విరిగింది. దీనిని గమనించిన కీమెన్ రైల్వే అధికారులకు సమాచారం ఇవ్వగా.. విరిగిన పట్టా వద్ద తాత్కాలికంగా రెండు వైపులా పట్టీలను అమర్చారు. ఆ తర్వాత రైళ్లను యథావిధిగా నడిపించారు.



# లెబనాన్‌లో ప్రజాగ్రహం



లెబనాన్‌లో వాట్సాప్ కాల్స్‌పై 20 శాతం వరకు పన్ను విధించడానికి ప్రభుత్వం చేసిన సన్నాహాలు ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. అప్పటికే ప్రభుత్వ అవినీతితో విసిగి వేసారిన జనం దేశ ఆర్థిక సమస్యలు, అసమానతలు, అవినీతిని తగ్గించడానికి బదులుగా సామాన్యుల సదుపాయాలపై ఈ కొత్త రకం వడ్డింపులేమిటంటూ నిరసనలకు దిగారు. వేల సంఖ్యలో రోడ్లపైకి వచ్చి ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అవినీతికి పాల్పడే ఈ తరహా ప్రభుత్వాన్ని ఎక్కడా చూడలేదని ఆందోళనకారులు నినదించారు. భారీగా పెట్టుబడులు వస్తున్నప్పటికీ ప్రభుత్వ అనకొండలు వాటిని మింగేస్తున్నారు తప్ప ప్రజలకు సదుపాయాలను కల్పించడం లేదు. లెబనాన్ రాజకీయ అనిశ్చితి కూడా దేశాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తోంది. అక్కడ కరెన్సీ కూడా దొరకడం లేదు. ప్రజాగ్రహంతో దిగొచ్చిన లెబనాన్ ప్రభుత్వం రాజకీయ నేతల జీతాల్లో భారీగా కోతలు విధించి, ఎన్నో ఆర్థిక సంస్కరణల్ని తీసుకువచ్చింది. అయినప్పటికీ సామాన్యుల ఆగ్రహం చల్లారలేదు. చివరికి ప్రధానమంత్రి హరీరి రాజీనామా చేయాల్సి వచ్చింది. విద్యావేత్త అయిన హసన్ దియాబ్ ప్రధాని పదవిని దక్కించుకోనున్నారు. నాలుగు వారాల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామంటున్న ఈ విద్యావేత్త దేశాన్ని ఎలా సంస్కరిస్తారా అని సామాన్యులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# ఈజిప్టులో 'అవినీతి' మంటలు..



ఈజిప్టు రాజధాని కైరోలో అత్యంత అరుదైన నిరసనలు ఈ ఏడాది కనిపించాయి. ప్రభుత్వ అధికారులు ప్రజాధనాన్ని తమ సొంత ఖర్చుల కోసం వినియోగించుకుంటున్నారంటూ నిరసనకారులు రోడ్డెక్కారు. సెప్టెంబర్ చివరి వారంలో కైరో, అలెగ్జాండ్రియా తదితర నగరాల్లో వేలాది మంది ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి అధికారుల అవినీతిపై ప్రశ్నించారు. పోలీసు యంత్రాంగం ఉక్కుపాదంతో ఈ ఉద్యమాన్ని అణచివేసి ఎడాపెడా అరెస్టులు చేసింది.



ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. విద్యుద్దీపాల కాంతితో మిరుమిట్లు గొలుపుతున్న ఈ క్రిస్మస్ చెట్టు చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ క్రిస్మస్ చెట్టును అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో ఉన్న గ్రీన్ పార్కులో ఏర్పాటు చేశారు.

# పారామెడికల్ బోర్డులో అక్రమాలు

**అనుమతి లేని సీట్లకు రెన్యువల్ చేసేలా రాయబారం**

- బోర్డులో ఓ కీలకాధికారి సూచనతో వసూళ్లు
- ఇప్పటికే ఓ హోటల్‌లో చేతులు మారిన డబ్బులు
- 15 వేల సీట్ల రెన్యూవల్ కోసం పెద్ద ఎత్తున ప్రయత్నాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర పారామెడికల్ బోర్డు అవకతవకలకు కేంద్రంగా మారింది. పారామెడికల్ సీట్లను రెన్యూవల్ చేసే విషయంలో భారీగా ముడుపులు చేతులు మారుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 15 వేల సీట్లు రెన్యూవల్ చేయాల్సిన అంశం కావడంతో పారామెడికల్ కాలేజీ యాజమాన్యాలు బోర్డు అధికారులతో రాయబారాలు నెరుపుతున్నట్లు సమాచారం. తాజాగా దీనికి సంబంధించిన ఒక వాట్సాప్ సందేశం వైద్య ఆరోగ్య శాఖలో చక్కర్లు కొడుతోంది. రెన్యూవల్ కావాల్సిన కాలేజీ యాజమాన్యాలు ఫలానా తేదీన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌కు డబ్బులు తీసుకుని రావాలన్నది ఆ సందేశం సారాంశం. ఇప్పటికే ఆ రోజున భారీగా డబ్బులు చేతులు మారాయని సమాచారం. ఈ ముడుపుల వ్యవహారం బోర్డుకు చెందిన ఓ కీలకాధికారి ఆదేశం మేరకే జరిగిందన్న చర్చ జరుగుతోంది.

**అనుమతి లేకుండానే సీట్ల పెంపు..**

రాష్ట్ర పారామెడికల్ బోర్డు ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేటు పారామెడికల్ కాలేజీలున్నాయి. అందులో 10 ప్రభుత్వ పారామెడికల్ కాలేజీలు కాగా, 210 ప్రైవేటు కాలేజీలున్నాయి. ప్రైవేటు కాలేజీల్లో ప్రస్తుతం 30 వేల సీట్లున్నాయి. ఇంటర్ తర్వాత ఈ కోర్సుల్లో ప్రవేశానికి అర్హులు. మొత్తం 17 రకాల పారామెడికల్ కోర్సులున్నాయి. మెడికల్ ల్యాబ్, డయాలసిస్, రేడియో థెరపీ, డెంటల్, కార్డియాలజీ, ఈసీజీ తదితర టెక్నీషియన్లు సహా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ వంటి పారామెడికల్ కోర్సులున్నాయి. ఇవన్నీ పారామెడికల్ బోర్డు ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఆస్పత్రుల్లో వైద్యులకు, డయాగ్నస్టిక్ సెంటర్లలో సాంకేతికంగా సాయం చేసే సిబ్బంది కోర్సులన్నింటినీ పారామెడికల్ బోర్డు ఆధ్వర్యంలోని కాలేజీల్లో బోధిస్తున్నారు. ఒక్కో కోర్సుకు 60 సీట్ల వరకు అనుమతి ఉంది. అలా కొన్ని కాలేజీలు నాలుగైదు కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఇదిలావుంటే 2014 వరకు తెలంగాణలో కేవలం 11 వేల వరకు మాత్రమే పారామెడికల్ సీట్లుండగా, 2014–15 మధ్యకాలంలో ఏకంగా 19 వేల సీట్లు పెరిగాయి. ఆయా సీట్లను అప్పట్లో ప్రభుత్వానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపకుండా, కనీసం అనుమతి కూడా తీసుకోకుండా పెంచుతూ నాటి పారామెడికల్ బోర్డు సమావేశం నిర్ణయం తీసుకోవడం వివాదాస్పదమైంది. ఇది నిబంధనలకు విరుద్ధమని తేలింది. సీట్ల పెంపులో భారీగా అక్రమాలు జరిగాయని నిర్ధారణ జరిగినట్లు వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఒక కాలేజీకి 2 కోర్సులుంటే, మరో రెండు మూడు కోర్సులకు అనుమతివ్వడం జరిగింది.

**ఆ సీట్లకు రెన్యువల్ కాకపోవడంతో...**

పారామెడికల్ కాలేజీకి ప్రతీ ఐదేళ్లకోసారి రెన్యువల్ చేస్తారు. ఆ ప్రకారం 2018–19 ఏడాదికి రెన్యువల్ చేయాలి. కానీ 2014లో పెంచిన సీట్లకు ప్రభుత్వ అనుమతి లేనందున ఈసారి ఆ సీట్లకు రెన్యూవల్ చేసేది లేదని నాలుగైదు నెలల క్రితం పారామెడికల్ బోర్డు నిర్ణయం తీసుకుంది. కొందరు కోర్టుకు వెళ్లి కొన్ని సీట్లను సాధించారు. దీంతో అవి మినహాయించి ఇప్పుడు 15 వేల సీట్ల రెన్యూవల్ వ్యవహారం నడుస్తోందని పారామెడికల్ వర్గాలు తెలిపాయి. వాస్తవంగా సీట్లు పెంచాలంటే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని, తర్వాత హైపవర్ కమిటీ పరిశీలించాలని, అనంతరం సర్కారు ఉత్తర్వులు జారీ చేశాక పారామెడికల్ బోర్డు దాన్ని ఆమోదించాలన్నది నిబంధన. ఈ నిబంధన నాడు అమలు కానందున, ఐదేళ్ల క్రితం పెంచిన పారామెడికల్ సీట్ల రెన్యూవల్‌పై ఏంచేయాలో చెప్పాలని బోర్డు ప్రభుత్వానికి లేఖ రాసింది. దీంతో అగ్గి రాజుకుంది. ఇన్నేళ్లు తాము నడుపుకున్న సీట్లను ఒక్కసారి తీసేస్తే ఎలాగన్న ఆందోళనను యాజమాన్యాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల బోర్డులో అధికారులు, ఉద్యోగులు మారిన నేపథ్యంలో రెన్యూవల్‌పై పెద్దఎత్తున ముడుపుల వ్యవహారం నడుస్తోందన్న చర్చ జరుగుతోంది. వసూళ్ల పర్వం ప్రారంభించారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఒకట్రెండు రోజుల్లో జరిగే పారామెడికల్ బోర్డులో ఏం నిర్ణయం తీసుకుంటారోనన్న చర్చ జరుగుతోంది.

# 'అచ్చంపేట' డాక్టర్లపై వేటు!

**డాక్టర్ల లైసెన్స్ రద్దు కోసం మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు**

**సాక్షి, హైదరాబాద్:** అచ్చంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చోటుచేసుకున్న ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. నిర్లక్ష్యంగా వ్యవహరించి కడుపులోనే బిడ్డ మరణానికి కారణమైన డాక్టర్లపై తీవ్ర చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఈ మేరకు డెలివరీ చేసిన డాక్టర్ల లైసెన్స్ రద్దు చేయాలని కోరుతూ మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు చేయనున్నట్టు పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావు వెల్లడించారు. డెలివరీ చేసే ప్రయత్నంలో తల, మొండెం వేరైన విషయాన్ని పేషెంట్ కుటుంబసభ్యుల వద్ద, అధికారుల వద్ద డాక్టర్లు దాచినట్టు ఉన్నతాధికారులు, గైనకాలజీ ప్రొఫెసర్ల కమిటీ తేల్చింది. ఈ నేపథ్యంలో డెలివరీలో పాల్గొన్న అచ్చంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ తారాసింగ్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధారాణిలను సస్పెండ్ చేస్తూ పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 18న ఉదయం 9:45 గంటలకు అచ్చంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు నొప్పులతో బాధ పడుతున్న గర్భిణి స్వాతిని కుటుంబసభ్యులు తీసుకొచ్చారు. రికార్డులను పరిశీలించకుండానే, డెలివరీ కోసం ఆమెను నేరుగా లేబర్ రూమ్‌కు తీసుకెళ్లారు. అప్పటికే తల్లి కడుపులో నుంచి బిడ్డ తల బయటకు వచ్చినట్టు డాక్టర్లు సుధారాణి, తారాసింగ్ గుర్తించారు. బిడ్డను బయటకు తీసే క్రమంలో తల వేరైంది. మొండెం కడుపులోనే ఉండిపోయింది. ఈ విషయాన్ని పేషెంట్ కుటుంబ సభ్యులకు, ఉన్నతాధికారులకు తెలపకుండా పేషెంట్‌ను హైదరాబాద్‌కు రిఫర్ చేశారు. అయితే, అంతకుముందు నెలలో గర్భిణికి చేసిన స్కానింగ్‌లో హైరిస్క్ కేసుగా గుర్తించారు. ఈ రికార్డులేవీ పరిశీలించకుండా డెలివరీ చేసేందుకు ప్రయత్నించడం, తల వేరైన విషయాన్ని దాచిపెట్టడం, రిఫర్ చేసి చేతులు దులుపుకోవాలనుకోవడం చాలా పెద్ద తప్పిదమని.. ఈ నేపథ్యంలోనే డాక్టర్లపై చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు వెల్లడించారు.

సాగునీటి వ్యవస్థ పటిష్టానికి...

# క్షేత్రస్థాయి మేధోమథనం

**సీఎం సూచన మేరకు ఇరిగేషన్‌శాఖ పటిష్టంపై వర్క్‌షాప్‌లో చర్చించిన ఇంజనీర్లు**

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో సాగునీటిశాఖ పునర్వ్యవస్థీకరణపై మేధోమథనం జరిపేందుకు ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో శనివారం నిర్వహించిన ఒక్కరోజు వర్క్‌షాప్ విజయవంతమైంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశాల మేరకు ఆ శాఖ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్‌ఎం)పాలసీ తయారు చేయడం, సాగునీటి శాఖ పునర్వ్యవస్థీకరణ, శాఖ ఆస్తులు, ఇతర సాంకేతిక అంశాల జాబితా రూపకల్పన, శాఖ కార్యకలాపాలను ప్రభావితం చేసే చట్టాలు, ఇతర శాఖలతో సమన్వయం వంటి అంశాలపై సదస్సులో కూలంకషంగా చర్చించారు. కార్యాచరణపై ఇంజనీర్లు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. సాగునీటి శాఖ ఈఎన్‌సీ మురళీధర్ అధ్యక్షతన జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ఈఎన్‌సీ స్థాయి నుంచి ఈఈ స్థాయి వరకు 250 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. సదస్సు లక్ష్యాలను, ప్రభుత్వ ఆలోచనను పరిపాలనా విభాగపు ఈఎన్‌సీ నాగేంద్రరావు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న 1.25 కోట్ల ఎకరాల ఆయకట్టులో 75 లక్షల ఎకరాల ఆయకట్టు ఎత్తిపోతల పథకాల కిందే ఉందని, రానున్న రోజుల్లో వీటి నిర్వహణ కీలకం కానుందని తెలిపారు. సీఎం ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే మాట్లాడుతూ, కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు వీలుగా ఈఎన్‌సీల మధ్య పని విభజన జరగాలని సీఎం అభిలషించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ఎత్తిపోతల పథకాల్లో 80కి పైగా పంప్‌హౌస్‌ల నిర్వహణకు దీర్ఘకాలిక దృష్టితో ఒక సమగ్ర 'ఓఅండ్ ఎం'పాలసీని తయారు చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎత్తిపోతల సలహాదారులు పెంటారెడ్డి పథకాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. పంప్‌హౌస్‌లు, విద్యుత్ పరికరాలు, విద్యుత్ సరఫరా వ్యవస్థల నిర్వహణ, షిఫ్ట్ ఇంజనీర్ల బాధ్యతలు, సిబ్బంది అవసరాలు తదితర అంశాలపై వివరించారు. సదస్సులో ఈఎన్‌సీలు హరిరాం, నల్లా వెంకటేశ్వర్లు, అనిల్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు, శ్రీనివాస్ రెడ్డి, మధుసూదనరావు, బంగారయ్య, వీరయ్య, శంకర్, హమీద్ ఖాన్, నరసింహా, అనంత రెడ్డి, శ్రీదేవి, శ్రీనివాస రావు, అజయ్ కుమార్, మోహన్ కుమార్, శంకర్ నాయక్, వి.రమేశ్, వి.సుధాకర్, డీసీఈలు అజ్మల్‌ఖాన్, నరహరిబాబులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఈఎన్‌సీ మురళీధర్

**పదోన్నతుల సంగతి సీఎం దృష్టికి తీసుకెళ్లాలి..**

ఈ సందర్భంగా ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ప్రాజెక్టుల నిర్మాణ కార్యక్రమాలను వేగిరం చేయడానికి తాము కష్టించి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని సదస్సులో పాల్గొన్న ఇంజనీర్లు తెలిపారు. అయితే గత రెండేళ్లుగా కోర్టు కేసుల కారణంగా ఆగిపోయిన పదోన్నతులకు హైకోర్టు తీర్పుతో అన్ని అడ్డంకులు తొలగిపోయినందున వెంటనే పదోన్నతులు ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవాలని సూచించారు. దీని తర్వాత జనవరిలో మరో సదస్సును కూడా నిర్వహిస్తామని, అవసరమైతే సీఎం స్థాయిలో మరో విస్తృత స్థాయి సదస్సును నిర్వహిస్తామని ఈఎన్‌సీ మురళీధర్ అన్నారు.






# నేచర్‌క్యూర్‌లో సంతాన సాఫల్య కేంద్రం

**మందులు లేకుండానే ప్రకృతి వైద్యం ద్వారా చికిత్స అందిస్తాం: ఈటల**

**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని నేచర్ క్యూర్ ఆసుపత్రిలో సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, మందులు లేకుండా ప్రకృతి వైద్యం ద్వారా చికిత్స అందిస్తామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ వెల్లడించారు. నేచర్ క్యూర్ ఆసుపత్రిలో సాయంత్రం కూడా బీపీ, షుగర్, గైనిక్ సమస్యలపై ఔట్ పేషెంట్ విభాగాన్ని ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. శనివారం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి ఈటల అధ్యక్షతన జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో యోగ అధ్యయన పరిషత్, నేచర్ క్యూర్ ఆసుపత్రులపై చర్చించారు.

**2021 నుంచి నేచర్‌క్యూర్ పీజీ కోర్సు**

2021 సంవత్సరం నుంచి నేచర్ క్యూర్ కాలేజీలో పీజీ కోర్సులు ప్రారంభించనున్నట్టు ఈటల వెల్లడించారు. ప్రాణాయామంలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, పీజీ డిప్లొమా కోర్సులు ప్రవేశపెట్టాలని నిర్ణయించామన్నారు. బెంగళూరులో కంటే గొప్పగా ఇక్కడి నేచర్ క్యూర్ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని, దీని అభివృద్ధికి రూ.6 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేయగా, ఆ మొత్తాన్ని మంజూరు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ప్రపంచంలో భారతీయ ప్రకృతి వైద్య చికిత్స, యునాని, హోమియోపతి, ఆయుర్వేద వైద్య విధానాలు ఎంతో గొప్పగా చికిత్స అందించాయని చెప్పారు. ఈ సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శాంత కుమారి, ఆయుష్ కమిషనర్ అలుగు వర్షిణి, కాళోజీ యూనివర్సిటీ వీసీ కరుణాకర్‌రెడ్డి, గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్లు సుదర్శనాచార్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ ఇన్వాయిస్‌లతో

# కాజేశారు

**ఐఎంఎస్ కుంభకోణంలో మరో ఇద్దరు అరెస్ట్**

- 25 వరకు డొల్ల కంపెనీలతో వ్యవహారం
- అక్రమ డబ్బుతో కామారెడ్డిలో భూముల కొనుగోలు

**సాక్షి, హైదరాబాద్:** ఈఎస్‌ఐకి చెందిన ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) కేసులో మరో ఇద్దరు అరెస్టయ్యారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలు మాజీ డైరెక్టర్ దేవికారాణి, మాజీ జేడీ కలకుంట్ల పద్మలు నకిలీ బిల్లులతో, బినామీ కంపెనీలతో ఇష్టానుసారంగా పాల్పడ్డ అక్రమాలు ఇప్పటికే వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా దేవికారాణికి ఈ కుంభకోణంలో సహకరించిన సికింద్రాబాద్‌లోని విశాల్ ఎంటర్ ప్రైజెస్‌కి చెందిన పందిల్ల భూపాల్‌రెడ్డి, సికింద్రాబాద్‌లోని వసుధ మార్కెటింగ్‌కి చెందిన రెడ్డిమల్లి నాగేందర్ రెడ్డిలను ఏసీబీ శనివారం అరెస్టు చేసింది.

**ఎలా మోసం చేశారంటే..?**

ఎలాంటి టెండర్లు లేకుండా నాన్ రేటెడ్ కంపెనీ (ఎన్‌ఆర్‌సీ)లతో కుమ్మక్కయిన దేవికారాణి కొందరితో ఏకంగా డొల్ల కంపెనీలు ప్రారంభించింది. తేజ ఫార్మా కంపెనీకి చెందిన పందిరి రాజేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డిలకు ఈ దందాలో భూపాల్ రెడ్డి, నాగేందర్‌రెడ్డి బాగా సహకరించారు. అధిక ధరలకు కోట్ చేసిన ఇన్వాయిస్‌లు, సాఫ్ట్‌కాపీలు సృష్టించి, సనత్‌నగర్‌లోని దేవికారాణి నమ్మిన బంటు ఫార్మాసిస్టు కొడాలి నాగలక్ష్మికి ఇచ్చేవారు. ఆమె వాటిని దేవికారాణి వద్దకు తీసుకెళ్లి సంతకాలు చేయించి నిధులు విడుదలయ్యేలా చూసేది. వీరిద్వారా దేవికారాణి దాదాపు 25 డొల్ల కంపెనీలు తెరిపించినట్లుగా ఏసీబీ అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు. లేని కంపెనీలతో బిల్లులు పెట్టడం, అంతా పంచుకోవడం ద్వారా ఈఎస్‌ఐ సొమ్మును కాజేశారని వివరించారు.

**వచ్చిన సొమ్ముతో భూముల కొనుగోలు**

డొల్ల కంపెనీలు తెరిపించడంలో, నకిలీ బిల్లులు సృష్టించడంలో తేజఫార్మా, దేవికారాణికి సహకరించినందుకుగాను వీరికి కూడా భారీగా ముడుపులు దక్కాయి. ఈ డబ్బులతో భూపాల్‌రెడ్డి, నాగేందర్‌రెడ్డిలు కామారెడ్డి జిల్లా బికనూర్ వద్ద భారీగా వ్యవసాయ భూములు కొనుగోలు చేశారని ఏసీబీ తన విచారణలో తేల్చింది. నిందితులిద్దరిపైనా కుట్ర, మోసం తదితర సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌లో భాగంగా చంచల్‌గూడ జైలుకు తరలించారు.

# ఆర్టీసీ బస్సుల అద్దె పెంపు

**పెరిగిన టికెట్ చార్జీల ఆధారంగా సవరింపు**

**సాక్షి, హైదరాబాద్:** ఇటీవలే బస్సు చార్జీలు పెంచిన ఆర్టీసీ.. బస్సులను ప్రైవేటు కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చేందుకు సంబంధించిన చార్జీలను పెంచింది. పెంచిన రవాణా చార్జీలను పరిగణనలోకి తీసుకుని ఈ ధరలను సవరించింది. పల్లెవెలుగు మొదలు స్లీపర్ సర్వీసు వెన్నెల వరకు అన్ని కేటగిరీల బస్సు హైర్ చార్జీలను పెంచింది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు, యాత్రలు, ప్రైవేటు కార్యక్రమాలకు బల్క్‌గా బుక్ చేసుకుంటే ఆర్టీసీ సొంత బస్సులను కేటాయిస్తోంది. వీటికి శ్లాబ్ పద్ధతిలో ఛార్జీలు విధిస్తుంది. కనిష్టంగా 8 గంటలు–200 కి.మీ.లు. గరిష్టంగా 24 గంటలు–480 కి.మీ. పద్ధతిలో ఆ ధరలు ఉంటాయి. ఆక్యుపెన్సీ రేషియో ఆధారంగా సాధారణ సమయాలు, పీక్ సమయాలుగా పేర్కొంటూ వేరువేరు రేట్లు ఉంటాయి. ఇప్పుడు ఈ రేట్లన్నింటిని ఆర్టీసీ పెంచింది. కిలో మీటరుకు సంబంధించి పల్లెవెలుగుకు సాధారణ సమయాల్లో రూ.40, కీలక (పీక్) వేళల్లో రూ.44, ఎక్స్‌ప్రెస్ రూ.47, రూ.49, డీలక్స్ (దీనికి ఒకటే ధర) రూ.49, సూపర్‌లగ్జరీ రూ.50గా నిర్ధారించింది. వజ్ర బస్సులను తొలగించాలని నిర్ణయించినా.. అవి కొనసాగినన్ని రోజులు అమలుచేసేలా వాటి ధరలను కూడా సవరించింది. సిటీ బస్సులకు విడిగా ధరలు కేటాయించింది. కనిష్టంగా 6 గంటలు–90 కి.మీ., గరిష్టంగా 16 గంటలు–240 కి.మీ. ప్రాతిపదికన ఆ ధరలు ఉన్నాయి.






Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.